
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 16 | సంచిక: 290

బుధవారం 10-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అర్జున'తో అందలం

జాతీయ క్రీడా పురస్కారాలు అందుకున్న షమీ, అజయ్, హుసాముద్దీన్ - 14లో



ఆరంభ లాభాలు ఆవిరి

స్వల్ప లాభాలతో గట్టెక్కిన స్టాక్ సూచీలు సెన్సెక్స్ 31 పాయింట్ల లాభం - 15లో



లక్షద్వీప్‌లో ఎయిర్‌పోర్ట్..

పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో లక్షద్వీప్‌లోని మినికాయ్ దీవిలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం యోచిస్తోంది.

వివరాలు 6లో ▸



అయోధ్య ఉత్సవాలు ఓ గిమ్మిక్కు

అయోధ్యలో రామ మందిరం ప్రారంభం పేరుతో బీజేపీ గిమ్మిక్కులు చేస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



లాలూ కుటుంబీకులపై చార్జిషీట్

ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై లాలూ భార్య, కుమార్తె తదితరులపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది.

వివరాలు 6లో ▸



ఫ్రాన్స్ ప్రధానిగా గాబ్రియెల్ అట్టల్

ఫ్రాన్స్ ప్రధానిగా పిన్న వయస్కుడైన అట్టల్ నియమితులయ్యారు. ఆయన తనను 'గే' అని ప్రకటించుకున్నారు.

వివరాలు 6లో ▸

బ్రో.. ఇది దొంగ ఓటు!

జనసేన కార్యాలయం చిరునామాతో పవన్ కళ్యాణ్ ఓటు నమోదు


గత ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు పరిధిలో ఓటు

6 నెలల క్రితం చిరునామా మార్పు

ఓటు నమోదులో పార్టీ కార్యాలయం అడ్రస్ చెల్లుబాటుపై అనేక రకాల అనుమానాలు

- ఎన్నికల నిబంధనల ప్రకారం ఆర్డనరీ రెసిడెన్స్‌తోనే ఓటు నమోదుకు వీలు.. అంటే హైకోర్టు తీర్పు ప్రకారం రోజూ రాత్రి నిద్రపోయే నివాసం
- రాష్ట్రానికి అప్పుడప్పుడొచ్చే పవన్ ఎక్కువగా హోటల్‌లోనే బస
- తమ్ముడు బాటలోనే అన్న నాగేంద్రబాబు
- వడ్డేశ్వరంలోని దొంగ చిరునామాతో ఓట్ల నమోదుకు విఫలయత్నం
- తెలంగాణలో పోలింగ్ ముగిసిన మరునాడే ఆన్‌లైన్‌లో దరఖాస్తు.. అధికారుల తనిఖీలో దొంగ చిరునామాగా గుర్తింపు
- నోటీసు ఇచ్చినా అధికారుల ముందు ఇంటి యజమానే హాజరు.. దాంతో నాగేంద్రబాబు సహా కుటుంబసభ్యుల ఆరు ఓట్లు తిరస్కరణ

12 లో



దోర్ నంబర్ 11-1903ను అడ్రస్‌గా చూపించి జనసేన నేత పవన్‌కళ్యాణ్ నమోదు చేసుకున్న ఓటు



దోర్ నంబర్ 11-1903 మీద ఉన్న మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయం చిరునామా

రెండు లక్షల పుస్తకాలు చదివానన్న స్వయం ప్రకటిత మేధావి ఆయన.. విలువల గురించి, అనుబంధాల గురించి ఊగిపోతూ ప్రసంగించడం ఆయనకు అలవాటు.. అందరూ తనలాగే ఆలోచించాలని, తన మార్గంలోనే నడవాలని ప్రవచన పలుకులు పలకడం కూడా ఆయనకే సొంతం. 'చంద్రబాబు చేత.. చంద్రబాబు కొరకు.. చంద్రబాబు యొక్క..' అంటూ అందరూ ఆ బాబు బాగు కోసమే పరితపించాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన నేత. ఎన్నెన్నో నీతులు చెప్పే ఈ నేత నిబంధనలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయం చిరునామాతో ఓటు పొందడం ఇప్పుడు చర్చనీయాంశం. దెయ్యాలు వేదాలు వల్లించడం అంటే ఇదేమరి.



ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష

ఎన్నికల నిర్వహణపై విజయవాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఈసీ రాజీవ్ కుమార్, చిత్రంలో ఇతర అధికారులు 10 లో

ఫ్యాక్ట్‌చెక్

కాకి లెక్కలతో రోత

- కోత పెట్టాలనుకుంటే వెతికి మరీ పరిహారం ఎందుకిస్తారు రామోజీ?
- ప్రాథమిక – తుది నష్టం అంచనాలకు తేడా ఉండదా?
- కరువు, మిచాంగ్ తుపాను సాయం పంపిణీకి చురుగ్గా ఏర్పాట్లు
- రైతులకు రూ.5,942 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు
- వాటిలో ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలే రూ.2,558 కోట్లు

11 లో

ల్యాండ్ టైటిల్లింగ్ చట్టం ప్రజల ప్రయోజనం కోసమే



'ల్యాండ్ టైటిల్లింగ్ చట్టం ప్రజల ప్రయోజనాల కోసమే వచ్చింది. ఈ చట్టం వల్ల ఎవరికీ నష్టం జరగదు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఈ చట్టం చేసుకోవాలని కేంద్రం సూచించింది. సుదీర్ఘ అధ్యయనం తర్వాత కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇది వచ్చింది. మన చట్టాన్ని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. న్యాయవాదులతో పాటు అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నాకే నిబంధనలు రూపొందిస్తాం' అని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. న్యాయవాదులు ఆందోళన విరమించాలని విజ్ఞప్తి చేశారు.

- వివరాలు 5లో

బల్క్ ఫిర్యాదులు

బాబు కుట్రే



- అర్హుల ఓట్లు తొలగించేందుకు టీడీపీ పన్నాగం.. బల్క్ ఫిర్యాదులు అబద్ధమని తేలినందున చంద్రబాబు అండ్ కో పై చర్యలు తీసుకోవాలి
- మరోవైపు దొంగ ఓట్లను చేరుస్తున్న టీడీపీ
- గుర్తింపులేని జనసేనకు సీఈసీని కలిసే అవకాశం ఎలా ఇచ్చారు.. జనసేన టీడీపీ పార్టనరా? బీజేపీ పార్టనరా?
- గుర్తింపులేని పార్టీకి కామన్ సింబల్ చట్ట విరుద్ధం
- కేంద్ర ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ఫిర్యాదు

12 లో

సచివాలయ ఉద్యోగులతో

ఎన్నికలు వద్దు

- సీఈసీకి చంద్రబాబు, పవన్ ఉమ్మడి వినతిపత్రం
- ఓటర్ల జాబితాను మారుస్తున్నారు
- వలంటీర్లతో తప్పుడు పనులు చేయాలని చూస్తున్నారు
- మహిళా పోలీసులను బీఎల్‌వోలుగా పెడుతున్నారు

10 లో

మేమంటే అంత చులకనా బాబూ?

చంద్రబాబు వ్యాఖ్యలపై మహిళా పోలీసు సంఘం ఆగ్రహం

- ప్రభుత్వం నిర్వహించిన రాతపరీక్ష, ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యాం.. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే నియమితులయ్యాం
- తప్పుడు ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతాం

10 లో

అనంతపురం జిల్లా గుంతకల్లులో నిర్వహించిన సామాజిక సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



గుంతకల్లులో బడుగు, బలహీనవర్గాల విజయ యాత్ర

- సామాజిక సాధికార బస్సు యాత్రకు అడుగడుగునా నీరాజనాలు
- వేలాదిగా పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- పూలవర్షంతో స్వాగతం పలికిన ప్రజలు
- వేలాది మంది ప్రజలతో జనసంద్రంలా సభా ప్రాంగణం
- 'జై జగన్, గిరగిరా తిరగాలి ఫ్యాన్' అంటూ నినాదాలు

2 లో

కోర్టు ద్వారా లోకేశ్‌కు నోటీసులు ఇవ్వండి

ఆదేశించిన ఏసీబీ న్యాయస్థానం

- 'రెడ్ డైరీ' బెదిరింపుల కేసులో నోటీసులు తీసుకునేందుకు లోకేశ్ ససేమిరా
- అదే విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లిన సీఐడీ.. లోకేశ్ తీరుపై కోర్టు ఆగ్రహం
- నోటీసులు పంపాలని కోర్టు అధికారులకు ఆదేశం

12 లో



ఇటీవల రెడ్‌బుక్‌తో బెదిరిస్తున్న లోకేశ్

మాతృత్వానికే మచ్చ తెచ్చిన తల్లి



మాతృత్వానికే మచ్చ తెచ్చిన కన్నతల్లి ఘాతుకం ఇది. స్టార్టప్ కంపెనీ సీఈఓ సుచనా సేథ్ తన నాలుగేళ్ల కుమారుడిని గోవాలో హత్య చేసి.. కిరాతకంగా పసిబిడ్డ ప్రాణాలను బలితీసుకుంది. మృతదేహాన్ని మాయం చేసేందుకు కన్నబిడ్డ శవాన్ని బ్యాగ్‌లో కుక్కి.. ట్యాక్సీలో పారిపోతుండగా సోమవారం రాత్రి చిత్రదుర్గలో సుచనా సేథ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె ఈ దురాగతానికి ఒడిగట్టడానికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

- వివరాలు 6లో



పార్లమెంట్ టికెట్ కోసం చినబాబు పెట్టిన షరతులకు అర్జుడు ఒకరొచ్చార్సార్!!

లక్ష ఎకరాలు సస్యశ్యామలం

రికార్డు సమయంలో నెల్లూరు బ్యారేజీ పనులు పూర్తి



- కరోనా కాలంతోపాటు పెన్నాకు పోటెత్తిన వరదల్లోనూ కొనసాగిన పనులు
- ఆయకట్టులో విస్తారంగా పంటల సాగు.. రైతుల్లో ఆనందోత్సాహాలు
- నెల్లూరు, 77 గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- తప్పిన వరద ముప్పు
- జలయజ్ఞంలో భాగంగా పనులకు వైఎస్సార్ శ్రీకారం
- కాలయాపన, కమీషన్లతో సరిపుచ్చిన టీడీపీ సర్కారు
- ప్రాధాన్యతగా చేపట్టి వాయువేగంగా పూర్తి చేసిన సీఎం జగన్

11 లో

3 నెలలు టీడీపీ-జనసేన జెండాలు పట్టుకోండి

టీడీపీ అధినేత చంద్రబాబు

'రాష్ట్రంలో వచ్చే మూడు నెలలు టీడీపీ–జనసేన జెండాలు పట్టుకుని తిరగండి. టీడీపీ అధికారంలోకి వస్తే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తాం' అని ఆళ్లగడ్డ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు.

- వివరాలు 10లో

రా.. రమ్మన్నా.. రాని జనం

టీడీపీ ఆళ్లగడ్డలో నిర్వహించిన రా కదలిరా సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. సుమారు లక్ష మందితో సభ నిర్వహిస్తామని టీడీపీ నాయకులు గొప్పగా చెబుతూ వచ్చారు. కానీ, పదివేల మంది కూడా సభకు రాలేదు. తీసుకువచ్చిన వారు కూడా సభ మధ్యలోనే వెనుదిరగడంతో చంద్రబాబు అసహనానికి గురయ్యారు.

- వివరాలు 10లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆనందంగా పంటల సాగు



మాది సన్నకారు రైతు కుటుంబం. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం తూములూరులో రెండెకరాల పొలం ఉంది. ఒక ఎకరంలో వరి, మరో ఎకరంలో పసుపు, అరటి వేసేవాళ్లం. వ్యవసాయం చేయాలంటేనే ఒకప్పుడు భయం వేసేది. ఎప్పుడూ పెట్టుబడి కోసం అప్పులు చేయడం.. తీరా పంట చేతికొచ్చాక వాటిని తీర్చడం అలవాటుగా మారింది. భార్య నగలు బ్యాంకులో పెట్టి అప్పు తేవాల్సి వచ్చేది. దురదృష్టవశాత్తు ప్రకృతి అనుకూలించకపోతే ఆ ఏడాది అప్పు తీర్చలేక నానా అవస్థలు పడేవాళ్లం. కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. పిల్లలను చదివించుకోవటం ప్రశ్నార్థకంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మాకు వ్యవసాయ పెట్టుబడికి భయం లేకుండా పోయింది. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 ఇస్తోంది. ఆ డబ్బు సాగు ఖర్చుల కోసం.. ప్రధానంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు ఉపయోగ పడుతోంది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో వ్యయప్రయాసలు తొలిగాయి. ఉన్న ఊళ్లోనే అన్నీ దొరుకుతున్నాయి. కొద్దిపాటి బంగారు నగలు నా భార్య మెడలోనే ఉంటున్నాయి. ఆమె ఇంటిదగ్గర కుట్టు మిషనుపై బట్టలు కుడుతూ కుటుంబానికి తోడ్పాటుగా నిలుస్తోంది. ఆమెకు జగనన్న చేదోడు పథకం కింద ఏటా రూ.పది వేలు అందుతున్నాయి. మా పెద్దబ్బాయి డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. వాడికి వసతి, విద్యా దీవెన కింద నిధులు జమ అవుతున్నాయి. చిన్నబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. వాడికి అమ్మఒడి కింద ఏటా రూ.15,000 చొప్పున వస్తోంది. వివిధ పథకాల ద్వారా డబ్బులు అందుతుండడంతో అప్పులు తీసుకోవాల్సిన అవసరం రాలేదు. ఈ ఏడాది వరి, పసుపు పంట బాగుంది. మంచి ధర కూడా ఉంది. సంతోషంగా జీవిస్తున్నాం.

– కొమ్మారెడ్డి శివప్రసాదరెడ్డి, తూములూరు
(బి.ఎల్.నారాయణ, విలేకరి, తెనాలి)

'పాడి'తో గట్టెక్కాను



పాడి పశువులు పెంచుతూ పాల వ్యాపారం చేయడం మా వృత్తి. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెంలో మహిళా స్వయం శక్తి సంఘంలో సభ్యురాలిని. గతంలో పలు సందర్భాలలో రుణం పొందినా, జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందుతున్న సాయం మాత్రం చాలా ఉపయోగపడుతోంది. ఆసరా కింద ఇప్పటి వరకు రూ.47 వేలకుపైగా నా ఖాతాలో జమ అయింది. దీంతోపాటు బ్యాంకు లోనుకు దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 వంతున ఆర్థిక సాయం అందుతోంది. ఈ మొత్తంతో పాడి గేదెల యూనిట్ ఏర్పాటు చేసుకున్నా. అన్ని ఖర్చులుపోనూ నెలకు రూ.10 వేలకు పైగా మిగులుతోంది. దీంతో నా కుటుంబ పోషణ సులువైంది. నా ఇద్దరు పిల్లలకు పెళ్లి చేశాను. వారిని ఆర్థికంగా నిలబెట్టగలిగానంటే అందుకు నా పాడి వ్యాపారమే కారణం.

– గుండుమేను శశిరేఖ, గొల్లపాలెం
(తోట సత్యనారాయణ, విలేకరి, మలికిపురం)

కొడుకులా ఆదుకున్నాడు..



మాది చాలా నిరుపేద కుటుంబం. భార్యాభర్తలం చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లం. విశాఖ జిల్లా భీమునిపట్నానికి చెందిన మాకు ఇద్దరు పిల్లలు. కొడుకు కూలి పనులు చేసుకుంటూ వేరుగా ఉంటున్నాడు. కూతురికి పెళ్లి చేసి పంపాము. మేమిద్దరం జీవనం సాగించడానికి అనారోగ్య సమస్యలతో పాటు వయసు కూడా మీద పడటంతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. రోజులు గడుస్తున్న కొద్దీ బతుకు భారంగా మారడంతో దిక్కుతోచని స్థితికి వచ్చాము. అలాంటి పరిస్థితిలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో ఆదుకుంది. మాలాంటి నిరుపేదలకు కొండంత అండగా నిలబడింది. నాకు చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 వంతున ఇప్పటి వరకు మూడు విడతలుగా రూ.56,250 వచ్చింది. ఆసరా కింద కూడా రూ.20 వేలు వచ్చింది. ఈ సొమ్ముతో మేము ఉంటున్న ఇంటి ముందు చిన్న టిఫిన్ సెంటర్ పెట్టుకున్నాము. చుట్టుపక్కల వారు మా వద్దకు వచ్చి టిఫిన్ చేసి వెళతారు. వస్తున్న ఆదాయం మా ఇద్దరికీ చక్కగా సరిపోతోంది. మా ఆయనకు వృద్ధాప్య పింఛన్ కూడా వస్తోంది. ఈ నెల రూ.3 వేలు ఇచ్చారు. ఇప్పుడు మాకు ఎలాంటి ఆందోళన లేదు. హాయిగా ఉన్నాం. మమ్మల్ని పెద్ద కొడుకులా సీఎం జగన్ ఆదుకున్నారు.

– బుంగ అన్నపూర్ణ, భీమునిపట్నం
(ఎస్.రమణప్రసాద్, విలేకరి, భీమునిపట్నం)

గుంతకల్లులో బడుగు, బలహీనవర్గాల విజయ యాత్ర



సభలో ఐక్యత చాటుతున్న ప్రజాప్రతినిధులు

- సామాజిక సాధికార బస్సు యాత్రకు అడుగడుగునా నీరాజనాలు
- వేలాదిగా పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- కేరింతలతో యువత ఉత్సాహం
- పూలవర్షంతో స్వాగతం పలికిన ప్రజలు
- వేలాది ప్రజలతో జనసంద్రంలా సభా ప్రాంగణం
- 'జై జగన్, గిరగిరా తిరగాలి ఫ్యాన్' అంటూ నినాదాలు



అనంతపురం జిల్లా గుంతకల్లులో జరిగిన సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం జిల్లా గుంతకల్లులో బడుగు, బలహీన వర్గాల ప్రజలు విజయ యాత్ర చేశారు. వైఎస్సార్‌సీపీ మంగళవారం ఇక్కడ నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండదండలతో తాము సాధించిన సాధికారతను ప్రదర్శించారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ యాత్ర పట్టణంలో పండగ వాతావరణాన్ని నింపింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజల సాధికార నినాదంతో గుంతకల్లు హోరెత్తింది. పట్టణ ప్రధాన వీధులన్నీ జనంతో నిండిపోయాయి. యువత కేరింతలతో ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు. పట్టణ ప్రజలు యాత్రకు పూల వర్షంతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభ వేలాది ప్రజలతో జనసంద్రంలా కనిపించింది. సభ ఆద్యంతం 'జై జగన్.. జైజై జగన్', 'గిరగిరా తిరగాలి ఫ్యాన్' అంటూ నేతలతో కలిసి నినాదాలు చేశారు.

అణగారినవర్గాల కోసం పాటుపడుతున్న సీఎం జగన్ : ఎంపీ సురేష్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం అణగారిన వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సాధికారత సాధించి, తలెత్తుకొని తిరుగుతున్నారంటే అది సీఎం జగన్ చేసిన మేలు వల్లేనని అన్నారు. సంక్షేమంలో, అన్ని పదవుల్లో అగ్రస్థానం ఈ వర్గాలకే కేటాయించారని తెలిపారు. అణగారిన వర్గాలను అభివృద్ధి చేసి, సామాజిక న్యాయాన్ని సాధించిన సీఎం జగన్ ఆదర్శనీయుడని, ఈరోజు దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తోందని తెలిపారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఏనాడూ పేదల గురించి ఆలోచించలేదని అన్నారు. చంద్రబాబుకు అవకాశం ఇస్తే మరోమారు నట్టేట ముంచుతారని, ఆయన్ని నమ్మవద్దని చెప్పారు. రాష్ట్రానికి దిక్సూచిలా ఉన్న సీఎం వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఇది విజయ యాత్ర: ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు అలీ

నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు రాష్ట్రంలో విజయయాత్ర చేస్తున్నారని, ఇదంతా సీఎం వైఎస్ జగన్ చలవేనని ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు అలీ చెప్పారు. మనల్ని ఇంత అభివృద్ధిలోకి తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు మనం ఇచ్చే గిఫ్ట్ 'వై నాట్ 175' అని అన్నారు. గత ఎన్నికల్లో గుంతకల్లు ప్రజలు 50 వేల మెజార్టీతో వెంకటరామిరెడ్డిని గెలిపించారని, ఈసారి లక్ష మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

వైఎస్ జగన్ వెంటే నడుద్దాం: మాజీ మంత్రి ఎం. శంకరనారాయణ

75 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారిగా సామాజిక న్యాయం సాధించిన సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే ఎం. శంకరనారాయణ చెప్పారు. మనందరినీ అభివృద్ధిలోకి తెచ్చి, సమాజంలో గౌరవ స్థానం కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే నడుద్దామని పిలుపునిచ్చారు. చంద్రబాబు బడుగు, బలహీన వర్గాలను కేవలం ఓటుబ్యాంకుగా ఉపయోగించుకున్నారని చెప్పారు. అదే వర్గాలను సీఎం జగన్ ఉన్నత స్థితికి తీసుకువెళ్తున్నారని తెలిపారు.

వెనుకబడిన వర్గాలకు గౌరవం పెరిగింది: ఎంపీ తలారి రంగయ్య

వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇచ్చిన ప్రాధాన్యతతో రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు గౌరవం పెరిగిందని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అత్యున్నత స్థానాల్లో కూర్చోబెట్టారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ రూ. 1,500 కోట్ల అభివృద్ధి జరిగిందని అన్నారు. ఇంతటి మేలు చేసిన వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు.

పట్టణ మహిళలకు సుస్థిర జీవనోపాధి

- 25లక్షల మంది సభ్యులకు సంక్షేమ పథకాలు అందేలా కార్యాచరణ
- ఈ నెలలో పట్టణ ప్రగతి యూనిట్ల ఏర్పాటు
- వివిధ రకాల శిక్షణలు ఇచ్చేందుకు కసరత్తు
- మెప్మా పథకాలపై సమగ్ర అధ్యయనం

సాక్షి, అమరావతి: పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడడంతోపాటు సుస్థిర జీవనోపాధిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ శిక్షణలు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో ఇప్పటికే 11 మునిసిపాలిటీల్లో జగనన్న మహిళా మార్టులు, జగనన్న ఈ–మార్ట్, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు వంటివి ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా పట్టణ ప్రగతి యూనిట్లను కూడా ఈ నెలలోనే ఏర్పాటు చేయనున్నారు. మెప్మా పరిధిలో 123 పట్టణ స్థానిక సంస్థల(యూఎల్బీ)లో 25 లక్షల మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఉండగా, ఇప్పటి దాకా 13.50 లక్షల మంది ప్రత్యక్షంగా స్వయం ఉపాధి పొందుతున్నారు. మిగిలిన వారిలో అత్యధిక మందితో పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు, చేయూత, జీవనోపాధి యూనిట్లు ఏర్పాటుచేసి స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు సభ్యుల అభిప్రాయాలు తెలుసుకోవాలని మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి ఇటీవల జిల్లాల మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్లు, సిబ్బందిని ఆదేశించారు. ఇందుకోసం ప్రాంతాలవారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే విశాఖపట్నం, గుంటూరు జిల్లాల పరిధిలో సమావేశాలు ముగిశాయి. రాయలసీమ జిల్లాల పథక సంచాలకులు, సిబ్బందికి నెల్లూరులో బుధవారం సమావేశం నిర్వహించనున్నారు.

ఎస్‌హెచ్‌జీలు బలోపేతం: మెప్మా ఎండీ

రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా వివిధ సంక్షేమ పథకాలు ఎంత మందికి అందాయి.. ఇంకా పొందాల్సిన వారు ఎవరైనా ఉన్నారా.. అనేదానిపై సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు. అర్బన్ స్వయం సహాయక సంఘాలు బలోపేతం కావాలని, ప్రతి సభ్యురాలిని స్వయం ఉపాధి వైపు మెప్మా ప్రోత్సహిస్తుందని చెప్పారు. వారికి అందుతున్న చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, జగనన్న తోడు... వంటి పథకాలతో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. ఆ నగదుతో వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే పలు దఫాలుగా మహిళలకు శిక్షణనిచ్చి, వారితో పలు వ్యాపార సంస్థలను ఏర్పాటుచేసి విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మిగిలిన సభ్యులకు అవసరమైన సహకారం అందించేందుకు స్వయంగా సభ్యులతో మాట్లాడాలని తమ సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. ఇంటిని చక్కదిద్దుకునే మహిళలు వ్యాపారాన్ని విజయవంతంగా చేయగలరని తమ జగనన్న మహిళా మార్టులు, అర్బన్ మార్టులు, ఆహా క్యాంటీన్లు నిరూపించాయన్నారు. ఆయా యూనిట్ల బలోపేతం కోసం నిరంతరం శిక్షణ, పర్యవేక్షణ అందించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ఏపీ టిడ్కో గృహాల లబ్ధిదారులకు యూఎల్బీల పరిధిలో 100శాతం బ్యాంకు రుణాలు అందించే ఏర్పాట్లు చేశామని ఆమె వివరించారు.

భారత్‌ను అగ్రభాగాన నిలిపేందుకు మోదీ కృషి

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీపాద యశోనాయక్



గుడ్లవల్లేరు: భారతదేశాన్ని శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా మార్చి ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీపాద యశోనాయక్ అన్నారు. వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో సుమారు 80 కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో మహిళలకు దేశం, రాష్ట్రంలో పథకాలు గతంలో సరిగా అందేవి కావన్నారు. సుమారు రూ.వెయ్యి పథకాల ద్వారా వస్తే, లబ్ధిదారులకు 20 శాతం అందేవన్నారు. మిగిలిన సొమ్ము దళారుల ఖాతాలకు పోయేవన్నారు. కానీ.. మోదీ చొరవతో కోట్లాది మందికి బ్యాంకు ఖాతాలను తెరిపించి ఏ పథకం ద్వారా అయితేనేమీ పొందే మొత్తం సొమ్మును నేరుగా లబ్ధిదారుని ఖాతాలో పడేటట్లు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీపీఓ నాగేశ్వర నాయక్, ఆర్డీఓ పి.పద్మావతి, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తాన్, ఎంపీడీఓ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 'టెక్' పాఠాలు

- ఇంజినీరింగ్ విద్యార్థులతో 'ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్'పై అవగాహన
- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం చేరువ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. అందుకోసం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌తో పాటు స్టైఫండ్ అవకాశాన్ని ఉన్నత విద్యాశాఖ సమన్వయంతో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా ప్రవేశపెట్టిన 'ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్'పై మంగళవారం ఆన్‌లైన్ ఓరియెంటేషన్ ప్రొగ్రాం విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో ప్రారంభించారు. ఇందులో ప్రవీణ్ ప్రకాశ్‌తో పాటు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, ఇన్‌ఫ్రా కమిషనర్ కాటమనేని భాస్కర్, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపడుతున్న ప్రతిష్టాత్మక విద్యాభివృద్ధి కార్యక్రమాలలో ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా భాగం కావాలన్నారు. వీరు తమకు కేటాయించిన పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు, విద్యార్థులకు ట్యాబ్‌ల వాడకంపై 3–4 నెలల పాటు మార్గనిర్దేశనం చేస్తారన్నారు. 8, 9 తరగతుల విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు ద్వారా నాణ్యమైన విద్యను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆశయాన్ని గుర్తు చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్టు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఏఐ, డేటా మేనేజ్‌మెంట్, మెషిన్ లెర్నింగ్, చాట్ జీపీటీ, వెబ్ 3.0, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి సాంకేతికత పరిజ్ఞానాన్ని విద్యార్థులకు బోధించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 22న ప్రారంభిస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి తెలిపారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తే 8 క్రెడిట్‌లు అందిస్తామన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ సహకారం

ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో సేథు మాధవన్



కాంటెస్ట్ పత్రాల బాక్సును కళాశాల ప్రతినిధికి అందజేస్తున్న సేథు మాధవన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పరిశ్రమల స్థాపనకు అవసరమైన పూర్తి సహకారం పారిశ్రామికవేత్తలకు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏపీ మైక్రో స్మాల్ అండ్ మీడియా ఎంటర్‌ప్రెన్యూర్స్ (ఎంఎస్ఎంఈ) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో సేథు మాధవన్ స్పష్టం చేశారు. విజయవాడ నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో భారతీయ యువ శక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో బిజినెస్ ఐడియా కాంటెస్ట్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సేథు మాధవన్ హాజరై మాట్లాడారు. యువత ఉద్యోగాల వేట ఆపి మరింత మందికి ఉద్యోగాలు కల్పించేలా కొత్తగా పరిశ్రమలు స్థాపించాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు అవకాశాలున్నాయని, యువ పారిశ్రామికవేత్తల ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ కార్పొరేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఏపీ పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ జి.ప్రసాద్ మాట్లాడుతూ యువత తమలోని నైపుణ్యాలను పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందన్నారు. భారతీయ యువ శక్తి ట్రస్ట్ (బీవైఎస్‌టీ) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అరుణా వినోద్‌కుమార్ మాట్లాడుతూ యువతలోని పరిశ్రమల స్థాపన ఆలోచనలను తమకు చెబితే వాటిని అభివృద్ధి చేసి ప్రాజెక్టు రూపకల్పన, అంచనా వ్యయం, ప్రభుత్వం నుంచి అనుమతులు పొందడం ఎలా, సబ్సిడీలు, బ్యాంకు రుణాలు పొందేందుకు పూర్తి సహాయ సహకారం తమ ట్రస్ట్ అందిస్తుందన్నారు. యువతలో ఉన్న పారిశ్రామిక ఆలోచనలను తెల్సుకునేందుకు బిజినెస్ ఐడియా కాంటెస్ట్–2024ను నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 'సామాజిక సమతా సంకల్పం'

సాక్షి, అమరావతి: రాష్ట్రప్రభుత్వం తొలుత ప్రకటించిన 'జన్ భాగీదారీ' పేరును 'సామాజిక సమతా సంకల్పం'గా మార్చారు. అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనాన్ని విజయవాడలో ఈ నెల 19న ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'సామాజిక సమతా సంకల్పం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మంగళవారం సంబంధిత శాఖలకు, జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, విద్యావేత్తలు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనేలా చూడాలన్నారు. భారతరత్న డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, ఆహ్వానపత్రాలు, మీడియా ప్రచారం, సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా సమన్వయంతో విజయవంతం చేయాలని శ్రీలక్ష్మి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరిశ్రమల ఆవరణలోనే విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

నైపుణ్యాభివృద్ధి సంస్థ, రీటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ మధ్య ఒప్పందం

సాక్షి, అమరావతి: 'ఇండస్ట్రీ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్స్ అండ్ ప్లేస్‌మెంట్స్ (ఐసీఎస్‌టీపీ)' ప్రోగ్రామ్ ద్వారా పరిశ్రమల ఆవరణలోనే విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్టు నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ చెప్పారు. విద్యార్థి దశలోనే నైపుణ్యాలు అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే స్కిల్ కాస్కేడింగ్ సిస్టమ్‌ను అమలు చేస్తోందన్నారు. ఈ మేరకు మంగళవారం విశాఖలో ఇండస్ట్రీ స్టేక్ హోల్డర్స్ వర్క్‌షాప్‌లో నైపుణ్యాభివృద్ధి సంస్థ, రీటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థతో శిక్షణపై అవగాహన ఒప్పందం చేసుకుంది. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు డిమాండ్ ఉన్న కోర్సుల్లో 30–45 రోజులపాటు శిక్షణ ఇచ్చి అక్కడే ఉపాధి కల్పిస్తామన్నారు. భవిష్యత్తులో తయారీ పరిశ్రమలోనే కాకుండా ఐటీ, సేవా రంగాల్లో కూడా శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగ మేళా, శిక్షణ) జి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రపంచ స్థాయి ఉద్యోగాల్లో నిలబెట్టేలా సీఎం వైఎస్ జగన్ 192 స్కిల్‌హబ్స్, 26 స్కిల్ కాలేజీలను ప్రవేశపెట్టారన్నారు. వీటి ద్వారా ఏటా రూ.50 వేలకు పైగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రతి నెలా ప్రతి జిల్లాలో 2 జాబ్ మేళాలు ఏర్పాటు చేసి 30 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. త్వరలోనే స్కిల్ వర్సిటీని కూడా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ వి.వినోద్ కుమార్ మాట్లాడుతూ యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నట్టు చెప్పారు.

విప్లవాత్మక మార్పులకు అది రాచబాట

- ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తయ్యి నేటికి ఐదేళ్లు
- రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు
- ప్రజల కష్టాలు తెలిసిన నేత సీఎం వైఎస్ జగన్ అని నేతల ప్రశంసలు



గుంటూరులో కేక్ కట్ చేస్తున్న మంత్రి విడదల రజిని



పార్వతీపురం మన్యం జిల్లా మక్కువలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర



కర్నూలు నగరంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ బి.వై.రామయ్య, పార్టీ నాయకులు

నెహ్రూనగర్/కర్నూలు(టౌన్)/మక్కువ: ప్రజల కష్టాలు తెలిసిన నేత సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని వైఎస్సార్‌సీపీ శ్రేణులు నినదించాయి. అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధి కోసం విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టి, చరిత్ర సృష్టించారని కొనియాడాయి. రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా విప్లవాత్మక మార్పులకు బాటలు వేసిన వైఎస్ జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు వేడుకలు నిర్వహించారు. ప్రజా సంకల్ప యాత్ర విప్లవాత్మక మార్పులకు రాచబాట అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలకు పరిపాలనలో భాగస్వామ్యం లభించిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సామాజిక సాధికారత సాధించారని, రాష్ట్రంలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు కళ్లెదుటే కనిపిస్తున్నాయని పార్టీ నేతలు అన్నారు. ప్రతి ఊళ్లోనూ మార్పు కనిపిస్తోందని చెప్పారు. గుంటూరులో మంత్రి విడదల రజిని పార్టీ కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల్లో ఉండటమే రాజకీయం అని నమ్మిన నేత జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసి మేనిఫెస్టో రూపొందించారని చెప్పారు. ఇప్పటి వరకు 99 శాతానికిపైగా హామీలు అమలు చేసిన నాయకుడు జగనన్న అని తెలిపారు.

కర్నూలులో ఘనంగా కార్యక్రమాలు

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆదోనిలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, నంద్యాలలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, సంజామలలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బనగానపల్లెలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. తూర్పు గోదావరిజిల్లా కొవ్వూరులో హోం మంత్రి తానేటి వనిత కేక్ కట్ చేశారు. కాకినాడలో మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌సీఎంగా ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కేక్‌లు కట్ చేసి సందడి చేశారు. పలు ప్రాంతాల్లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. తణుకులో మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, బువ్వనపల్లిలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. ప్రజాసంకల్ప యాత్ర ఓ చారిత్రక ఘట్టమని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు.

కోట్లాది హృదయాలను స్పృశిస్తూ..

2017 నవంబర్ 6వ తేదీన వైఎస్ జగన్ ఇడుపులపాయలో ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించారు. కోట్లాది హృదయాలను స్పృశిస్తూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో 2019 జనవరి 9వ తేదీన పాదయాత్ర ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 134 శాసనసభ నియోజక వర్గాలు, 231 మండలాలు, 2,516 గ్రామాల మీదుగా 341 రోజులపాటు 3,648 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. ఈ యాత్రలో 124 చోట్ల సభలు, 55 ఆత్మీయ సమ్మేళనాల్లో వైఎస్ జగన్ ప్రసంగించారు. పాదయాత్ర ఆద్యంతం జననేతను మహిళలు, చేయూతకు నోచుకోని వృద్ధులు, ఉపాధి లేని యువత, రైతులు, రైతు కూలీలు సహా కలుసుకోని వర్గం అంటూ లేదు. కావాలి జగన్.. రావాలి జగన్.. అంటూ నినదించారు.

రాజమండ్రి రూరల్‌లో జనసేన, టీడీపీ మధ్య చిచ్చు

- తానే పోటీ చేస్తా అంటున్న సిట్టింగ్ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి
- పెద్దల ఆశీస్సులు తనకే అంటున్న జనసేన నేత కందుల దుర్గేష్
- విలేకర్ల సమావేశాలు పెట్టి మరీ ప్రకటనలు
- సీటుపై ఎటూ తేల్చని చంద్రబాబుపై రగిలిపోతున్న తెలుగు తమ్ముళ్లు



సాక్షి, రాజమహేంద్రవరం: చంద్రబాబు వ్యవహార శైలి టీడీపీ, జనసేన నేతల మధ్య అగ్నికి ఆజ్యం పోస్తోంది. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే స్థానంపై ఎటూ తేల్చకపోవడం ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. ప్రస్తుతం అది బహిరంగంగా ప్రెస్‌మీట్‌లు పెట్టి విమర్శలు గుప్పించే స్థాయికి చేరింది. తనకు అధిష్టానం ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని, తనకే టికెట్ దక్కుతుందని జనసేన నేత కందుల దుర్గేష్ ఇటీవల విలేకర్ల సమావేశంలో స్పష్టం చేశారు. దానిని టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి ప్రెస్‌మీట్ పెట్టి ఖండించారు.

ప్రెస్‌మీట్లు.. సిగపట్లు..

పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటు పవన్, చంద్రబాబు కలిసే చేస్తారని, కచ్చితంగా తనకే టిక్కెట్ దక్కుతుందని కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. సిటింగ్ ఎమ్మెల్యేలకే సీట్లు అని గతంలో చంద్రబాబు చేసిన ప్రకటన తమ పొత్తు తర్వాత చెల్లదన్నారు. దీంతో తానే పోటీ చేస్తానని పరోక్షంగా వెల్లడించారు. దుర్గేష్ ఇలా ప్రకటించిన ఒక రోజు వ్యవధిలోనే టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల స్పందించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు ఖాయమని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తుచేసి.. అది ఇప్పుడు చెల్లదనడానికి జనసేన నాయకుడు ఎవరని దుర్గేష్‌పై శివాలెత్తారు. ఎవరేమన్నా రానున్న ఎన్నికల్లో తాను ఎంపీగా పోటీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రూరల్ ఎమ్మెల్యేగానే పోటీ చేస్తానని బల్లగుద్ది మరీ ప్రకటించారు.

బుచ్చయ్యకు కష్టమేనా..

బుచ్చయ్య రూరల్ ఎమ్మెల్యే అయినా ఆయన దృష్టంతా రాజమహేంద్రవరం సిటీ స్థానంపైనే ఉండేది. పార్టీలో సీనియర్ అయిన తనను కాదని ఇతరులను ప్రోత్సహిస్తున్నారని ఆవేదన చెందేవారు. ఈ విషయాన్ని అనేక సందర్భాల్లో వెళ్లగక్కారు. ఆయనకు రూరల్ ఇవ్వని పక్షంలో ఆదిరెడ్డి వాసును ఎంపీగా రంగంలోకి దింపి, సిటీ సీటు బలమైన క్యాడర్ ఉన్న బుచ్చయ్యకు కేటాయిస్తారన్న ప్రచారం కొంతకాలం నడిచింది. బాబు ఇక్కడి సెంట్రల్ జైలుకు వచ్చాక ఆయన కుటుంబం ఇక్కడే ఉండి ఆందోళనల్లో పాల్గొన్నపుడు.. చొరవగా వ్యవహరించిన ఆదిరెడ్డి వాసుకే సిటీ సీటు ఖాయమన్న వాదన వినిపిస్తోంది. దీంతో బుచ్చయ్యకు సిటీ ఆశ కూడా అడియాసగా మారుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.

బాబు వైఖరితోనే..

చంద్రబాబు వైఖరితోనే రాజమండ్రి రూరల్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని టీడీపీ, జనసేన కార్యకర్తలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. స్పష్టత ఇవ్వకుండా చంద్రబాబు విభేదాలకు మరింత ఆజ్యం పోస్తున్నారని మండి పడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు ఖాయమని గతంలో చంద్రబాబు ప్రకటించేశారు. దీంతో రూరల్ సీటు తనకే అన్న ధీమాలో బుచ్చయ్య ఉండగా.. పొత్తులో భాగంగా దుర్గేష్‌కు ఇద్దామన్న మరో ప్రతిపాదన సైతం బుచ్చయ్య వద్ద ఉంచారు. ఇలా రెండువైపులా అనుకూలంగా వ్యవహరిస్తూ.. ఇరు వర్గాల మధ్య గొడవలకు చంద్రబాబు ఆజ్యం పోస్తున్నారని జనసేన, టీడీపీ నేతలు అంటున్నారు.

గుంటూరులో సిగపట్లు

- గుంటూరు పశ్చిమం, తెనాలి కావాలని జనసేన డిమాండ్
- ఆ రెండూ తమ పార్టీకి బలమైన సీట్లు అంటున్న నేతలు
- కానీ, తెనాలిలో పాదయాత్ర మొదలుపెట్టిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజా
- గుంటూరు పశ్చిమ.. మా సిట్టింగ్ సీటు అంటున్న తెలుగుదేశం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి జనసేనతో పొత్తు తలనొప్పిగా మారుతోంది. టీడీపీకి పట్టున్న రెండు సీట్లను జనసేన డిమాండ్ చేస్తుండడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. తెనాలి నియోజకవర్గంలో తెలుగుదేశం నుంచి ఆలపాటి రాజా, జనసేన నుంచి ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పోటీపడుతున్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున గతంలో ఇక్కడ్నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి.. కాంగ్రెస్, జనసేన తరఫున మరో రెండుసార్లు ఓటమి చవిచూశారు. నాదెండ్ల మనోహర్ ఇప్పుడు మళ్లీ తెనాలి నుంచి టీడీపీ–జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ కూడా సమ్మతించారు. అయితే, ఇక్కడ టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా మరోసారి పోటీచేయాలని చూస్తున్నారు. రెండు పార్టీలు కలిసి పోటీచేస్తే గెలుస్తామన్న భావనతో ఆయన పార్టీపరంగా లైన్‌క్లియర్ చేసుకునేందుకు లోకేశ్‌తో టచ్‌లో ఉన్నారు. నియోజకవర్గంలోనూ ఆయన పర్యటిస్తున్నారు. రెండురోజుల క్రితం పాదయాత్ర మొదలుపెట్టారు. గత ఎన్నికల్లో జనసేనకు 29 వేల ఓట్లు రాగా టీడీపీకి 76 వేల ఓట్లు వచ్చాయి. తమకు బలమైన సీటును వదులుకోవడానికి సిద్ధంగాలేమని తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు.

గుంటూరు పశ్చిమం కోసం జనసేన పట్టు..

ఇక జనసేన అడుగుతున్న రెండో సీటు గుంటూరు పశ్చిమం. ఈ సీటు 2014, 2019లో కూడా తెలుగుదేశం పార్టీ గెలుచుకుంది. తమ సిట్టింగ్ సీటును ఇచ్చేదిలేదని వారు తెగేసి చెబుతున్నారు. అయితే ఇక్కడ తెలుగుదేశం బలంతో పాటు కాపు ఓటింగ్ కూడా గణనీయంగా ఉండటంతో ఇక్కడ పోటీచేయాలని జనసేన భావిస్తోంది. గత ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ఈ సీటు కోసం పట్టుపడుతున్నారు. ఇందులో భాగంగా.. సోమవారం కూడా గుంటూరు జనసేన నేతలు పవన్‌ను కలిసి ఈ సీటు కావాల్సిందేనని, ఏ విధంగా గెలుస్తామో ఆయనకు వివరించారు. మరోవైపు.. టీడీపీ కూడా ఇక్కడ అభ్యర్థి కోసం అన్వేషిస్తోంది. ఇక్కడ వైఎస్సార్‌సీపీ నుంచి మంత్రి విడదల రజిని బరిలోకి దిగడంతో ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని బరిలోకి దింపేందుకు తెలుగుదేశం ప్రయత్నిస్తోంది. దీంతో ఇప్పటివరకూ ఈ నియోజకవర్గంపై ఆశలు పెట్టుకున్న ఎన్ఆర్‌ఐలు తమ కార్యకలాపాలు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో.. పొత్తులో భాగంగా ఏ సీటు వదులుకోవాలో, ఏ సీటు ఉంచుకోవాలో తెలీక టీడీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

ఏపీకి బెస్ట్ పెవిలియన్ అవార్డు

అంతర్జాతీయ సదస్సులో ఆకట్టుకున్న స్టాల్స్

సాక్షి, అమరావతి: మిల్లెట్స్–ఆర్గానిక్స్‌పై బెంగుళూరులో 3 రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సేంద్రీయ వాణిజ్య ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్‌కు బెస్ట్ స్టేట్ పెవిలియన్ అవార్డు లభించింది. ఈ నెల 5 నుంచి నిర్వహించిన ఈ ప్రదర్శనలో 20 రాష్ట్రాలతో పాటు విదేశీ రైతులు తమ ఉత్పత్తులతో 250 స్టాల్స్ ఏర్పాటు చేశారు. స్టాల్ వాలిడేషన్ కమిటీ స్టాల్స్ ఏర్పాటు, ప్రదర్శించిన ఉత్పత్తులను పరిగణనలోకి తీసుకొని బెస్ట్ స్టేట్ పెవిలియన్, బెస్ట్ స్టాల్ అవార్డులను ప్రదానం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో ఏపీ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలోని స్టాల్స్‌కు ఈ అవార్డులు వరించాయి. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయ స్వామి చేతుల మీదుగా రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ ప్రభాకర్‌కు ఈ అవార్డులను ప్రదానం చేశారు.



డీకే శివకుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రభాకర్

గతేడాది డిసెంబర్ 28–30 వరకు కేరళలో జరిగిన జాతీయ స్థాయి ఆర్గానిక్ ప్రదర్శనలో ఏపీకి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు లభించింది.

ఎల్లో మీడియా వక్రీకరించింది

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆగ్రహం



సాక్షి, అమరావతి: సమస్యల పరిష్కారంపై స్థానిక అధికారులు సక్రమంగా స్పందించడం లేదనే ఆవేదనతో ఫేస్‌బుక్ లైవ్‌లో నీటి కేటాయింపులపై తాను మాట్లాడిన మాటలను ఎల్లో మీడియా వక్రీకరించిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మండిపడ్డారు. తాను ప్రశ్నించింది అధికారులనైతే సీఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడినట్లు ఎల్లో మీడియా చిత్రీకరించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లా స్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలపై అధికారులు స్పందించనప్పుడు సీఎం జగనన్న దగ్గరకు వెళ్తే పనులు అవుతున్నాయనడంలో తప్పు ఏముందని ప్రశ్నించారు. అదే వీడియోలో జగనన్న స్ఫూర్తితో తామంతా ముందుకెళ్తున్నామని చెప్పానని, మరి వాటిని ఎల్లో మీడియా ఎందుకు హైలెట్ చేయలేదని నిలదీశారు. దళిత మహిళగా నియోజకవర్గ సమస్యలపై ప్రశ్నించడం నేరమా? అని రామోజీని ప్రశ్నించారు. తప్పుడు రాతలు ఆపకుంటే దళిత మహిళల ఆగ్రహం ఎలా ఉంటుందో చవిచూస్తారని హెచ్చరిస్తూ ఈనాడు దినపత్రికను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి చించివేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు.

పదవి లేకున్నా పార్టీ కోసం పని చేస్తా

రాజకీయాల్లోకి ప్రవేశించే సమయంలో తానేదో భారీ స్థాయిలో భవిష్యత్తు ఊహించి రాలేదని ఎమ్మెల్యే పద్మావతి పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు కచ్చితంగా జగనన్నలాంటి నాయకుడితోనే కలిసి పనిచేయాలని కోరుకున్నట్లు చెప్పారు. జగనన్న తనను సొంత చెల్లెలు మాదిరిగా చూసుకున్నారని తెలిపారు. జగనన్న ఆదేశిస్తే ఎలాంటి పదవి లేకున్నా పార్టీ కోసం పని చేస్తానని, తన సీటును వదులుకునేందుకు సైతం సిద్ధమేనని ప్రకటించారు. దేశ చరిత్రలో గుర్తుండిపోయేలా ఎస్సీలకు సీఎం జగన్ మేలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలూ జగనన్న పరిపాలన పట్ల ఎంతో సంతోషంగా ఉన్నాయని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్ సీపీలోనే పని చేస్తానని తెలిపారు. తనను జగనన్నకు దూరం చేయాలని కుట్రలు చేస్తే ఏ స్థాయి వ్యక్తికైనా తగిన బుద్ధి చెబుతానని హెచ్చరించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దిక్కుమాలిన రాజకీయాలతో దిగజారిపోతున్నారని విమర్శించారు.

చంద్రబాబు తాతా.. చంద్రగిరిలో దొంగ ఓట్లని నిరూపించు

- లక్ష దొంగ ఓట్లు ఉన్నాయని నిరూపిస్తే నామినేషన్ కూడా వేయను
- జగనన్న చేసిన సంక్షేమం, అభివృద్ధే మమ్మల్ని గెలిపిస్తాయి
- మాజీ సీఎం చంద్రబాబుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బహిరంగ లేఖ



మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే జయదేవనాయుడు

చంద్రగిరి(తిరుపతి జిల్లా): కేంద్ర ఎన్నికల సంఘానికి చంద్రబాబు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుపై వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. చంద్రగిరి నియోజకవర్గంలో లక్ష దొంగ ఓట్లు చేర్పించినట్లు నిరూపిస్తే.. నామినేషన్ కూడా వేయనని సవాల్ విసిరారు. దొంగ ఓట్లతో గెలవాల్సిన ఖర్మ తమకు ఎప్పుడూ లేదని, జగనన్న చేసిన సంక్షేమం, అభివృద్ధే తమను గెలిపిస్తాయని మోహిత్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుచానూరు రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖను పంపినట్లు తెలిపారు. దానిలో 'పెద్దలైన చంద్రబాబు తాతకు మీ మనవడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నమస్కరించి రాయునది..' అంటూ మొదలైన ఆ లేఖను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. లేఖలో రాసిన విషయాలను ఆయన తెలిపారు. మోహిత్‌రెడ్డి ఏం చెప్పారంటే... 'మా తాత, మీరు ఇద్దరు కలిసి చదువుకున్నారు. అంటే మీరు నాకు తాత లాంటి వారు. చంద్రబాబు తాత మీరు రాజకీయాల్లోకి వచ్చాక 20 ఏళ్లకు నేను పుట్టాను. ఈ రోజు మీ ప్రెస్‌మీట్, ఎన్నికల కమిషన్‌కు చేసిన ఫిర్యాదు చూసి ఆశ్చర్యపోయాను. అపార రాజకీయ అనుభవం ఉన్న మీరు నిజానిజాలు తెలుసుకోకుండా చంద్రగిరిలో లక్ష దొంగ ఓట్లు నమోదు చేశారని ఫిర్యాదు చేయడం, ప్రెస్‌మీట్ పెట్టి అవాస్తవాలు మాట్లాడడం చాలా బాధాకరం. 2019 ఎన్నికల్లో మీరు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రగిరిలో మొత్తం 2,91,734 ఓట్లు. ఈ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 3,08,672 మాత్రమే. కేవలం ఈ ఐదు సంవత్సరాల్లో పెరిగింది సుమారు 16 వేలు మాత్రమే. ఈ ఐదు సంవత్సరాల్లో చంద్రగిరి నియోజకవర్గంలో వేలాదిగా కొత్త ఇళ్ల నిర్మాణం జరిగినప్పుడు 16,000 ఓట్లు కొత్తగా నమోదు కాకుండా ఎలా ఉంటాయి. నిజంగా లక్ష దొంగ ఓట్లు చేరిస్తే 3,91,000 కావాలి కానీ 3,08,672 మాత్రమే ఎందుకుంటాయి. మా తాత వయసున్న మీరు నిజాలు తెలుసుకోకుండా మాట్లాడడం తగదని విజ్ఞప్తి చేస్తున్నాను. 2023 నవంబర్‌లో కేవలం 4 రోజుల్లో టీడీపీ వారు 14,200 దొంగ ఫారం 7లు నింపి దరఖాస్తు చేశారు. ఎన్నికల కమిషన్ విచారణ చేస్తే చాలామంది టీడీపీ వారు అరెస్ట్ అవుతారు. ఆ విషయం కూడా మీ దృష్టికి తీసుకొస్తున్నాను తాతా. అసత్య ఆరోపణలు చేసిన అందరిపైనా పరువు నష్టం దావా వేస్తున్నాను. న్యాయస్థానం ముందు దోషులుగా నిలబెడతాను. చంద్రగిరి ప్రజల ముందు కూడా దోషులుగా నిలబెడతాను. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి అసత్యాలే మీరు కొనసాగిస్తే.. నేను మా నియోజకవర్గ ప్రజలతో కలిసి పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు సైతం వెనకాడను. చంద్రబాబు తాత మీరు సీఎంగా ఉన్నప్పుడే మా నాన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జగనన్న ఆశీస్సులతో 43 వేల మెజార్టీతో గెలిచారు. అలాంటి మాకు దొంగ ఓట్లతో గెలవాల్సిన అవసరం లేదు. మా చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు మమ్మల్ని రాజకీయ నాయకులుగా చూడరు. తమ కుటుంబ సభ్యులుగా చూస్తారు.' అని అన్నారు. మీడియా సమావేశంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ జయదేవనాయుడు తదితరులున్నారు.



ఎంత నిశ్శబ్దంగా మారితే,
అంత చక్కగా వినబడుతుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 10 జనవరి 2024

ప్రజాస్వామ్యం లేని గెలుపు?

ఆమె గెలవడం ఇది అయిదోసారి. అందులోనూ ఇది వరుసగా నాలుగో గెలుపు. మామూలుగా అయితే ఇది అసాధారణం. అయితే, బంగ్లాదేశ్‌లో కాదు. ఆ దేశంలో ఆదివారం పార్లమెంటరీ ఎన్నికలు జరిగిన తీరు కానీ, ప్రధాని షేక్ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ (ఏఎల్) ఘన విజయం కానీ అనూహ్యమేమీ కాదు. మునుపటి ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, దాని మిత్రపక్షాలు... అన్నీ కలిపి 15 పార్టీలు ప్రజాతీర్పుకు దూరంగా ఉన్నప్పుడు పాలక పక్షానిదే గెలుపు కాక మరేమవుతుంది! ఎన్నికలను బహిష్కరించాలంటూ ప్రతిపక్షాలు ప్రజలకు పిలుపునివ్వడంతో సహజంగానే ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గింది. 2018 నాటి 80 శాతం సగానికి పడిపోయి, 40 చిల్లర వద్ద తచ్చాడింది. ఫలితాలూ ఊహించినట్టే వచ్చాయి.

మొత్తం 300 స్థానాల్లో 299 స్థానాలకు ఎన్నికలు జరగగా, పాలక పక్షానికి 223 వచ్చాయి. విచిత్రమేమంటే, ఆ తర్వాత అత్యధిక స్థానాలు గెలిచింది స్వతంత్రులే. ఇలా ఇండిపెండెంట్లుగా గెలిచిన 62 మందిలో కూడా అత్యధికులు పాలక అవామీ లీగ్ టికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తూ, పార్టీ అధికారిక అభ్యర్థిపై పోటీ చేసి గెలవమన్న వాళ్ళే! అలా గెలిచినవాళ్ళే! ఇప్పుడు బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో రెండో అతి పెద్ద వర్గం ఈ ఇండిపెండెంట్లదే! 'జాతీయ పార్టీ' 11 సీట్లు, మరో మూడు విపక్ష పార్టీలు 3 సీట్లతో ఆ తర్వాతి స్థానాల్లో నామావశిష్టంగా నిలిచాయి. ఇప్పుడిక ఎవరిని పార్లమెంట్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ప్రకటిస్తారో చూడాలి. అధికారిక ప్రకటనలెలా ఉన్నా, ఆచరణలో వాస్తవికంగా బంగ్లా ఇప్పుడు ఒక రకంగా ప్రతిపక్షమే లేని పార్లమెంట్ అయింది. షేక్ హసీనా తన తాజా విజయంతో అటు ప్రతిపక్షాలనే కాదు... ఇటు ప్రజాస్వామ్యాన్ని సైతం ఓడించారని విశ్లేషకులంటున్నది అందుకే!

ప్రపంచంలో దీర్ఘకాల మహిళా ప్రభుత్వాధినేత అనే కిరీటం హసీనాదే. 2009 నుంచి హసీనా తాలూకు పార్టీదే అధికారం. అప్పటి నుంచి ఇన్నేళ్ళలో మంచీ చెడులు రెంటిలోనూ హసీనా ఉక్కుమహిళే! అటు ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలతో దేశాన్ని దుర్భర దారిద్ర్యం నుంచి బయటకు తెచ్చి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన కీర్తి, ఇటు మానవ హక్కుల ఉల్లంఘనలు, ప్రతిపక్షాలను ఉక్కుపాదంతో తొక్కేసిన అపకీర్తి... రెండూ ఆమెవే. దేశ ఆర్థిక పురోగతి, సామాజిక అభివృద్ధిలో అవిస్మరణీయ పాత్ర ఈసారి కూడా ఆమెకు విజయం అందించి ఉండవచ్చు. అంతమాత్రాన మిగతా తప్పులన్నీ ఒప్పులై పోవు. అసలు ఈ ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై అంతర్జాతీయ పరిశీలకులు, మానవ హక్కుల సంఘాల వారు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తం చేశారు. కీలక సంస్థలు, వ్యవస్థల పైన, అసమ్మతి వినిపించకుండా చివరకు మీడియా పైన కూడా హసీనా సర్కార్ నియంత్రణపై విమర్శలూ వచ్చాయి. 17 కోట్లకు పైగా జనాభా ఉన్న బంగ్లాదేశ్ తరుణ ప్రజాస్వామ్యానికి ఇది వన్నె తీసుకురాదు. బలమైన ప్రతిపక్షం లేకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థే లేదు.


హసీనా మరోసారి ఎన్నికవడం భారత్‌కు మాత్రం ఒక రకంగా శుభవార్తే! ఎందుకంటే, హసీనా హయాంలో భారత – బంగ్లాదేశ్ బంధాలు బలపడ్డాయి. వాణిజ్యం పెరిగింది. మెరుగైన రోడ్డు, రైలు రవాణా సదుపాయాలు ఏర్పడ్డాయి. అంతకన్నా ముఖ్యంగా దక్షిణాసియా ప్రాంతానికి తీవ్రవాదం పెనుముప్పుగా పరిణమించిందని ఏకాభిప్రాయంతో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మునుపటి షేక్ హసీనా హయాం మరో పర్యాయం కొనసాగడం ఢిల్లీ దృష్టి నుంచి చూస్తే మంచిదే! బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరత, విదేశాంగ విధానాల కొనసాగింపు మనకు లాభించే విషయాలు. పైగా, అంతర్యుద్ధంలో కూరుకుపోయిన ఉమ్మడి పొరుగుదేశమైన మయన్మార్ నుంచి శరణార్థుల సమస్య పెరుగుతూ, తీవ్రవాదులకు ఆయుధాలు సులభంగా అందివచ్చే పరిస్థితులున్న సమయంలో బంగ్లాదేశ్‌లో స్నేహశీల సర్కార్ ఉండడం భారత్‌కు ఒకింత సాంత్వన.

నిజానికి, రాగల కొద్దినెలలు దక్షిణాసియా ప్రాంతానికి కీలకం. ఎందుకంటే, ఈ ప్రాంతంలోని పలు దేశాల్లో ఈ ఏడాదే ఎన్నికలున్నాయి. ఈ ఫిబ్రవరి 8న పాకిస్తాన్‌లో ఎన్నికలు జరగనుంటే, ఆ తరువాత కొద్దినెలలకే శ్రీలంకలో అధ్యక్ష పదవికి ఎన్నిక. ఇక, ఏప్రిల్ – మే నెలల్లో భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు సరేసరి. వివిధ దేశాల ఎన్నికల ఫలితాలు, కొలువు దీరే కొత్త ప్రభుత్వాలు, వాటి వైఖరిలో మార్పులను బట్టి భారత ఉపఖండంలో అనేక మార్పులు రావడం సహజం. ఇప్పటికే నిరుడు సెప్టెంబర్‌లో మాల్దీవుల్లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో భారత వ్యతిరేక వైఖరిని అస్త్రంగా చేసుకొని, మహమ్మద్ మొయిజు గద్దెనెక్కారు. భారత్‌కు దీర్ఘకాలిక మిత్రదేశమైన మాల్దీవులు అప్పటి నుంచి ఢిల్లీ కన్నా బీజింగ్ వైపు మొగ్గుతూ ఉండడం చూస్తూనే ఉన్నాం. తాజా లక్షద్వీప్ వర్సెస్ మాల్దీవ్స్ ఘటనలోనూ అదే కనపడింది. వీటన్నిటి దృష్టితో చూసినప్పుడూ బంగ్లాదేశ్‌లో మరోసారి భారత అనుకూల హసీనా సర్కార్ ఏర్పాటవడం భారత్‌కు ప్రయోజనకరమే!

ఇటు భారత్‌తో వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు, అటు చైనా సైనిక ఆలంబన – రెండూ కొనసాగిస్తూ హసీనా చేస్తున్న సమతూకం అందరికీ చేతకావు. అలాంటి ఆమె విజయాలు ప్రశంసార్హమే అయినా, సాగిస్తున్న రాజకీయ అణచివేతను విస్మరించలేం. ఆన్‌లైన్‌లో విమర్శించినా అరదండాలే అన్న డిజిటల్ భద్రతా చట్టం లాంటివి పౌరస్వేచ్ఛకు ప్రతిబంధకాలు. ప్రజాస్వామ్య వాతావరణమే లేకుంటే, చివరకు అమెరికా సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలు వాణిజ్య షరతులు విధిస్తాయి. అదే అదనుగా బంగ్లాదేశ్ పక్షాన చైనా బరిలోకి దిగుతుంది. అది భారత్‌కూ అభిలషణీయం కాదు. అందుకే, ప్రతిపక్షాలను ఊపిరి పీల్చుకొనిచ్చేలా, వ్యవస్థల స్వతంత్రతను కాపాడేలా హసీనా సర్కార్‌కు భారత్ నచ్చజెప్పాలి. బంగ్లాకూ, భారత్‌కూ దీర్ఘకాలంలో అదే శ్రేయస్కరం.

అభివృద్ధిలో సరికొత్త నమూనా

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

భారత్‌లోని అనేక ప్రాంతాలు ఇప్పటికీ ఆధునిక ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం కాలేదు. ప్రపంచ మార్కెట్ వ్యవస్థలకు అనుసంధానించడంలో విద్యదే కీలక పాత్ర. ఆధునిక విద్యాసంస్థలతో కూడిన గ్రామాభివృద్ధి నమూనాను ఏ రాష్ట్ర ప్రభుత్వమూ అనుసరించలేదు. ఈ నమూనాపై ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వం దృష్టి సారించింది. రెండు వినూత్న ఆలోచనలను ముందుకు తేవడం ద్వారా జగన్ దీన్ని సాధ్యం చేశారు: 1. ప్రభుత్వ రంగంలో నాణ్యమైన ఇంగ్లీషు మీడియం విద్యను అందించడం. 2. పాఠశాల మౌలిక సదుపాయాలు, గ్రామ పరిపాలనను భారీగా మార్చడానికి వనరులను ఖర్చు చేయడం. దాని భవిష్యత్తు ప్రభావాన్ని దేశం మొత్తం మీద ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఊహించలేకపోయారు. ఇది విప్లవాత్మకమైన అభివృద్ధి నమూనా.

2024 సాధారణ ఎన్నికలకు ముందు భారతదేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఇక, పార్లమెంటు ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనే నాలుగు రాష్ట్రాలు: ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం.

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని మునుపెన్నడూ ఊహించని పథంలోకి మార్చింది. సాధారణంగా అభివృద్ధి అంటే... ఎత్తయిన భవనాలు, మంచి రోడ్లు వంటి పట్టణ మౌలిక సదుపాయాలలో పెట్టుబడి పెట్టడానికి విధానాలను రూపొందించడమే అని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తాయి. సాధారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ మొత్తంలో బడ్జెట్ నిధులను పెద్ద కాంట్రాక్ట్ నిర్మాణాలకు వెచ్చిస్తాయి. ప్రపంచీకరణ యుగంలో నయా ఉదారవాద ఆర్థికవేత్తలు అలాంటి ఖర్చును మంచి అభివృద్ధిగా పరిగణిస్తారు. ఆరెస్సెస్, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కూడా ఈ నమూనానే అనుసరిస్తోంది. సోషలిస్ట్ ఎకానమీ నుండి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ వైపునకు మారిన చైనా కూడా ఇదే నమూనాను అవలంబించింది. వీటితో పోలిస్తే భారతీయ కుల అసమానతలకు కాస్త భిన్నమైన విధానం అవసరం.

భారతదేశంలో రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యం ఉన్నప్పటికీ, దాని అసాధారణమైన కుల అడ్డంకులు ప్రజల కేంద్రిత అభివృద్ధికి అనేక అవరోధాలను సృష్టించాయి. రెండవది, భారతీయ గ్రామాలు చెల్లాచెదురుగా ఉన్నాయి. వ్యవసాయాభివృద్ధి పూర్తిగా వ్యవసాయాన్ని పెట్టుబడిగా మార్చే దశకు చేరుకోలేదు. దేశంలోని అనేక ప్రాంతాలు ఇప్పటికీ ఆధునిక ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం కాలేదు. ప్రజలను జాతీయ, ప్రపంచ మార్కెట్ ఆర్థిక వ్యవస్థలకు అనుసంధానించడంలో వారి విద్యే కీలక పాత్ర పోషిస్తోంది.

గ్రామీణులను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోకి...

గ్రామీణ పిల్లలకు, యువతకు విద్యను అందించడానికి ఆధునిక విద్యాసంస్థలతో కూడిన గ్రామాభివృద్ధి నమూనాను ఏ రాష్ట్ర ప్రభుత్వమూ అనుసరించలేదు. ఈ నమూనాపై జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించింది. గత ఐదేళ్లలో తన బడ్జెట్‌లో ఎక్కువ భాగం గ్రామీణ విద్యా మౌలిక సదుపాయాలు, సాఫ్ట్ స్కిల్స్‌ను నిర్మించడం కోసం కేటాయించింది.

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో గత పదేళ్లలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు పూర్తి వ్యతిరేకమైన అభివృద్ధి నమూనాలను ఎలా ఎంచుకున్నాయో చూడాలి. టీడీపీ ప్రభుత్వం కృష్ణా నది ఒడ్డున ఉన్న 30,000 ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూమిని లాక్కొని, రాష్ట్ర బడ్జెట్‌లో ఎక్కువ భాగం అమరావతిని నిర్మించేందుకు కేటాయించడానికి సిద్ధమైంది. పెద్ద నగరాలు మాత్రమే పెట్టుబడులు తెస్తాయనీ, వెలుపలి నుంచి వచ్చే పెట్టుబడితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనేది



నయా ఉదారవాద ఆర్థిక ఆలోచన. ఇది భారీ స్థాయి పెట్టుబడులతో కూడిన సిటీ మాల్ మార్కెట్‌లలోకి విస్తారమైన గ్రామీణ ప్రజలను తీసుకోలేదు. అందుకే, ధనవంతుల కోసం ఉద్దేశించిన ప్రైవేట్ పాఠశాల విద్యతో సరిపోయే పాఠశాల వ్యవస్థలో వారిని విద్యావంతులను చేయాలి. ఆ ప్రైవేట్ పాఠశాల విద్య ఇంగ్లీషు మీడియంలో కొనసాగాలి. గ్రామీణ వ్యవసాయాధారిత పిల్లలకు ప్రభుత్వ రంగంలో ఇలాంటి విద్యను అందించకపోతే వారు రాష్ట్ర, జాతీయ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో చేరలేరు.

విప్లవాత్మక అభివృద్ధి నమూనా

భారీ మల్టీ లేన్ రోడ్లు, పెద్ద విమానాశ్రయాలు, ఓడరేవులతో కూడిన 'హైవే ఎకానమీ', ప్రభుత్వ రంగ పరిశ్రమలను భారీగా ప్రైవేటీకరించడం ఆర్ఎస్ఎస్ దృక్పథానికి బాగా సరిపోతుందని మితవాద ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఆరెస్సెస్‌కి సంబంధించిన ఈ ఆధునిక ఆలోచన పురాతనమైన మధ్యయుగ వర్ణ ధర్మ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమై ఉంది. ఆ వ్యవస్థలో శూద్ర ఉత్పాదక ప్రజానీకానికి ఆస్తులపై యాజమాన్యం ఉండకూడదు. ఈ నమూనాతో చంద్రబాబు శ్రుతిమించి పోయారు. వైఎస్ జగన్ మాత్రం అభివృద్ధి నమూనానే మార్చేశారు. దీన్ని నేను శూద్ర అభివృద్ధి నమూనా అని పిలుస్తున్నాను. రాష్ట్ర బడ్జెట్ ప్రధానంగా అన్ని కులాలు, కార్మిక వర్గాలను కలిగి ఉన్న వ్యవసాయ, చేతివృత్తుల ఉత్పాదక ప్రజానీకానికి ఉద్దేశించినదని సూచించడానికి నేను శూద్ర అనే చారిత్రక పదాన్ని ఉపయోగిస్తున్నాను.

మొత్తం వ్యవసాయ, చేతివృత్తులకు చెందిన ఉత్పాదక ప్రజానీకంలో (ఆదివాసీ, దళిత వర్గాలు, రిజర్వ్‌డ్ శూద్ర ఓబీసీలు, రెడ్డి, కమ్మ, కాపు వంటి అన్‌రిజర్వ్‌డ్ శూద్రులు అందరూ ఇందులో ఉంటారు) నైపుణ్యాలు, వనరుల పునాదిని తప్పనిసరిగా మార్చాలని వైఎస్ జగన్ సరిగ్గా అర్థం చేసుకున్నారు. రాష్ట్ర పెట్టుబడిని పాఠశాల, కళాశాల విద్య, గ్రామ పరిపాలనలోకి మార్చడం ద్వారా ఈ పరివర్తన సాధ్యమవుతుంది.

వైఎస్ జగన్ రెండు వినూత్న ఆలోచనలను ముందుకు తేవడం ద్వారా ఇదంతా సాధ్యం చేశారు: 1) ప్రభుత్వ రంగంలో నాణ్యమైన ఇంగ్లీషు మీడియం విద్యను అందించడం. ఇది నైపుణ్యం, జ్ఞానం రెండింటిలోనూ గ్రామాన్ని ప్రపంచంతో కలుపుతుంది. విద్యా ఖర్చుల కోసం డబ్బును బదిలీ చేయడం ద్వారా పాఠశాల, కళాశాల పిల్లల తల్లులకు ఆర్థిక సహాయం అందించడాన్ని కూడా దీనికి జోడించారు. 2) పాఠశాల మౌలిక సదుపాయాలను, గ్రామ పరిపాలనను భారీగా మార్చడానికి రాష్ట్ర అభివృద్ధి వనరులను ఖర్చు చేయడం. ప్రధాన వ్యాపారాలు లేని, శ్రమతో పని చేసే సాంప్రదాయ శూద్రులందరికీ ఈ నమూనాలో కొత్త నైపుణ్యాలు, ప్రపంచ భాషతో వ్యవహరించడానికి ప్రవేశం లభిస్తుంది. దాని భవిష్యత్తు ప్రభావాన్ని ఇప్పటి వరకు దేశం మొత్తం మీద ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఊహించలేకపోయారు. ఇది విప్లవాత్మకమైన అభివృద్ధి నమూనా.

పెట్టుబడుల కేంద్ర మార్పు

ఈ నమూనా... పెట్టుబడిని కేంద్రీకృత పట్టణ రంగాల నుండి వైవిధ్యమైన గ్రామీణ సమాజాలకు మారుస్తుంది. ఇది పట్టణ బ్యాంకుల్లోని డబ్బు నిల్వలను గ్రామీణ మార్కెట్లకు తరలిస్తుంది. ఇది విస్తారమైన గ్రామీణ ప్రజల ఆరోగ్యం, వ్యయం, ఉత్పత్తి, విజ్ఞాన పునాదిని మెరుగుపరుస్తుంది. మొత్తంగా సంపద కేంద్రీకరణను పట్టణ ధనవంతుల నుండి విస్తారమైన గ్రామీణ ప్రజానీకానికి బదలాయిస్తుంది. ఈ పెట్టుబడి ఉచితాల కిందికి రాదు. ఇది భవిష్యత్ విప్లవానికి సంబంధించిన పెట్టుబడి. సాధారణంగా విప్లవం గురించి మాట్లాడే కమ్యూనిస్టులు కూడా భారతీయ కుల–సాంస్కృతిక సమాజంలో విప్లవం అంటే ఏమిటో అర్థం చేసుకోలేకపోయారు. బెంగాల్‌లో వారి 34 ఏళ్ల పాలన గ్రామీణ ప్రజానీకాన్ని ప్రపంచీకరణ ప్రక్రియతోనూ, ఆంగ్ల విద్యతోనూ ముడిపెట్టకుండా ఎలా దూరంగా ఉంచిందో నిరూపించింది.

ఈ విప్లవం భారతదేశ అభివృద్ధిపై రెండు ముఖ్యమైన ప్రభావాలను కలిగి ఉంది. చారిత్రాత్మకంగా జ్ఞాన వ్యవస్థను నియంత్రిస్తున్నందున సంపద మొత్తంగా ద్విజ సంఘాల చేతుల్లో కేంద్రీకృతమై ఉంది. పురాతన కాలంలో ఇది సంపదను, సంస్కృత భాషను నియంత్రించింది. మధ్యయుగ కాలంలో ద్విజులు ముస్లిం పాలకులతో కలిసి సంపదను, పర్షియన్ భాషను నియంత్రించారు. గత 75 ఏళ్లుగా వారు సంపదను, ఆంగ్ల భాష ఆధారిత జ్ఞానాన్ని నియంత్రించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం విద్యపై దృష్టి సారించడం ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వం సంపదను, విజ్ఞానాన్ని వ్యవసాయ, చేతివృత్తుల వారి చేతుల్లోకి తెచ్చింది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తారుమారు



ముస్లింల పవిత్ర స్థలాలైన మక్కా, మదీనాల్లోకి ముస్లిమేతరులకు ప్రవేశం లేదు. అలాంటిది స్మృతీ ఇరానీ(కేంద్ర మంత్రి), నిరుపమా కొట్రు (ఉన్నతాధికారి) ఇవ్వాళ మదీనా సందర్శించారు. ఒకవైపు సౌదీ అరేబియా ఉదార, నాగరిక దేశంగా మారుతుంటే, మరోవైపు నా బంగ్లాదేశ్ మాత్రం (ఒకప్పటి) ఛాందస, అనాగరిక సౌదీలా మారుతోంది.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

వెళ్లిపోయిన లెజెండ్



ఒక అందమైన యుగం ముగిసింది. భారత శాస్త్రీయ సంగీతంలో గొప్ప లెజెండ్స్‌లో ఒకరైన ఉస్తాద్ రశీద్ (ఖాన్) జీ వెళ్లిపోవడం అత్యంత విషాదకరం (క్యాన్సర్‌తో మరణించారు). ఆయన మా సినిమాలో 'సజ్నా' పాట పాడటం మర్చిపోలేను. ఆయన కుటుంబానికి నివాళి.

– మిమీ చక్రవర్తి, నటి, లోక్‌సభ ఎంపీ (తృణమూల్)

స్ఫూర్తికి సలామ్!



2023లో నాకు అతిపెద్ద ప్రేరణ శీతల్ దేవి. ఆమె పట్టుదల సంభ్రమం కలిగించింది. ఆమె మీద ఎవరైనా సినిమా తీస్తే బాగుండు. బాలబాలికలు ఎందరికో స్ఫూర్తి కాగలదు. శీతల్... నీకు వందనం! (16 ఏళ్ల రెండు చేతులూ లేని విలువిద్యా క్రీడాకారిణి. అర్జున అవార్డు అందుకుంది.)

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్

నూతన దౌత్యం?



మాల్దీవుల విషయంలో భారత స్పందన... సంప్రదాయేతర మార్గాల ద్వారా బలప్రయోగ దౌత్యానికి ఒక పాఠ్యపుస్తక ఉదాహరణ.

– హేమీమాన్ జాకబ్, ప్రొఫెసర్

ఎలాంటి సందర్భం!



రాష్ట్రపతి ద్రౌపది (ముర్ము)... అర్జున, ద్రోణాచార్య అవార్డులను బహూకరించడం దానికదే ఒక ఇతిహాసం.

– రమేశ్ శ్రీవత్స్, వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

తీర్పు హర్షణీయం

'బిల్కిస్ బానో' కేసులో యావజ్జీవ జైలు శిక్ష అనుభవిస్తున్న 11 మందినీ విడుదల చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. రెండు వారాలలోగా 11 మంది ముద్దాయిలూ జైలు అధికారుల ముందు లొంగిపోవాల్సిందిగా ఆదేశాలిచ్చింది.

ఈ తీర్పుకు వివిధ సాంస్కృతిక సంస్థల సమ్మిళిత రూపమైన విజయవాడ 'సంగమం' హర్షం వ్యక్తం చేస్తోంది. జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్... 2002లో గుజరాత్‌లో బిల్కిస్ బానోపై సామూహిక లైంగిక దాడి చేయడం, ఆమె కుటుంబ సభ్యులను చంపడం వంటి దారుణాలకు పాల్పడిన హంతకుల శిక్షాకాలంలో రెమిషన్ ఇవ్వవచ్చునని సిఫార్సు చేసిన గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ చర్యను తప్పు పట్టింది. ఆ సిఫార్సు ఆధారం చేసుకుని ఒకానొక సుప్రీంకోర్టు బెంచ్ యావత్ జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న వారిని 2022 ఆగస్టు 15న విడుదల చేసిన సంగతి తెలిసిందే. అసలు అలాంటి రెమిషన్ యథాలా పప్పు నిర్ణయమనీ, అలాంటి నిర్ణయం గైకొనే అర్హత గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వానికి లేదనీ కూడా సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

వాస్తవానికి కేసు విచారణ జరిగిన, శిక్ష విధించిన మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే రెమిషన్ గురించిన సిఫారసు చేసే అవకాశం ఉన్నది. కానీ, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం రెమిషన్ సిఫారసు చేసింది. దీంతో భయంకర నేరానికి పాల్పడిన 11 మంది ముద్దాయిలకు 75 ఏళ్ల స్వాతంత్ర్య అమృతకాలంలో 2022 ఆగస్టు 15న విడుదల అయ్యే అవకాశం లభించింది. వారిని గుజరాత్ రాష్ట్ర బీజేపీ నాయకులు దండలతో అభినందనలతో స్వాగత సత్కారాలు నిర్వహించారు. విజయోత్సవాలు జరిపారు.

దేశం దేశమంతా సిగ్గుపడేట్లు చేసిన ఈ సంఘటనను ప్రశ్నిస్తూ బిల్కిస్ బానో తిరిగి సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. అలాగే కొందరు ప్రజా ప్రయోజనాల వాజ్యాన్ని వేశారు. తాజాగా తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు, తనకు లేని అధికారాలను ఉపయోగించుకుని బిల్కిస్ కేసులో ముద్దాయిలకు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం రెమిషన్ వచ్చేట్లు చేయటాన్ని తప్పు పట్టిన దృష్ట్యా, తక్షణమే గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గం రాజీనామా చేయాలి.

– సి. ఉమా మహేశ్వరరావు, సినీ దర్శకులు, 'సంగమం' కోకన్వీనర్

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయోధ్య

సందర్భం



డా॥ పాలేరు పోతురాజు

భారత దేశ ప్రాచీన నగరాలలో అత్యంత ప్రముఖమైన నగరం అయోధ్య. గత కొన్ని దశాబ్దాలుగా ఇది భారత్‌లో వార్తల్లో నానుతూనే ఉంది. ఈ ఏడాది జనవరి 22న అయోధ్యలో నిర్మించిన రామాలయంలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో మళ్లీ వార్తల్లో నిలిచింది. నేటి ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లాలో సరయు నది ఒడ్డున అయోధ్య ఉంది. ఇతిహాసాలు, పురాణాల్లో అయోధ్య ప్రముఖంగా పేర్కొనబడింది. మాంధాత, సత్యహరిశ్చంద్రుడు, రఘువంశ రాముడు లాంటి ఐతిహాసిక పురుషులు ఈ ప్రాంతాన్ని పాలించారని అంటారు. రామాయణంలో వాల్మీకి ఈ నగరాన్ని వర్ణిస్తూ ఏడు వేల చ.కి.మీ. వైశాల్యంలో విస్తరించిందని పేర్కొన్నాడు.

'షోడశ మహాజన పదాలు' అని వ్యవహరించిన 16 రాజ్యాలు అత్యంత ప్రాచీన కాలంలో భారత ఉప ఖండంలో ఉండేవని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. వీటిలో ఒక రాజ్యమే కోసల. ఈ రాజ్యాన్ని పరిపాలించినవాడు గౌతమ బుద్ధుని తండ్రియైన శుద్ధోదనుడు. బుద్ధుడు వర్షాకాలములో అయోధ్యలో నివసించినట్లు బౌద్ధ గ్రంథాలు చెబుతున్నాయి. భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికులు పాహియాన్, హుయాన్ త్సాంగ్ తమ రచనలలో అయోధ్య నగరంలో చాలా బౌద్ధ ఆలయాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే జైన తీర్థంకరుల ఆలయాలూ ఇక్కడ ఉండేవి. ఇప్పటికీ అయోధ్య జనాభాలో బౌద్ధ, జైన మతస్థులు కలిసి ఒక శాతంగా ఉండటం చూస్తే... ప్రాచీన కాలం నుంచి ఇక్కడ ఈ మతాల ఉనికి కొనసాగుతున్నదని అర్థమవుతోంది.

16వ శతాబ్దం వచ్చేటప్పటికి మొగలాయీల రాజ్యానికి బాబర్ అంకురార్పణ చేశాడు. అతడి పాలనాకాలంలోనే అయోధ్యలో 'బాబ్రీ మసీద్' నిర్మిత మయ్యింది. ఈ మసీదు నిర్మించిన ప్రాంతంలోనే రాముడు జన్మించినట్లు హిందూ సంస్థలు భావిస్తున్నాయి. మొఘలుల పతనం తర్వాత అనేక ప్రాంతీయ రాజ్యాలు ఏర్పడినాయి. వాటిలో ఒకటి 'అవధ్'. ఈ రాజ్య మొదటి పాలకుడు సాదత్ ఖాన్. వీరు పర్షియా నుండి రావటం వలన ఈ ప్రాంతంలో భారతీయ, పారశీక సంస్కృతుల మేలు కలయికతో 'లక్నో సంస్కృతి' విలసిల్లింది. వీరి కాలంలో అయోధ్యలో నిర్మించిన మోతీమహల్, గులాబీ బారి (షుజా ఉద్దౌలా సమాధి) వంటి కట్టడాలు వీరి వాస్తు శైలికి మంచి ఉదాహరణలు. ఈ పాలకులే అయోధ్యలోని 'హనుమాన్ గరి' ఆలయ నిర్వహణకు భూదానాలు చేశారు. అయోధ్యలో అనేక సూఫీ సన్యాసుల సమాధులూ (దర్గాలు) ఉన్నాయి. అంటే సూఫీ మతం కూడా ఇక్కడ చెప్పుకోదగిన విధంగానే విలసిల్లిందని భావించాలి.

1949 నాటికి బాబ్రీ మసీద్ తమదని హిందూ సంస్థలు ప్రకటించడంతో నెహ్రూ ప్రభుత్వం మసీదుకు తాళం



వేయించింది. తరువాత ఈ అంశం కోర్టుకెక్కింది. ఈ లోపు కొన్ని పరిణామాల నేపథ్యంలో 1986 ఫిబ్రవరిలో ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ మసీదు తాళాలు తీయించారు. 1987లో దూరదర్శన్‌లో రామాయణం సీరియల్ దేశవ్యాప్తంగా ప్రసారం కావటంతో 'రామ జన్మభూమి' అంశాన్ని హిందూ మతవాద సంస్థలు ప్రజలలోకి చాలా తేలికగా తీసుకొని వెళ్ళగలిగాయి. దేశ రాజకీయాలలో 1984లో రెండు సీట్లు ఉన్న బీజేపీ 1989లో 86 సీట్లు గెలవగలిగిన స్థితికి చేరుకుంది. బీజేపీ అధ్యక్షుడు ఎల్‌కే అద్వాణీ 'రామ జన్మభూమి'ని ఆయుధంగా చేసుకొని రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసం 1990 సెప్టెంబర్ 25న గుజరాత్‌లోని సోమనాథ్ నుండి 6 వేల మైళ్ళ దూరంలో ఉన్న అయోధ్యకు రథయాత్ర ప్రారంభించారు. ఈ రథ యాత్ర 10 రాష్ట్రాల గుండా ప్రయాణించటానికి ఏర్పాట్లు చేసుకొన్నారు. అక్టోబరు 23న బిహార్‌లోని సమస్తిపూర్ చేరుకున్న రథ యాత్రను నాటి ముఖ్య మంత్రి లాలు ప్రసాద్ యాదవ్ అడ్డుకుని అద్వాణీని అరెస్టు చేయించారు. ఈ నేపథ్యంలో 75 వేల మంది కరసేవకులు అయోధ్య చేరటంతో ఆనాటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ బాబ్రీ మసీదును వారి నుంచి కాపాడారు. 1992లో కేంద్రంలో కాంగ్రెస్, యూపీలో బీజేపీ అధికారంలో ఉన్నాయి. డిసెంబరు 6న కరసేవకులు బాబ్రీ మసీద్‌ను కూల్చివేసి అక్కడ రాముని విగ్రహాలు పెట్టారు.

2014 ఎన్నికలలో బీజేపీ సంపూర్ణ మెజారిటీ సాధించిన తరువాత సుప్రీం కోర్టు 2019లో 2.77 ఎకరాలలో రామాలయం నిర్మించటానికి అనుమతి నిచ్చింది. ముస్లింలకు వేరొక చోట 5 ఎకరాలలో మసీద్‌ను నిర్మించుకోవటానికి అనుమతి నిచ్చింది. 2020లో నాటి ప్రధాని నరేంద్రమోదీ రామ మందిరానికి శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది జనవరి 22న ఆ మందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ జరుగనున్నది. అయోధ్యలోని రాముని ఆలయ సముదాయం 64 ఎకరాలలో నిర్మితమయ్యింది. ప్రధాన ఆలయం 2.77 ఎకరాలలో 'నాగర' శైలిలో సిమెంటు, ఇనుము ఉపయోగించకుండా మూడు అంతస్తుల్లో 5 మండపాలతో 'అష్టభుజి' ఆకృతిలో నిర్మించారు. అత్యంత ప్రాచీన కాలం నుంచి ఇప్పటి వరకు అయోధ్య, దాని చుట్టుపక్కల ప్రాంతాలను గమనించినట్లయితే... అది అనాది నుంచీ అనేక మతాలకూ, సంస్కృతులకూ ఆలవాల మయ్యిందని అర్థమవుతోంది. వివిధ మతాలవారు కలిసి మెలిసి సహజీవనం చేశారని తెలుస్తోంది. ఇప్పుడు కూడా అయోధ్యలో హిందూ దేవాలయాల దగ్గర ముస్లింలు పూజాసామగ్రి అమ్ముతూ వుంటారు. అదే విధంగా ముస్లింల దర్గాల దగ్గర హిందువులు తమ వ్యాపారాలను కొనసాగిస్తూ వున్నారు. బౌద్ధులూ, జైనులూ గణనీయంగానే ఇక్కడ నివసిస్తున్నారు. భవిష్యత్తులో కూడా అయోధ్య మతసామరస్యానికీ, భిన్నత్వంలో ఏకత్వానికీ ప్రతీకగా నిలుస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త గుంటూరు హిందూ కళాశాలలో చరిత్ర అధ్యాపకులు | 9441 693201

పశుపతి

బోళాశంకరుడని కాబోలు, శివుడితో ఆయన భక్తులు అప్పుడప్పుడూ చమత్కారంగా వాదిస్తుంటారు.

'ఓ శంకరా, నేను పశువులా ప్రవర్తిస్తూ పాశవికమైన పనులు చేస్తూ ఉంటాను గదా అని, 'వీడొక పశువు' అని నన్ను దూరం చేయకు' అని వాదిస్తాడు ఒక భక్తుడు. 'నేను పశువునైతే, నా రక్షణ భారం ఎవరిది? 'పశుపతి'వి నువ్వే కనక ఆ బాధ్యత నీదే! పైగా నువ్వు ఇప్పటికే ఒక పశువును నీ చెప్పు చేతలలో ఉంచుకొని, దాని మీదే విహరిస్తుంటావన్నది జగమెరిగిన సత్యం. కాబట్టి నేను పశువునయితే, నన్ను అదుపు చేసి, సరయిన మార్గంలో సవ్యంగా నడిపించడం నీకు కష్టం కాదు. అది నీకు అలవాటే.



లేక, నేను అనేక విధాలైన పాపాలు చేసి కళంకితుడినయిపోయానని నువ్వు నన్ను తోసిపారేస్తావేమో, అదీ న్యాయం కాదు. నువ్వు లోకమంతా వెతికివెతికి, మరేదీ దొరకనట్టు, మచ్చ(కళంకం) ఉన్న చంద్రుడిని తెచ్చుకొని, నిరభ్యంతరంగా సిగపూవుగా అలంకరించుకొన్నవాడివి. కనక, కళంకితుడినన్న నెపంతో నన్ను కాదనడం నీకు భావ్యం కాదు.

అంతే కాదు, నేను ఎన్నో అబద్ధాలాడుతుంటాను. రెండు నాలుకల వాడిని. 'ద్విజిహ్వు'డిని. నిజమే. కానీ ఆ సాకు చూపి నన్ను నువ్వు వదిలించుకోవడానికి ప్రయత్నిస్తే, అదీ అన్యాయమే అవుతుంది. నువ్వు రెండు నాలుకలున్న పాములను కోరి కోరి, ఆభరణాలుగా ధరించి తిరిగే వాడివి. సర్పాలతో సహ జీవనం చేసే వాడివి, రెండు నాలుకల వాడినని నన్నెలా తిరస్కరిస్తావు?

అందుచేత, త్వదంగీకృతాః, శర్వ! సర్వే-అపి ధన్యాః- ఓ పరమశివా! నువ్వు స్వీకరించినవన్నీ ధన్యత్వాన్ని పొందుతాయి. నేనూ అంతే' అని భక్తుడి వాదం. సబబే కదా?

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.7.27 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** మూల రా.7.24 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.52 నుండి 7.24 వరకు, తదుపరి తె.4.49 నుండి 6.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.45 నుండి 12.33 వరకు, **అమృత ఘడియలు:** ప.1.17 నుండి 2.51 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.37, **సూర్యాస్తమయం:** 5.38.

ఆ ఉద్యోగ ప్రకటన నమ్మి మోసపోవద్దు

సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణ (సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్) ఇచ్చేందుకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఉద్యోగాల పేరిట కొందరు మోసపూరిత ప్రకటనలు ఇస్తున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దని సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 'యూత్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, విజయవాడ, ఆంధ్రప్రదేశ్' పేరిట ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న లేఖ మోసపూరితమని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష తరపున పాఠశాలల్లో పనిచేసేందుకు ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగ ప్రకటనలు ఇవ్వలేదని, నిరుద్యోగ యువత నుంచి డబ్బులు వసూలు చేయడానికే కొందరు ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. యూత్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గాని, వారి ప్రకటనతో గాని సమగ్ర శిక్ష కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇలాంటి ప్రకటనలను నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు.

ఇంటర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంటర్ కళాశాలలకు ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. తిరిగి 18వ తేదీన కాలేజీలు పునఃప్రారంభమవుతాయని బోర్డు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రజల ప్రయోజనం కోసమే

నీతి ఆయోగ్ ముసాయిదా చట్టానికి అనుగుణంగానే తుది చట్టం

- దేశంలోని అన్ని రాష్ట్రాలు ఈ చట్టం చేసుకోవాలని కేంద్రం సూచించింది
- ఆ దిశగా మొట్టమొదట చట్టం చేసిన రాష్ట్రం ఏపీ
- మన చట్టాన్ని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి
- రికార్డులు అప్‌డేట్ అయిన తర్వాత చట్టం అమలవుతుంది
- దీనికి ఇంకా నిబంధనలు తయారు కాలేదు
- న్యాయవాదులు ఆందోళన విరమించాలని కోరుతున్నా
- విశాల ప్రయోజనాలు, భూవివాదాల పరిష్కారం కోసమే చట్టం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన, చిత్రంలో ఇంతియాజ్ అహ్మద్

సాక్షి, అమరావతి: ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రజల కోసం.. వారి ప్రయోజనాల కోసమే వచ్చిందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. ఈ చట్టం వల్ల ప్రయోజనమే తప్ప ఎవరికీ నష్టం జరగదని స్పష్టం చేశారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. భూమిపై స్పష్టమైన హక్కులు కల్పించే విధానం కోసం దేశంలో చాలాకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో భాగంగానే తొలిసారిగా ఏపీలో ఇది వచ్చిందని తెలిపారు. 1989లో కేంద్ర ప్రభుత్వం భూమి హక్కులపై భరోసా ఇవ్వడానికి ప్రొఫెసర్ డీసీ వాధ్వాతో ఏకసభ్య కమిషన్ నియమించి, దేశంలో భూమి హక్కులకు సంబంధించి రికార్డులు అధ్యయనం చేసి ఎలాంటి రికార్డుల వ్యవస్థ ఉండాలో నివేదిక ఇవ్వాలని కోరిందని గుర్తు చేశారు. కమిషన్ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందని, 33 సంవత్సరాల క్రితం ఇచ్చిన ఆ నివేదికలో మన దేశంలో కూడా టైటిల్‌కి గ్యారంటీ ఉండే వ్యవస్థ తీసుకురావాలని, ఇప్పుడున్న వ్యవస్థలో అది లేదని తేల్చిచెప్పిందని వివరించారు.

ఆదరాబాదరాగా చేసిన చట్టం కాదు

ఏపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని ఇప్పటికిప్పుడు ఆదరాబాదరాగా.. తనంతట తానుగా టైటిలింగ్ చట్టాన్ని చేయలేదని మంత్రి ధర్మాన తెలిపారు. ఒక సుదీర్ఘ అధ్యయనం తర్వాత ప్లానింగ్ కమిషన్, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇది వచ్చిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ చట్టం కోసం అనేక ప్రయత్నాలు జరుగుతున్న క్రమంలో ఏపీలో టైటిలింగ్ చట్టం వచ్చిందని, అన్ని రాష్ట్రాల కంటే ముందు వచ్చిందని తెలిపారు. దేశంలో ఇప్పుడున్న భూరికార్డులు ఏపీ స్థిరపరిచే (కన్‌ఫర్మ్‌డ్) టైటిల్ ఇచ్చేవి కావని దేశ అత్యున్నత న్యాయస్థానం పలు సందర్భాల్లో చెప్పడంతోపాటు తీర్పులు కూడా ఇచ్చిందని తెలిపారు. బ్రిటిష్ వాళ్లు భూమి శిస్తు వసూలు కోసం ఈ రికార్డులు రాసుకున్నారే తప్ప ఆ రికార్డును చూసి ఈ ఆస్తి ఫలానా వాళ్లదని కచ్చితంగా నిర్ధారించలేమని చెప్పిందని తెలిపారు. దీనివల్లే పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టేందుకు భయపడే పరిస్థితి ఉందన్నారు. దేశ ప్రగతికి ఇది ఇబ్బందిగా మారడం వల్లే కేంద్రం దేశవ్యాప్తంగా టైటిల్ గ్యారంటీ వ్యవస్థ తీసుకురావాలని నిర్ణయించిందని తెలిపారు. అందులో భాగంగా 2019లో ఒక ముసాయిదా చట్టాన్ని కూడా తయారు చేసిందని, దాని ప్రకారం నీతి ఆయోగ్ ఒక ముసాయిదా చట్టాన్ని తయారు చేసి అన్ని రాష్ట్రాలు దానిని అనుసరించాలని చెప్పిందన్నారు. నీతి ఆయోగ్ సూచించిన మేరకే ఏపీలో తొలిసారిగా ఈ చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ప్రస్తుతం దేశంలోని సివిల్ కోర్టుల్లో ఉన్న వివాదాల్లో 66 శాతం భూములకు సంబంధించినవేనని, అవి కూడా రూ.లక్ష ఆదాయం లోపు ఉన్న వారికి సంబంధించినవే 93 శాతమని కేంద్రం అధ్యయనంలో తేలిందన్నారు. ఎన్‌సీఆర్‌బీ రికార్డుల ప్రకారం దేశంలో 14 శాతం హత్యలు, 60 శాతం నేరాలు భూ వివాదాల వల్లే జరుగుతున్నాయని తేల్చినట్టు చెప్పారు. ప్రిజెంటివ్ టైటిల్ వ్యవస్థ ఉండటం వల్లే ఇది జరుగుతోంది కాబట్టి కన్‌క్లూజివ్ టైటిల్ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించిందని తెలిపారు.

విస్తృత అధ్యయనం తరువాతే చట్టం

ఈ చట్టం వల్ల నష్టం జరుగుతుందని కొంతమంది అభిప్రాయపడుతున్నారని.. దానికి అవకాశం లేదని మంత్రి ధర్మాన స్పష్టం చేశారు. ఇప్పుడున్న రికార్డులను యథాతథంగా ఈ చట్టం కిందకు తీసుకురావడం లేదన్నారు. రీసర్వే రాష్ట్రంలో శరవేగంగా జరుగుతోందని, ఇప్పటికే 4 వేల రెవెన్యూ గ్రామాల్లో పూర్తయిందన్నారు. సర్వేలో రికార్డులన్నీ అత్యంత కచ్చితత్వంతో అప్‌డేట్ అవుతాయని, ఆ తర్వాత వివాదాలు లేని రికార్డు తయారవుతుందన్నారు. వందేళ్ల తర్వాత ఏపీలో జరుగుతున్న ఈ సర్వే గురించి ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించే పరిస్థితి ఉందన్నారు. రెవెన్యూ రికార్డులు అప్‌డేట్ చేసిన తర్వాత ఈ చట్టాన్ని అమలు చేయడం ప్రారంభిస్తామన్నారు. ఈ చట్టం అమలైపోతుందని కొందరు చెప్పడం సరికాదన్నారు. ఈ చట్టం అమలుకు ఇంకా నిబంధనలు రూపొందించలేదని, న్యాయవాదులు, ఇతర అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నాకే నిబంధనలు రూపొందిస్తామన్నారు. ప్రజల విశాల ప్రయోజనాల కోసం, విస్తృతమైన అధ్యయనం చేసిన తర్వాతే ఈ చట్టం చేశామని, దీనివల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. సివిల్ కోర్టులు సివిల్ కేసులను యథావిధిగా పరిష్కరించాలని ఇప్పటికే హైకోర్టు సూచించిందని చెప్పారు. న్యాయవాదులు ఆందోళన విరమించి కోర్టులకు వెళ్లాలని కోరారు. దీనివల్ల ఎవరికీ అన్యాయం జరగదన్నారు. దేశంలోని కన్‌క్లూజివ్ టైటిల్ ఇచ్చే విధానం అవసరమని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి కొనుక్కున్న ఆస్తిపై ఎప్పటికీ అనుమానం ఉంటే ఆ దేశ గతి ఏమవుతుందో విజ్ఞులు ఆలోచించాలని కోరారు. ఈ చట్టం ఎంతో అవసరమని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిపారు.

11న వాలీబాల్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా వాలీబాల్ పోటీలకు 11న రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తున్నట్లు శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర మంగళవారం తెలిపారు. ఈ నెల 19 నుంచి 31 వరకు చెన్నైలో 6వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేస్తున్నామన్నారు. ఇందులో జనవరి 1న 2005 తర్వాత జన్మించి, ఆధార్ కార్డు/పాస్‌పోర్టు, టెన్త్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, రాష్ట్ర, జాతీయ స్థాయి స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో ఎంపికలకు హాజరు కావాలని కోరారు.

'ఈనాడు' ప్రతుల దహనం

కార్పొరేటర్లపై తప్పుడు కథనాన్ని ఖండించిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న బాలిగోవింద్, వైఎస్సార్‌సీపీ నేతలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'వెలంపల్లికి కార్పొరేట్ షరతులు' అంటూ ఈనాడు ప్రచురించిన కథనాన్ని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఖండించారు. పచ్చ మీడియా తప్పుడు రాతలు రాస్తోందంటూ 'ఈనాడు' ప్రతులను దహనం చేశారు. మంగళవారం విజయవాడ గాంధీనగర్ 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవింద్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడారు. బాలి గోవింద్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం విజయవాడ(పశ్చిమ)ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో కార్పొరేటర్లంతా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికనుగుణంగా నడుచుకుంటామని చెప్పామని తెలిపారు. దీనిపై ఈనాడు తప్పుడు కథనం ప్రచురించిందన్నారు. ఏ ఆధారాలతో తాము డబ్బు అడిగినట్లు కథనం రాసిందో వివరణ ఇవ్వాలని ఈనాడును డిమాండ్ చేశారు. దీనిపై పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. పార్టీలో విభేదాలు సృష్టించేందుకే ఇటువంటి రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతలు సుందర్‌పాల్, పెనుమత్స సత్యం మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో ఎవరికి సీటు ఇచ్చినా పనిచేయాలనే ఉద్దేశంతోనే వెలంపల్లిని కలిశామని స్పష్టం చేశారు.

ఎన్నికలకు ముందే బాబు, పవన్ అస్త్ర సన్యాసం

- ఓటమికి కారణాలను ముందే వెతుక్కుంటున్నారు
- కుప్పంలో చంద్రబాబు ఓటమి ఖాయం
- 175 స్థానాల్లో పోటీకి టీడీపీ, జనసేనకు అభ్యర్థులు ఉన్నారా?
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి ఎద్దేవా



మాట్లాడుతున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్

సాక్షి, అమరావతి: ప్రజల్లో గుర్తింపు లేని చంద్రబాబు, ఎన్నికల కమిషన్ వద్ద గుర్తింపులేని పవన్ కళ్యాణ్.. వారిద్దరూ కలిసి వైఎస్సార్‌సీపీని ఏం చేయగలరని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. అన్ని స్థానాల్లో పోటీ చేసే దమ్ము జనసేనకు ఉందా అని పవన్‌ను నిలదీశారు. ఓటమికి కారణాలను ముందే వెతుక్కుంటున్నారని, ఎన్నికలకు ముందే అస్త్ర సన్యాసం చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉండగా చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర పూర్తయి ఐదేళ్ళు అయిన సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్రం కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబుకు ఓటమి ఖాయమని, కుప్పం ప్రజలు తరిమికొడతారని ఆయనకు తెలిసిపోయిందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేమని తెలిసి ఇద్దరూ కలిసి ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్లి వైఎస్సార్‌సీపీపై బురద చల్లుతున్నారని అన్నారు. ఒక రోజు లక్షల ఓట్లు తొలగించారని, మరో రోజు లక్ష ఓట్లు జోడించారని ఎల్లో మీడియాతో పచ్చి అబద్ధాలు రాయిస్తున్నారన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేక ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. అసలు 175 నియోజకవర్గాలలో పోటీ చేయటానికి టీడీపీ, జనసేనకు అభ్యర్థులు ఉన్నారా అని ప్రశ్నించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ... దళితులను అక్కున చేర్చుకున్న నేత సీఎం జగన్ అని అన్నారు. చంద్రబాబు దళితులను అడ్డు పెట్టుకుని రాజకీయాలు మాత్రమే చేస్తారని, చేసే మేలేమీ ఉండదని విమర్శించారు. దళితులపై పవన్ ఆరోపణలు సరికాదన్నారు. కుప్పంలో చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే ముందుగానే దొంగ ఓట్లు అంటూ హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధులు నారాయణమూర్తి, రాజశేఖర్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' మ్యాచ్‌ల షెడ్యూల్ ఖరారు



సాక్షి, అమరావతి: 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రీడా పోటీలకు మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ధ్యాన్‌చంద్ర మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే మండల స్థాయి పోటీలకు మ్యాచ్ ఫిక్స్చర్స్ పూర్తి చేసిన తర్వాత ఆడుదాం ఆంధ్ర వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. మ్యాచ్‌ల షెడ్యూళ్ల వివరాలు క్రీడాకారుల(పోటీల సమయం, క్రీడా వేదిక)ఫోన్ నంబర్లకు మెసేజ్‌ల రూపంలో పంపిస్తున్నట్లు చెప్పారు. మండలస్థాయి పోటీల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు బుధవారం అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. క్రీడా మైదానాలను అందంగా ముస్తాబు చేసి క్రీడలకు సంబంధించిన కోర్టులను సిద్ధం చేస్తున్నారు.

అప్సడా వైస్ చైర్మన్ రఘురాంకు కేబినెట్ హోదా



టీటీడీ ప్రొటోకాల్ కూడా..

సాక్షి, అమరావతి/తాడేపల్లిగూడెం: ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాంకు కేబినెట్ హోదాను ఇస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. దీంతో పాటు ఆయనకు టీటీడీ ప్రొటోకాల్‌ను కూడా కల్పించింది. శ్రీవారి దర్శనం కోసం రఘురాం ఇచ్చే లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని టీటీడీ ఈవోకు జీవోలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(పొలిటికల్) రేవు ముత్యాలరాజు సూచించారు. ఆక్వా కల్చర్ కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో పాటు వాటికి చట్టబద్ధత కల్పించే లక్ష్యంతో అప్సడా చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. అప్సడాకు సీఎం జగన్ చైర్మన్‌గా, రఘురాం వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. తనకు కేబినెట్ హోదాపై రఘురాం స్పందిస్తూ సీఎం జగన్‌కు తాను జీవితాంతం రుణపడి ఉంటానని, ఆయన ఏ బాధ్యతలు అప్పగించినా చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు.

కూరగాయలతో గంజాయి ప్యాకెట్లు తరలింపు

ఉంగుటూరు: గంజాయి సరఫరాలో అక్రమార్కులు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. కూరగాయలతో పాటు గంజాయి ప్యాకెట్లను తరలిస్తున్న వ్యక్తిని కృష్ణాజిల్లా ఆత్కూరు పోలీసులు అరెస్టు చేశారు. ఆత్కూరు పోలీస్‌స్టేషన్ వద్ద హనుమాన్‌జంక్షన్ సీఐ నవీన్ నరసింహమూర్తి మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమిళనాడు రేగడహళ్లి గ్రామానికి చెందిన తంగమ్ శశికుమార్, ముత్తుతో కలసి ఈ నెల 5న ధర్మపురి నుంచి రాజమండ్రి మినీవ్యాన్‌లో కూరగాయల ట్రేలు వేసుకుని వెళ్లారు. కడియపులంక వద్ద నుంచి లారీలో గంజాయిని పోలీసులకు అనుమానం రాకుండా కూరగాయల ట్రేల అడుగున రూ. 23 లక్షలు విలువ చేసే 232 కేజీ గంజాయి ప్యాకెట్లను అమర్చారు. రాజమండ్రి వద్ద ముత్తు దిగిపోగా శశికుమార్ లారీతో విజయవాడ వైపు వెళుతున్నాడు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లి ఆర్‌టీఏ చెక్‌పోస్టు సమీపంలో ఆత్కూరు పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మినీవ్యాన్‌ని తనిఖీ చేయగా కూరగాయల ట్రేల కింద గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి శశికుమార్ ను అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా...

ఫ్రాన్సు ప్రధానిగా గాబ్రియెల్ అట్టల్



పారిస్: ఫ్రాన్స్ ప్రధాన మంత్రిగా అత్యంత పిన్న వయస్కుడైన 34 ఏళ్ల గాబ్రియెల్ అట్టల్ నియమితులయ్యారు. ప్రతిపక్షాల నుంచి తీవ్ర రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ మంత్రివర్గ ప్రక్షాళన చేపట్టారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రధాని ఎలిజబెత్ బోర్న్ సోమవారం రాజీనామా చేశారు. ఆమె స్థానంలో అట్టల్‌ను నియమిస్తున్నట్లు మంగళవారం మాక్రాన్ ప్రకటించారు. మంత్రి వర్గంలో కొందరు కీలక మంత్రులు మాత్రం యథాతథంగా కొనసాగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రతినిధిగా, విద్యాశాఖ మంత్రిగా అంచెలంచెలుగా ఎదుగుతూ గాబ్రియెల్ అట్టల్ ప్రధాని పదవి చేపట్టడం ఆసక్తికరంగా మారింది. గే అని ప్రకటించుకున్న ఫ్రాన్స్ మొట్టమొదటి ప్రధాని అట్టల్ కావడం గమనార్హం. బోర్న్ మంత్రి వర్గంలో అట్టల్ అత్యధిక ప్రజాదరణ కలిగిన మంత్రిగా ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడైంది.

భూటాన్ ఎన్నికల్లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ విజయం

థింపు: భూటాన్ పార్లమెంట్ ఎన్నికల్లో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) మరోసారి విజయం సాధించింది. మంగళవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. నేషనల్ అసెంబ్లీలో మొత్తం 47 స్థానాలకు గాను పీడీపీ 30 స్థానాలు గెలుచుకుంది. భూటాన్ టెండ్రెల్ పార్టీ కేవలం 17 సీట్లకే పరిమితమైంది. తుది ఫలితాలపై ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన చేయనుంది. భూటాన్ 2008లో రాచరికం అంతమై, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇవి నాలుగో సార్వత్రిక ఎన్నికలు. పీడీపీ విజయం సాధించడంతో ఆ పార్టీ అధినేత, మాజీ ప్రధానమంత్రి త్సెరింగ్ టాబ్‌గే మరోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. భూటాన్ దేశం చైనా, ఇండియా మధ్యలో ఉంటుంది. ఇక్కడ దాదాపు 8 లక్షల జనాభా ఉంది. కొన్నేళ్లుగా ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతోంది. గత ఐదేళ్లుగా వృద్ధి రేటు కేవలం 1.7 శాతంగా ఉంది.

ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం.. లాలూ కుటుంబీకులపై చార్జిషీట్

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై లాలూ భార్య, మాజీ సీఎం రబ్రీ దేవి, కుమార్తె మిసా భారతి తదితరులపై ఈడీ చార్జిషీటు దాఖలు చేసింది. యూపీఏ హయాంలో లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఈ కుంభకోణం జరిగినట్లుగా ఈడీ ఆరోపిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో సీబీఐ చార్జిషీటు వేసింది. తాజాగా ఈడీ వేసిన చార్జిషీటులో ఆర్‌జేడీ చీఫ్ లాలూ యాదవ్ మరో కుమార్తె హేమా యాదవ్(40), లాలూ కుటుంబ సన్నిహితుడు అమిత్ కట్యాల్, రైల్వే ఉద్యోగి హృదయానంద చౌదరితోపాటు ఏకే ఇన్ఫోసిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏబీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ రెండు సంస్థలకు డైరెక్టర్‌గా ఉన్న షరీకుల్ బారి పేర్లు కూడా ఉన్నాయి. ఈ కేసు ఢిల్లీలోని ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కోర్టు ముందుకు ఈ నెల 16వ తేదీన రానుందని అధికార వర్గాలు తెలిపాయి.

శివసేన ఉద్ధవ్ వర్గం ఎమ్మెల్యేపై ఈడీ దాడులు

ముంబై: శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన ఎమ్మెల్యే రవీంద్ర వైకర్, ఆయనకు సంబంధించిన సంస్థలపై మంగళవారం ఈడీ అధికారులు దాడులు జరిపారు. ముంబైలోని జోగేశ్వరి ప్రాంతంలో లగ్జరీ హోటల్ నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై నమోదైన మనీ లాండరింగ్ కేసు దర్యాప్తు భాగంగా ఏడు చోట్ల సోదాలు జరిపినట్లు అధికారులు తెలిపారు. తోట కోసం కేటాయించిన భూమిలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం కోసం వైకర్ అక్రమంగా అనుమ తులు పొందారంటూ ముంబై పోలీస్ ఆర్థిక నేరాల విభాగం నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మనీ లాండరింగ్ కేసు పెట్టింది.

జూలై 7న నీట్ పీజీ పరీక్ష

న్యూఢిల్లీ: నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్–పీజీ పరీక్షను ఈ ఏడాది జూలై 7వ తేదీకి రీషెడ్యూల్ చేసినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ మంగళవారం తెలిపింది. ఈ పరీక్షకు కటాఫ్ అర్హత తేదీ ఈ ఏడాది ఆగస్టు 15గా పేర్కొంది. నీట్ పీజీ పరీక్షను మార్చి 3వ తేదీన నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించిన విషయం గుర్తు చేసింది. ఈ పరీక్షను సవరించిన షెడ్యూల్‌ను అనుసరించి జూలై 7వ తేదీన నిర్వహి స్తామని వివరించింది. ఎండీ/ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఒకే ఒక్క అర్హత పరీక్ష నీట్ పీజీ ఎలిజిబిలిటీ కం ర్యాంకింగ్ పరీక్ష.

షిండే, స్పీకర్ భేటీ అనైతికం

సుప్రీంకోర్టులో శివసేన (ఉద్ధవ్) పిటిషన్

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో శివసేన పార్టీ ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవడానికి సుప్రీంకోర్టు విధించిన గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ సమావేశమై, చర్చించుకోవడం పట్ల శివసేన(ఉద్ధవ్ వర్గం) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నర్వేకర్ ఈ నెల 7న షిండేను ఆయన అధికార నివాసంలో కలిసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. శివసేన పార్టీ ఎమ్మెల్యేలు షిండే, ఉద్ధవ్ వర్గంగా విడిపోయిన సంగతి తెలిసిందే. అవతలి వర్గం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ రెండు వర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నాయి.

వామ్మో 2023!

చరిత్రలోనే అత్యంత వేడి ఏడాది | ఏకంగా 1.48 డిగ్రీలు పెరిగిన సగటు ఉష్ణోగ్రత



- చివరి ఆర్నెల్లలోనైతే ప్రతి రోజూ రికార్డు స్థాయి ఎండలే
- సముద్ర ఉష్ణోగ్రతల్లో కూడా ఏకంగా 0.44 డిగ్రీల పెరుగుదల
- ప్రపంచవ్యాప్తంగా అనూహ్యంగా పెరుగుతున్న సముద్ర మట్టాలు
- వెల్లడించిన ఈయూ వాతావరణ సంస్థ నివేదిక

భూతాపం విషయంలో 2023 కనీవినీ ఎరగని రికార్డు సృష్టించింది. అత్యంత వేడిమి డిసెంబర్ నెల ముగియక ముందే 2023 రికార్డులకెక్కడం తెలిసిందే. అయితే చరిత్రలో ఇప్పటిదాకా అత్యధికంగా 1.48 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత పెరుగుదల నమోదైన ఏడాదిగా 2023 నిలిచింది! 2016 నాటి రికార్డు కంటే ఇది ఏకంగా 0.17 డిగ్రీలు అధికం! అదే 1991–2020 మధ్య 20 ఏళ్ల సగటుతో పోలిస్తే ఏకంగా 0.6 డిగ్రీలు ఎక్కువ!! గతేడాదికి సంబంధించిన ఉష్ణోగ్రతల గణాంకాలను క్షుణ్నంగా విశ్లేషించిన మీదట యూరోపియన్ యూనియన్ వాతావరణ పర్యవేక్షణ సంస్థ కోపర్నికస్ మంగళవారం విడుదల చేసిన నివేదిక ఈ మేరకు పేర్కొంది. అంతేకాదు, 2023 రెండో అర్ధ భాగంలో దాదాపుగా ప్రతి రోజూ ఎండ తీవ్రతలో కొత్త రికార్డులు నెలకొల్పినట్టు తేల్చింది! ఇది నిజంగా భయానక పరిణామమేనని సైంటిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

2023 నవంబర్ 17. భూ ఉష్ణోగ్రతలో ఏకంగా 2.06 డిగ్రీల పెరుగుదల నమోదైన తేదీ! మానవ చరిత్రలో ఉష్ణోగ్రతల పెరుగుదలను రికార్డు చేయడం మొదలు పెట్టినప్పటి నుంచీ అత్యధిక పెరుగుదల అదే! అలా మానవాళి చరిత్రలో ఓ దుర్దినంగా నవంబర్ 17న నిలిచిపోయింది. తర్వాత అదే నెలలో మరోసారి ఉష్ణోగ్రత పెరుగుదల 2 డిగ్రీలను దాటేసింది. దాంతో పర్యావరణవేత్తల్లో గగ్గోలు మొదలైంది. కానీ 2023 రెండో భాగంలో, అంటే జూలై నుంచి డిసెంబర్ దాకా ప్రతి రోజూ ఎండలు కనీవినీ ఎరగని రీతిలో ప్రపంచాన్ని అల్లాడించాయని కోపర్నికస్ తాజా నివేదిక తేల్చింది. పైగా 2023లో 1.48 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత పెరుగుదల నమోదవడమూ భయపెట్టే పరిణామమే. భూ ఉష్ణోగ్రతలో పెరుగుదలను పారిశ్రామికీకరణనాటి తొలి నాళ్లతో, అంటే 1850–1900 సంవత్సరాల మధ్య కాలపు సగటుతో పోల్చి చెబుతారు. అప్పటితో పోలిస్తే దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ 1.5 డిగ్రీల కంటే దిగువకు కట్టడి చేయాలన్నది 2015 నాటి పారిస్ ఒప్పందంలో ప్రపంచ దేశాలన్నీ సంయుక్తంగా చేసుకున్న తీర్మానం. కానీ 2023లో సగటు ఉష్ణోగ్రత పెరుగుదల దాదాపుగా ఆ లక్ష్మణరేఖను తాకింది. 1850తో పోలిస్తే గతేడాది ప్రతి రోజూ ఉష్ణోగ్రతలో 1 డిగ్రీ కంటే ఎక్కువ పెరుగుదల నమోదైంది! 2015లో తొలిసారిగా ఒక్క రోజు ఇలా 1 డిగ్రీ పెరుగుదల నమోదైతేనే ప్రపంచమంతా విస్మయపడింది. అది కాస్తా కేవలం ఏడేళ్లకే రోజువారీ పరిణామంగా మారిపోయింది. పైగా సగటు పెరుగుదలే దాదాపుగా 1.5 డిగ్రీలను తాకేసింది. గ్లోబల్ వార్మింగ్ అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతోందనేందుకు ఇంతకు మించిన తార్కాణం అవసరం లేదని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్కన 2024లో ఉష్ణోగ్రత సరికొత్త రికార్డులు సృష్టించి భూగోళాన్ని మరింత వినాశనం దిశగా నెట్టడం ఖాయమని తాజా నివేదికలో కోపర్నికస్ కూడా అంచనా వేయడం మరింత ఆందోళన కలిగిస్తోంది. జూన్‌లోపే సగటు భూతాపోన్నతి 1.5 డిగ్రీలను దాటేస్తే ఆశ్చర్యం లేదని అది అభిప్రాయపడింది. అదే జరిగితే భూమిపై కీలక పర్యావరణ వ్యవస్థల్లో చాలావరకు అంతటి తాపాన్ని తట్టుకోలేవు. అప్పుడిక ప్రపంచంలో ఒకవైపు తీవ్ర కరువులు, కార్చిచ్చులు, మరోవైపు భయంకరమైన తుపాన్లు నిత్య సమస్యలుగా మారిపోతాయి. గతేడాది అమెరికా, కెనడా, హవాయి, దక్షిణ యూరోప్‌ల్లో నిత్యం కార్చిచ్చులు చెలరేగడం, పలు దేశాలు కనీవినీ ఎరగని వరదలతో, గడ్డకట్టించే చలి పరిస్థితులతో అతలాకుతలం కావడం తెలిసిందే.

వాతావరణ మార్పులు, ఎల్ నినో...

2023 ఇంతగా మండిపోవడానికి వాతావరణ మార్పులే ప్రధాన కారణమని కోపర్నికస్ నివేదిక స్పష్టం చేసింది. దానికి తోడు గతేడాది జూలైకల్లా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో నెలకొన్న ఎల్ నినో (కరువు) పరిస్థితులు పరిస్థితిని మరింత దిగజార్చినట్టు వివరించింది. ఫలితంగా పసిఫిక్ మొదలుకుని ప్రతి మహాసముద్రమూ ఎప్పుడూ లేనంతగా వేడెక్కినట్టు పేర్కొంది. 1991–2020 సగటుతో పోలిస్తే 2023లో సముద్రాల సగటు ఉష్ణోగ్రత పెరుగుదల ఏకంగా 0.44 డిగ్రీలుగా నమోదైంది! దాంతో మంచు ప్రాంతాలైన ఆర్కిటిక్, అంటార్కిటికాలపై దీని ప్రభావం విపరీతంగా పడటం మొదలైంది. అక్కడి మంచు ఎన్నడూ లేనంతగా కొన్నాళ్లుగా శరవేగంగా కరిగిపోతోంది. ఈ దెబ్బకు సముద్ర మట్టాలు ప్రమాదకరంగా పెరిగేలా కనిపిస్తున్నాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా తీర ప్రాంత మహా నగరాలు చాలావరకు నీట మునుగుతాయి. అదే జరిగితే ప్రపంచంలో కనీసం మూడో వంతు జనాభా నిర్వాసితులుగా మారతారని అంచనా. ఊహించుకోవడానికే భయం కలిగే ఇలాంటి పరిణామాలెన్నో అతి త్వరలో జరిగేలా కనిపిస్తున్నాయని సైంటిస్టులు అభిప్రాయపడుతున్నారు.

లక్షద్వీప్‌లో ఎయిర్‌పోర్టు

- వాణిజ్య సర్వీసులను సైతం నడిపేందుకు అవకాశం
- పర్యాటక రంగాన్ని ప్రోత్సహించనున్న కేంద్రం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల లక్షద్వీప్‌లో చేపట్టిన పర్యటన.. దేశీయ పర్యాటకుల్లో ఆ దీవుల సముదాయంపై ఒక్కసారిగా ఆసక్తిని పెంచింది. ఈ నేపథ్యంలో కేంద్ర పాలిత ప్రాంతం లక్షద్వీప్‌లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని తలపోస్తోంది. యుద్ధ విమానాలతోపాటు వాణిజ్య విమాన సర్వీసులను సైతం నడిపేందుకు వీలైన విమానాశ్రయాన్ని లక్షద్వీప్‌లోని మినికాయ్ దీవిలో నిర్మిస్తే బాగుంటుందని యోచిస్తోంది. ఇప్పటి వరకు మినికాయ్ దీవిలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలనే రక్షణ శాఖ ప్రతిపాదన మాత్రమే కేంద్రం వద్ద ఉంది. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో సైనిక, పౌర అవసరాలకు సైతం సరిపోయేలా ఎయిర్‌పోర్టును నిర్మించే సరికొత్త ప్రతిపాదన కేంద్రం పరిశీలిస్తోందని అధికారవర్గాలు తెలిపాయి. అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రాలకు బేస్‌గా, పెరుగుతున్న పైరసీ, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు వ్యూహాత్మకంగా చాలా కీలకమైందిగా ఇక్కడి ఎయిర్‌పోర్టు మారేందుకు అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. అరేబియా సముద్రంపై నిఘాను మరింత విస్తృతం చేసుకునేందుకు మినికాయ్ వద్ద ఎయిర్‌పోర్టు వైమానిక దళానికి ఉపయోగపడనుంది. ప్రస్తుతం లక్షద్వీప్ మొత్తంలో ఒకే ఒక్క విమానాశ్రయం అగట్టిలో ఉంది. ఇక్కడ చిన్న విమానాలు మాత్రమే దిగేందుకు అవకాశం ఉంది. మినికాయ్ దీవిలో విమానాశ్రయం అందుబాటులోకి వస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందనుంది. మరోవైపు, భారత్‌తో వివాదం తమకు భారీగా నష్టం చేసేలా కన్పిస్తున్న నేపథ్యంలో మాల్దీవులకు చెందిన పర్యాటక సంస్థలు రంగంలోకి దిగాయి. ఇటీవల సస్పెన్షన్‌కు గురైన తమ మంత్రులు ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు పేర్కొన్నాయి.

కుక్క మాంసం వినియోగంపై దక్షిణ కొరియా నిషేధం

సియోల్: శతాబ్దాలుగా ఆచారంగా వస్తున్న కుక్క మాంసం వినియోగాన్ని చట్ట విరుద్ధమని ప్రకటించే చారిత్రక బిల్లును దక్షిణ కొరియా పార్లమెంట్ ఆమోదించింది. మంగళవారం ఈ బిల్లుకు నేషనల్ అసెంబ్లీ 208–0 ఓట్లతో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మంత్రి మండలి ఆమోదం, అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ సంతకంతో బిల్లు చట్ట రూపం దాల్చనుంది. యూన్ ప్రభుత్వం కుక్క మాంసంపై నిషేధానికి అనుకూలంగా ఉండటంతో బిల్లు చట్ట రూపం దాల్చడం లాంఛనప్రాయం కానుంది. శునక మాంసం వినియోగం, వాటిని మాంసం కోసం పెంచడం, విక్రయం, వధించడం 2027 నుంచి నేరం కానుంది. ఉల్లంఘిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. కుక్క మాంసం వినియోగంపై నిషేధానికి గతంలో పలుమార్లు ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ రైతులు, కుక్క మాంసం పరిశ్రమదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తాము ఇక ఎంతమాత్రం కుక్క మాంసం భుజించబోమంటూ ఇటీవలి సర్వేల్లో మెజారిటీ దక్షిణ కొరియన్లు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ప్రభుత్వం అందుకు అనుగుణంగా చట్టం తెచ్చింది.

ప్రఖ్యాత హిందుస్తానీ గాయకుడు ఉస్తాద్ రషీద్ ఖాన్ కన్నుమూత



కోల్‌కతా: ప్రముఖ హిందుస్తానీ గాయకుడు ఉస్తాద్ రషీద్ ఖాన్ (55)మంగళవారం కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. 2019 నుంచి ప్రొస్టేట్ క్యాన్సర్‌తో ఆయన బాధపడుతున్నారు. గత నెలలో గుండెపోటుకు గురైన ఖాన్ అప్పటి నుంచి ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి ఖాన్ మంగళవారం మధ్యాహ్నం 3.45కు తుదిశ్వాస విడిచారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రాంపూర్–సహస్వాన్ ఘరానా సంప్రదాయానికి చెందిన ఖాన్ ఘరానా వ్యవస్థాపకుడు ఇనాయత్ హుస్సేన్ ఖాన్ ముని మనవడు. యూపీలోని బదౌన్‌కు చెందిన ఖాన్ కుటుంబం ఆయనకు పదేళ్ల వయస్సులో 1980లో కోల్‌కతాకు వలస వచ్చింది. సీఎం మమతా బెనర్జీ ఆస్పత్రికి వెళ్లి ఖాన్ కుటుంబసభ్యులను ఓదార్చారు. రషీద్ ఖాన్ మృతి పట్ల రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. ఇలా ఉండగా, ఖాన్ 11 ఏళ్ల వయస్సులోనే 1994లో మొట్టమొదటి కచేరీలో పాల్గొని, సంగీత కళాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. రాంపూర్ సహస్వాన్ సంప్రదాయ గానానికి చిట్ట చివరి దిగ్గజంగా ఆయన పేరు తెచ్చుకున్నారు. 'విలంబిత్ ఖయాల్' శైలిలో మూడు దశాబ్దాలుగా కోట్లాది మంది సంగీత ప్రియులను ఆయన గాత్రం అలరిస్తోంది. మై నేమ్ ఈజ్ ఖాన్, జబ్ వుయ్ మెట్, ఇసాక్, మంటో, మౌసమ్ తదితర చిత్రాల్లో నేపథ్య గాయకుడిగా ఉన్నారు. ఆయన్ను కేంద్రం పద్మ శ్రీ, పద్మ భూషణ్ అవార్డులతో గౌరవించింది.

మాతృత్వానికే మచ్చ తెచ్చిన తల్లి

- నాలుగేళ్ల కుమారుడిని కిరాతకంగా హత్య చేసిన స్టార్టప్ కంపెనీ సీఈఓ
- గోవాలో చంపి, కొడుకు శవాన్ని బ్యాగులో కుక్కి ట్యాక్సీలో కర్ణాటకకు తరలింపు
- అరెస్టు చేసిన పోలీసులు
- ఆరు రోజుల కస్టడీకి నిందితురాలు



సాక్షి బళ్లారి: మాతృత్వానికే మచ్చ తెచ్చిన కన్నతల్లి ఘాతుకం ఇది. కృత్రిమ మేధ స్టార్టప్ కంపెనీ ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ) సుచనా సేథ్ తన నాలుగేళ్ల కుమారుడిని గోవాలో స్వయంగా హత్య చేసింది. కిరాతకంగా పసిబిడ్డ ప్రాణాలను బలితీసుకుంది. మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నించి చివరకు పోలీసులకు దొరికిపోయింది. కన్నబిడ్డ శవాన్ని బ్యాగ్‌లో కుక్కి, ట్యాక్సీలో పారుగు రాష్ట్రం కర్ణాటకకు చేరుకుంది. సోమవారం రాత్రి చిత్రదుర్గలో ఆమెను అరెస్టు చేసినట్లు గోవా పోలీసులు తెలిపారు. మంగళవారం గోవాకు తరలించి, న్యాయస్థానంలో హాజరుపర్చారు. నిందితురాలు సుచనా సేథ్‌ను తదుపరి విచారణ నిమిత్తం ఆరు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ గోవా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆమె దురాగతానికి ఒడిగట్టడానికి కారణం ఏమిటన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

భర్త నుంచి విడిపోయి..

39 ఏళ్ల సుచనా సేథ్ మైండ్‌ఫుల్ ఏఐ ల్యాబ్ అనే స్టార్టప్ కంపెనీ సీఈఓగా పనిచేస్తోంది. 2021లో 'టాప్ 100 బ్రిలియంట్ ఉమెన్ ఇన్ ఏఐ ఎథిక్స్'గా గుర్తింపు పొందింది. ఈ నెల 6న తన కుమారుడితో కలిసి ఉత్తర గోవాలోని కాండోలిమ్‌లో సర్వీసు అపార్టుమెంట్‌లో అద్దెకు దిగింది. రెండు రోజులపాటు అక్కడే గడిపింది. ఓ పని కోసం తాను బెంగళూరు వెళ్లాల్సి ఉందని, ట్యాక్సీ ఏర్పాటు చేయాలని ఈ నెల 8న అపార్ట్‌మెంట్ సిబ్బందిని కోరింది. ట్యాక్సీని అద్దెకు తీసుకోవడం కంటే విమానంలో వెళ్లడమే చౌక అని వారు సూచించగా, అందుకు నిరాకరించింది. ట్యాక్సీ కావాలని పట్టుబట్టడంతో వారు ఆ మేరకు వాహనం ఏర్పాటు చేశారు. 8వ తేదీన తెల్లవారు జామునే ట్యాక్సీలో బెంగళూరుకు పెద్ద బ్యాగుతో బయలుదేరింది. అపార్ట్‌మెంట్‌లో ఆమె గదిని శుభ్రం చేయడానికి వెళ్లిన సిబ్బందికి అక్కడ టవల్‌పై రక్తపు మరకలు కనిపించాయి. అంతేకాకుండా అపార్ట్‌మెంట్ నుంచి వెళ్లిపోయినప్పుడు ఆమె వెంట కొడుకు లేడని గుర్తించారు. అనుమానంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రంగంలోకి దిగి, సుచనా సేథ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆ రక్తపు మరకలు తన పీరియడ్స్‌కు సంబంధించినవని, తన బిడ్డ ఉత్తర గోవాలోని మార్‌గావ్‌లో తన స్నేహితురాలి వద్ద ఉన్నాడని బదులిచ్చింది. అంతేకాకుండా సదరు మిత్రురాలి చిరునామా కూడా చెప్పింది. పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి విచారించగా, అది నకిలీ చిరునామా అని తేలింది. దాంతో ట్యాక్సీ డ్రైవర్‌ను ఫోన్‌లో సంప్రదించారు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఉన్నట్లు అతడు చెప్పగా, స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు సుచనా సేథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్దనున్న బ్యాగ్‌ను తెరిచి చూడగా బాలుడి మృతదేహం కనిపించింది. గోవా పోలీసులు చిత్రదుర్గ చేరుకొని, నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. గోవాకు తరలించి, ఐపీసీ సెక్షన్ 302(హత్య), సెక్షన్ 201(సాక్ష్యాధారాలను ధ్వంసం చేయడం)తోపాటు గోవా చిల్డ్రన్స్ చట్టం కింద ఆమెపై కేసులు నమోదు చేశారు. భర్త నుంచి విడిపోయానని, విడాకుల కోసం ప్రయత్నిస్తున్నానని నిందితురాలు పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుచనా సేథ్ 2010లో కేరళకు చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుంది. తొమ్మిదేళ్ల తర్వాత కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. 2020లో దంపతులిద్దరు కోర్టు నుంచి అనుమతి తీసుకొని దూరంగా ఉంటున్నారు. ప్రతి ఆదివారం కుమారునితో కాసేపు తండ్రి గడిపేవాడు. ఇది ఏమాత్రం ఇష్టంలేని కసాయి తల్లి.. కొడుకును చంపేయాలని, తద్వారా భర్తపై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆమె భర్త ప్రస్తుతం ఇండోనేషియాలో ఉన్నాడు. భార్య చేతిలో కుమారుడి మరణం గురించి అతడికి పోలీసులు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చిత్రదుర్గ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక కోసం పోలీసులు ఎదురు చూస్తున్నారు.

819కి జేఎన్.1 వేరియంట్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్–19 సబ్ వేరియంట్ జేఎన్.1 కేసుల్లో పెరుగుదల నమోదవుతోంది. మొత్తం 12 రాష్ట్రాల్లో కలిపి 819 జేఎన్.1 వేరియంట్ కేసులు నమోదైనట్లు మంగళవారం కేంద్రం తెలిపింది. ఇందులో అత్యధికంగా మహారాష్ట్రలో 250 కేసులు, ఆ తర్వాత కర్ణాటకలో 199, కేరళలో 148 కేసులు వెలుగులోకి వచ్చినట్లు వివరించింది. అదే సమయంలో కొత్తగా 475 కోవిడ్ కేసులు నమోదైనట్లు పేర్కొంది. యాక్టివ్ కేసుల సంఖ్య 3,919కి చేరాయని తెలిపింది. 24 గంటల వ్యవధిలో కర్ణాటకలో ముగ్గురు, ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు, అస్సాంలో ఒక కోవిడ్ బాధితుడు చనిపోయినట్లు పేర్కొంది.

కర్ణాటక గవర్నర్‌కు కరోనా

బొమ్మనహళ్లి: కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణయింది. ఆయన కోలుకునే వరకు అన్ని కార్యక్రమాలను రద్దు చేసినట్లు రాజ్‌భవన్ మంగళవారం తెలిపింది. ఆయన రాజ్‌భవన్‌లోనే క్వారంటైన్‌లో ఉన్నారని, చికిత్స అవసరం లేదని వైద్యులు సూచించినట్లు తెలిపారు.

అయోధ్య ఉత్సవాలు గిమ్మిక్కు: మమత

జోయ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల వేళ అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం పేరుతో బీజేపీ గిమ్మిక్కులకు పాల్పడుతోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. అన్ని వర్గాలను కలుపుకుని పోకుండా చేపట్టే ఈ ఉత్సవాలను తాను సమర్థించడం లేదన్నారు. దక్షిణ 24 పరగణాల జిల్లా జోయ్‌నగర్‌లో మంగళవారం జరిగిన బహిరంగ సభలో మమత మాట్లాడారు. మత ప్రాతిపదికన సామాన్యులను విడదీయడం తనకు ఇష్టం ఉందని చెప్పారు. ఉత్సవాలంటే అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ ఐక్యతను ప్రతిబింబించేవిగా ఉండాలన్నారు. మతం వ్యక్తిగతం కానీ, పండుగలు అందరూ జరుపుకోవాల్సినవి అని సీఎం మమత చెప్పారు. మతాల మధ్య విభేదాలకు తాను వ్యతిరేకమని, బెంగాల్ శాంతికాముక ప్రదేశమని అన్నారు.

'ఐన్‌స్టీన్ ప్రోబ్'ను ప్రయోగించిన చైనా

బీజింగ్: అంతరిక్షంలో తరచుగా సంభవించే పేలుళ్ల వంటి సంఘటనల వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించడానికి చైనా అంతరిక్ష పరిశోధన సంస్థ ఐన్‌స్టీన్ ప్రోబ్(ఈపీ) అనే ఖగోళ ఉపగ్రహాన్ని ప్రయోగించింది. ఇది కమలం పువ్వు ఆకారంలో ఉండడం విశేషం. సిచువాన్ ప్రావిన్స్‌లోని షిచాంగ్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి ఐన్‌స్టీన్ ప్రోబ్‌తో కూడిన లాంగ్‌మార్చ్–2సీ రాకెట్ మంగళవారం మధ్యాహ్నం 3.03 గంటలకు విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. లాబ్‌స్టర్ అనే సముద్రపు జీవి కంటి నిర్మాణాన్ని స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి చేసిన ఎక్స్–రే డిటెక్షన్ టెక్నాలజీతో ఈ ఉపగ్రహం పనిచేస్తుంది. ఇది పూర్తిగా విచ్చుకున్న కమలం ఆకృతిలో ఉంది. చైనా ఉపగ్రహ ప్రయోగంపై తప్పుడు అనువాదం తైవాన్‌లో తీవ్ర భయాందోళనకు దారితీసింది. చైనా భారీ క్షిపణిని ప్రయోగించిందంటూ రక్షణ శాఖ మెసేజీలు పంపడంతో జనం బెంబేలెత్తిపోయారు. తర్వాత అలాంటిదేమీ లేదంటూ స్పష్టత ఇవ్వడంతో అంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

డీఆర్‌డీవో తయారీ అస్సాల్ట్ రైఫిల్ 'ఉగ్రమ్'



పుణే: కేంద్ర ప్రభుత్వ రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) సొంతంగా అభివృద్ధి చేసిన అస్సాల్ట్ రైఫిల్ ఉగ్రమ్‌ను సోమవారం పరీక్షించింది. డీఆర్‌డీవోకు చెందిన పుణేలోని ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్స్(ఏఆర్‌డీఈ)విభాగం భారత సైన్యం అవసరాలకు అనుగుణంగా దీనిని రూపొందించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో 4 కిలోల కంటే తక్కువ బరువుండే ప్రొటోటైప్ అస్సాల్ట్ రైఫిల్‌ను సోమవారం పరీక్షించారు. ద్వీప ఆర్మర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో కలిసి గత మూడేళ్లుగా అస్సాల్ట్ రైఫిల్‌ను డిజైన్ చేసినట్లు ఏఆర్‌డీఈ డైరెక్టర్ ఎ.రాజు చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రయోగాలు జరిపేందుకు ముందుగా స్వతంత్ర నిపుణుల కమిటీ పర్యవేక్షణలో ట్రయల్స్ ఉంటాయని చెప్పారు.

నేటి నుంచి 'వైబ్రంట్ గుజరాత్'

సదస్సును ప్రారంభించనున్న మోదీ

గాంధీనగర్/అహ్మదాబాద్: 10వ 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమ్మిట్'కు సర్వం సిద్ధమైంది. 133 దేశాల మంత్రులు, దౌత్యవేత్తలు, ప్రతినిధులు, ప్రముఖ కంపెనీల సీఈఓలు పాల్గొనే ఈ మూడు రోజుల సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభిస్తారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్–నహ్యాన్, తూర్పు తిమోర్ అధ్యక్షుడు జోస్ రమోస్–హోర్టా, మొజాంబిక్ అధ్యక్షుడు ఫిలిప్ నుయిసీలతో ఆయన మంగళవారం వేర్వేరుగా సమావేశమయ్యారు. ఆయా దేశాలతో సంబంధాలపై చర్చించారు. అంతకుముందు యూఏఈ అధ్యక్షునికి విమానాశ్రయంలో మోదీ స్వయంగా స్వాగతం పలికారు. ఆయనతో కలిసి సదస్సు ప్రాంగణం దాకా మోదీ రోడ్ షో జరిపారు. ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల సీఈఓలు, పరిశ్రమ వర్గాల ప్రతినిధులతోనూ మోదీ భేటీ అయ్యారు. భారతదేశంలో పెట్టుబడులకు అవకాశాలు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల గురించి వివరించారు. డీపీ వరల్డ్ గ్రూప్ చైర్మన్, సీఈఓ సుల్తాన్ అహ్మద్ బిన్ సులేయమ్, మైక్రాన్ టెక్నాలజీ అధ్యక్షుడు, సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, డియాకిన్ యూనివర్సిటీ వీసీ ఇయాన్ మార్టిన్, సుజుకీ మోటార్ కార్పొరేషన్ అధ్యక్షుడు తోషిహిరో సుజుకీ తదితరులు వీరిలో ఉన్నారు. గాంధీనగర్‌లో 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ ట్రేడ్ షో–2024'ను మోదీ ప్రారంభించారు. వైబ్రంట్ గుజరాత్ సదస్సు నేపథ్యంలో 2 లక్షల చదరపు మీటర్లలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు.




యూఏఈ అధ్యక్షుడు నహ్యాన్‌ను స్వాగతిస్తున్న మోదీ

మహారాష్ట్ర, యూపీల్లో సీట్ల పంపకంపై 'ఇండియా' పార్టీలతో కాంగ్రెస్ చర్చలు


న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపకంపై కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి పార్టీలతో చర్చలు ప్రారంభించింది. మహారాష్ట్రలో సీట్ల పంపిణీకి సంబంధించి శివసేన(యూబీటీ), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలతోనూ, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీలతోనూ సంప్రదింపులు సాగుతున్నాయి. ఢిల్లీలో కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ నివాసంలో జరుగుతున్న చర్చల్లో సల్మాన్ ఖుర్షీద్, అశోక్ గహ్లోత్ పాల్గొంటున్నారు. శివసేన (యూబీటీ) నుంచి సంజయ్ రౌత్, వినాయక్ రౌత్, ఎన్సీపీ నుంచి జితేంద్ర అవ్హాద్ తదితరులు వీరిలో ఉన్నారు. చర్చలు నిర్మాణాత్మకంగా, ఊహించిన దానికంటే విజయవంతంగా సాగాయని అవ్హాద్ చెప్పారు. మహారాష్ట్రలోని 48 లోక్‌స్థానాకు గాను కాంగ్రెస్ 26, శివసేన 23 సీట్లు కోరుతున్నాయి. ఈ నెల 14, 15వ తేదీల్లో మూడు పార్టీల నేతలు సోనియా గాంధీతో భేటీ కానున్నట్లు సమాచారం. యూపీకి సంబంధించి ఎస్పీ నేతలు రామ్‌గోపాల్ యాదవ్, జావేద్ అలీ పాల్గొన్నారు. ఈ నెల 12న మరోసారి భేటీ అయి సీట్ల పంపిణీపై తుది నిర్ణయం తీసుకుంటామని యాదవ్ చెప్పారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం, 10, జనవరి, 2024



'గుంటూరు కారం' బృందం సందడి

గన్నవరం: విమానాశ్రయంలో మంగళవారం సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో పాటు గుంటూరు కారం చిత్ర బృందం సందడి చేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 828.70 అడుగుల వద్ద ఉంది.

అభయాంజనేయుడి సేవలో..



హనుమాన్ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామిని కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ మంగళవారం దర్శించుకున్నారు. ▶ 8లో

న్యూస్‌రీల్

14 నుంచి ఇంద్రకీలాద్రిపై సంక్రాంతి సంబరాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 14వ తేదీ ఆదివారం నుంచి సంక్రాంతి సంబరాలను నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. మూడు రోజుల పాటు నిర్వహించే సంక్రాంతి సంబరాలలో తొలి రోజైన ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు చిన్న రాజగోపురం వద్ద భోగిమంటలు వేయనున్నారు. అనంతరం హరిదాసుల సంకీర్తనలు, బసవన్నల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. మల్లికార్జున మహామండపం 7వ అంతస్తు వద్ద బొమ్మల కొలువు ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. సాయంత్రం రాజగోపురం ఎదుట కళావేదికపై గొబ్బెమ్మల ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులకు భోగిపండ్లు పోసే కార్యక్రమాన్ని దేవస్థానం నిర్వహిస్తోంది. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, రాజగోపురం, ఇతర దేవాలయాలకు ప్రత్యేక పూల అలంకరణ చేయనున్నారు. ఆలయ ప్రాంగణంలో రంగవల్లులను తీర్చిదిద్ది, తెలుగుదనం ఉట్టి పడేలా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

'డెమో సెక్షన్' క్యాలెండర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రచార మాధ్యమ అధికారుల సంఘం (డెమో సెక్షన్) 2024 క్యాలెండర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని మంగళవారం ఆవిష్కరించారు. డెప్యూటీ డెమో ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో డెమో అధికారులు సేవలు చాలా కీలకమైనవని, ఆరోగ్య కార్యక్రమాలు విజయవంతంగా అమలు జరపడానికి డెమోల సేవలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, జాతీయ ఆరోగ్య మిషన్ డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ సమీర, డీఈఓ వాసు, ఎంపీహెచ్ఈఓ రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతీ యువకులకు ఎలక్ట్రీషియన్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్ ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారికి అరవై రోజుల పాటు ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. నూతన టెక్నాలజీతో హౌస్ వైరింగ్, గోడౌన్ వైరింగ్‌పై శిక్షణ, పరిశ్రమల్లో కేబుల్ జాయింట్స్‌పై అవగాహన కల్పిస్తామని వివరించారు. ఐదో తరగతి విద్యార్హత కలిగిన మహిళలకు టైలరింగ్‌లో అరవై రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17వ తేదీలోగా విద్యాధరపురం కబేళా సెంటర్ సమీపంలోని బీసీ సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ ఆవరణలో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ ఆఫీస్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 96667 71746, 97000 25833లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

నెమలి దేవస్థానం ఆదాయం రూ. 18.29లక్షలు



నెమలి(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో గడచిన మూడు నెలల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. గన్నవరం ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో లెక్కింపు కొనసాగింది. గత ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నుంచి ఈ సంవత్సరం జనవరి 9వ తేదీ వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించగా రూ. 18,29,675 నగదు, 8 గ్రాముల బంగారం, 810 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు, స్థానిక స్టేట్ బ్యాంక్ శాఖ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

నాణ్యతకు నజరానా

- అత్యుత్తమ వైద్య సేవలకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్
- ఎన్టీఆర్ జిల్లాలో రెండు యూపీహెచ్‌సీలు, ఒక హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌కు కితాబు
- కృష్ణాజిల్లాలో నాలుగు హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాలకూ గుర్తింపు
- 'నాడు–నేడు'తో రూపురేఖలు మారడంతోనే ఘనత

ఉమ్మడి జిల్లాలో ఏడు ఆరోగ్య కేంద్రాలకు జాతీయ గుర్తింపు



క్వాలిటీ అస్యూరెన్స్ సర్టిఫికెట్ పొందిన అజిత్‌సింగ్‌నగర్ యూపీహెచ్‌సీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి కృష్ణా జిల్లాలో అందుతున్న అత్యుత్తమ వైద్య సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ, ఆస్పత్రులను అభివృద్ధి చేసింది. దీంతో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లలో అత్యాధునిక వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలకు జాతీయ గుర్తింపు లభించింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని ఏడు కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్ట్ సర్టిఫికేషన్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాల అధికారులు ఆయా కేంద్రాలను సందర్శించి యూపీహెచ్‌సీల్లో 12 అంశాలను, వెల్నెస్ కేంద్రాల్లో 7 అంశాలను పరిగణనలోకి తీసుకొని గుర్తింపునిస్తూ సర్టిఫికేషన్ జారీ చేశారు.

ఈ అంశాల ప్రాతిపదికన..

యూపీహెచ్‌సీలకు సంబంధించి జనరల్ ఓపీ, మెటర్నిటీ సేవలు, న్యూబోర్న్ అండ్ చైల్డ్ హెల్త్, ఫ్యామిలీ ప్లానింగ్, నాన్ కమ్యునికబుల్ వ్యాధులు, జనరల్ అడ్మినిస్ట్రేషన్, లేబొరేటరీ, ఫార్మసీ, డ్రెస్సింగ్‌రూమ్ అండ్ ఎమర్జెన్సీ, ఇమ్యూనైజేషన్, కమ్యునికేబుల్ వ్యాధులు, బిల్డింగ్–సౌకర్యాలు(అవుట్ రీచ్) వంటి 12 అంశాలను పరిశీలించారు.

- హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాలకు సంబంధించి ఏడు అంశాలు గర్భిణులు, పిల్లలు, నవజాత శిశువులు, ఐదేళ్లలోపు పిల్లలు, కుటుంబ నియంత్రణ, సాంక్రమిక వ్యాధులు, చిన్నగాయాలకు చికిత్స వంటి అంశాలపై తనిఖీలు చేసి, సంతృప్తి వ్యక్తం చేసి గుర్తింపు ఇచ్చారు.



చిన్నారికి మందులు ఇస్తున్న వైద్యుడు

ప్రభుత్వ చర్యలతో సత్ఫలితాలు..

గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నేడు ఆధునిక హంగులు సమకూర్చుకున్నాయి. నాడు–నేడు పథకం ద్వారా భవనాలకు మరమ్మతులు చేయడంతో పాటు, అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. లేబర్ రూమ్‌లు ఏర్పాటు, వ్యాధి నిర్ధారణ పరికరాలు, వార్డులు, ఫార్మసీ వంటివి ఏర్పాటు చేశారు. మందుల కొరత లేకుండా చూస్తున్నారు.

ఆ కేంద్రాలు ఇవే..

- ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్ యూపీహెచ్‌సీ, ప్రకాష్‌నగర్ యూపీహెచ్‌సీ, గొల్లపూడి–1 హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌కు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ సాధించాయి.
- కృష్ణాజిల్లాలోని చోడవరం, గోసాల–2, గంగూరు, కానూరు 5 హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాలకు సర్టిఫికేషన్ లభించింది.

ఇప్పటి వరకూ ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ సాధించిన ఆరోగ్య కేంద్రాలు..

ఎన్టీఆర్ జిల్లాలో..	
పీహెచ్‌సీలు	10
యూపీహెచ్‌సీలు	4
హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాలు	4
సీహెచ్‌సీలు	1
విజయవాడ జీజీహెచ్ ప్రసూతి విభాగం	1
కృష్ణాజిల్లాలో..	
పీహెచ్‌సీలు	19
హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాలు	5
సీహెచ్‌సీ	1
బందరు జీజీహెచ్ ప్రసూతి విభాగం	1

సిబ్బంది కొరత లేకుండా..

ఒకప్పుడు ఏదైనా పోస్టు ఖాళీ అయితే దానిని భర్తీ చేసేందుకు ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎప్పుడు ఖాళీ అయిన పోస్టు అప్పుడే భర్తీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఖాళీలను ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తున్నారు. దీంతో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, వెల్నెస్ కేంద్రాల్లో సిబ్బంది కొరత అనే ప్రస్తావనే లేకుండా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటున్నారు.

నాణ్యమైన సేవలకు గుర్తింపు..



జిల్లాలోని యూపీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలకు గుర్తింపుగా జాతీయ నాణ్యతా ప్రమాణాల సర్టిఫికేషన్ లభించింది. గ్రామీణ ప్రజలతో పాటు, పట్టణ ప్రజలకు అధునాతన వైద్య సేవలు చెంతనే అందించాలనే ఉద్దేశంతో యూపీహెచ్‌సీల్లో అధునాతన పరికరాలను అందించడంతో పాటు, పూర్తిస్థాయి సిబ్బందిని నియమించారు. దీంతో నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందించగలుగుతున్నాం.

– ఎస్. ఢిల్లీరావు, కలెక్టర్ ఎన్టీఆర్ జిల్లా

ప్రతి రోగికీ మెరుగైన వైద్యం..



ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నారు. నాడు–నేడు పథకంలో అధునాతన భవనాలు, సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. పరికరాలు, సిబ్బంది, వైద్యుల నియామకాలు చేపట్టడంతో మెరుగైన సేవలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ గుర్తింపు లభించింది.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్‌జిల్లా

స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో పెరికె వరప్రసాద్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి లక్షలాదిగా తరలి రావాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు బోదాల శ్రీనివాసరావు, నలకుర్తి రమేష్, మాల మహానాడు అధ్యక్షుడు నత్తాయానారాజు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 4న సామాజిక వైద్యుల మహాసభ

మధురానగర్(విజయవాడసెంట్రల్): తాడిగడపలోని విజయవాడ అనుమోలు గార్డెన్స్‌లో వచ్చేనెల 4వ తేదీన గ్రామీణ వైద్యుల మహాసభ జరగనుంది. ఈ సభకు వైద్యులు వేలాదిగా తరలి రావాలని గ్రామీణ వైద్యుల పోరాట సభ గౌరవాధ్యక్షుడు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ కేజీ గోవింద రెడ్డి గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎన్ రాజు పిలుపునిచ్చారు. స్థానిక రామకృష్ణాపురంలోని గ్రామీణవైద్యుల సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం గ్రామీణ వైద్యుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామీణ వైద్యుల అన్ని సంఘాల మహాసభను క్యాన్సర్‌పై పోరాట సభగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కోశాధికారి డాక్టర్ కె. కృష్ణమూర్తి, సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి దస్తగిరి పర్ల పాల్గొన్నారు.

సత్తా చాటే సమయం

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 53 మండలాల్లో పోటీలు
- 1,113 గ్రామ/వార్డు సచివాలయాల జట్లు పోటీలకు సిద్ధం
- మండలానికి నాలుగు మైదానాల్లో ఏర్పాట్లు
- పూర్తయిన కిట్లు, జెర్సీల పంపిణీ



పెనుగంచిప్రోలు మండలం కొణకంచి సచివాలయం జట్టుకు కిట్, జెర్సీలు అందజేస్తున్న నాయకులు

విజయవాడ స్పోర్ట్స్: ఆడుదాం.. ఆంధ్రా తొలి విడత(గ్రామ/వార్డు సచివాలయాల స్థాయి) పోటీలను విజయవంతంగా పూర్తిచేసిన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార యంత్రాంగం రెండో విడత పోటీలకు సన్నద్ధమైంది. నేటి నుంచి ప్రారంభమయ్యే మండల స్థాయి పోటీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి నట్లు ప్రకటించింది. ఇరు జిల్లాల్లోని ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, మండల వైద్యాధికారులు, ఎస్ఐలు, పలు ఇంజినీరింగ్ విభాగాల ఏఈలు, జేఈలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల కోచ్‌లు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల పీఈటీలు, పీడీలు, స్పోర్ట్స్ వలంటీర్ల పర్యవేక్షణలో ఈ పోటీలు జరగనున్నాయి.

జట్ల ఎంపిక ఇలా..

గత నెల 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలి విడతగా గ్రామ/వార్డు సచివాలయాల స్థాయిలో బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో స్త్రీ, పురుషుల విభాగాల్లో ఈ పోటీలను అధికారులు పూర్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 605 సచివాలయాల నుంచి తొలి విడత పోటీలకు 1.16 లక్షల మంది, కృష్ణాజిల్లాలోని 508 సచివాలయాల నుంచి 1.12 లక్షల మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. పోటీల్లో క్రీడాకారులు అత్యధికంగా పాల్గొన్న నేపథ్యంలో రెండు రోజుల క్రితమే తొలి విడత పోటీలు ముగిశాయి. పోటీ అనంతరం ఆయా క్రీడాశాంల్లో స్త్రీ, పురుషుల విభాగాల్లో జట్లను గ్రామ/వార్డు సచివాలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయం నుంచి ఐదు క్రీడాంశాల్లో 114 మంది క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. నాక్ అవుట్ పద్ధతిలో ఈ పోటీలు జరగనున్నాయి.

మైదానాల్లో ఏర్పాట్లు..

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలానికి నాలుగు చొప్పున మైదానాలను సిద్ధం చేసినట్లు క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు చెబుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఈ పోటీల్లో 6,970 మంది క్రీడాకారులు, కృష్ణా జిల్లా నుంచి 57,912 మంది క్రీడాకారులు పాల్గొనున్నారు. ఈ పోటీలకు రిఫరీలుగా ఎన్టీఆర్ జిల్లాలో 1,250, కృష్ణాజిల్లాలో 2,800 మంది పీఈటీలు, పీడీలు, స్పోర్ట్స్ వలంటీర్లు వ్యవహరించనున్నారు. విజయవాడ అర్బన్‌లోని యూనిట్లలో అత్యధికంగా క్రీడాకారులు ఉన్న నేపథ్యంలో రిఫరీలను అత్యధికంగానే నియమించారు. పోటీల ప్రాథమిక పర్యవేక్షకులుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్‌లు వ్యవహరించనున్నారు.

కిట్లు, జెర్సీల పంపిణీ పూర్తి..

గ్రామ/వార్డు సచివాలయాల స్థాయి పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను ఆయా సచివాలయాల జట్లకు ఎంపిక చేశారు. ఆ క్రీడాకారులకు ప్రభుత్వం సమకూర్చిన జెర్సీ(టీ-షర్ట్, క్యాప్)లు, ఆయా క్రీడాంశాలకు సంబంధించిన బేసిక్ స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఇదే కిట్లు, జెర్సీలతో మండల స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొననున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని 68,970 స్త్రీ, పురుష క్రీడాకారులకు, కృష్ణాజిల్లాలోని 57,912 మంది క్రీడాకారులకు జెర్సీలు అందజేశారు. అదేవిధంగా ఎన్టీఆర్ జిల్లాలో 1,815 బేసిక్ క్రికెట్ కిట్లు, 3,630 బ్యాడ్మింటన్ రాకెట్లు, బ్యారెల్స్, 1,815 వాలీబాల్స్, నెట్స్ కృష్ణాజిల్లాలో 1,527 క్రికెట్ కిట్లు, 2,540 బ్యాడ్మింటన్ రాకెట్లు, బ్యారెల్స్, 1,527 వాలీబాల్స్, నెట్స్ అందజేశారు. రెండు జిల్లాల్లోనూ కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొనే క్రీడాకారులందరికీ నీ కాప్స్ సరఫరా చేశారు.

విజేత జట్లే నియోజకవర్గ స్థాయి పోటీలకు..

తొలి విడత సచివాలయాల స్థాయి పోటీలు ముగిసిన అనంతరం ఆయా పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించి జట్లను ఎంపిక చేశారు. అయితే మండల స్థాయి పోటీల అనంతరం సెలక్షన్ ట్రయల్స్ ఏమీ ఉండవని ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఏ.అజీజ్, కృష్ణాజిల్లా డీఎస్‌డీవో కె. ఝాన్సీలక్ష్మి వెల్లడించారు. మండల స్థాయి పోటీల్లో ఆయా క్రీడాంశాల్లో మొదటి స్థానం సాధించిన జట్లే నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తాయని స్పష్టం చేశారు. పోటీలు ఈ నెల 20 వరకూ జరుగుతాయి.

ఆహార భద్రతలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంత తదితరులు

జి.కొండూరు(మైలవరం): ఆహార భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధి వెలగలేరు మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ.10.91కోట్లతో 10వేల టన్నుల సామర్థ్యంతో నూతనంగా నిర్మించిన రెండు గోడౌన్‌లను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో కలిసి మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1958లో ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఇప్పటి వరకు 8 లక్షల 48వేల టన్నుల సామర్థ్యం గల గోడౌన్‌లను నిర్మించిందన్నారు. గత 60ఏళ్లలో 6లక్షల, 34వేల టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోడౌన్‌ల నిర్మాణం జరిగితే.. 2019 నుంచి ఈ ప్రభుత్వ హయాంలో 2లక్షల, 14వేల టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోడౌన్‌లను నిర్మించిందన్నారు. ఇదే కాకుండా రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వ గోడౌన్‌లు అందుబాటులో లేని ప్రదేశాలలో రాష్ట్ర వ్యాప్తంగా 8లక్షల టన్నుల సామర్థ్యం గల ప్రయివేటు గోడౌన్లను కూడా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. అంతే కాకుండా గ్రామస్థాయిలో రైతులకు ధాన్యం నిల్వ కోసం రూ.45లక్షలతో 500టన్నుల సామర్థ్యం, రూ. 78లక్షలతో 1000 టన్నుల సామర్థ్యంతో గోడౌన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రైతులు తమకు గిట్టుబాటు ధర వచ్చే వరకు తమ ధాన్యాన్ని ఈ గోడౌన్‌లలో నిల్వ చేసుకోవచ్చన్నారు. ఇలా నిల్వ చేసుకున్న ధాన్యంపై రుణాలను కూడా పొందవచ్చని సూచించారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు గ్రామస్థాయిలో అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో రైతు వ్యతిరేక విధానాలు అమలు చేసిన చంద్రబాబు, ఎన్నికలు సమీపిస్తున్న వేళ రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు.

రైతులకు అండగా ప్రభుత్వం..

ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, ధరలలో వ్యత్యాసం వచ్చినప్పుడు రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో కూడా గోడౌన్లను నిర్మించడం హర్షణీయమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ జనాబ్ కరీముల్లా షేక్ అమీన్, వైస్ చైర్మన్ ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ఏఐ' కోర్సులు



మాట్లాడుతున్న పోలా భాస్కర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) కోర్సులు ప్రారంభించనున్నట్లు ఉన్నత విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ తెలిపారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్రంలోని 54 ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్స్, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సమన్వయకర్తల శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి కళాశాల ప్రిన్సిపాల్ స్థానికంగా ఉన్న పరిశ్రమలతో ఒప్పందం చేసుకుని విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేయించాలని సూచించారు. అలాగే డిగ్రీ పూర్తయ్యేలోపు ప్రతి ఒక్కరికీ ఉపాధి లభించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆగ్యుమెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీని ఉపయోగించుకుని విద్యాబోధన మరింత సరళతరం చేయాలన్నారు. అనంతరం అమెరికాకు చెందిన జెడ్ స్పేస్ టెక్నాలజీ వారు రూపొందించిన 3డీ వీడియోలను ప్రదర్శించారు. జంతు, వృక్ష, రసాయన, భౌతిక శాస్త్రాలకు సంబంధించిన వివిధ 3డీ వీడియోలను ఆగ్యుమెంటెడ్ రియాలిటీ ప్రజెంటేషన్‌ను ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ గౌతం మేండు అందించారు.



సొంతూళ్లకు పయనం

తెలుగింట పెద్ద పండుగ సంక్రాంతి సమీపించింది. అంతా సొంతూళ్లకు ఎప్పుడు బయలుదేరుదామా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. మంగళవారం నుంచి స్కూళ్లకు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు తమ ఊళ్లకు పయనమయ్యారు. దీంతో విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ కిక్కిరిసింది. బస్టాండ్లో రద్దీని చిత్రాల్లో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



క్లుప్తంగా

టిప్పరు లారీ ఢీకొని కిరాణా వ్యాపారి మృతి



గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద టిప్పరు లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం...మండలంలోని కేసరపల్లి శివారు వీఎస్ పురం కాలనీకి చెందిన తిరువీధుల శ్రీనివాసులు(50) కిరాణా షాపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో వ్యక్తిగత పనుల నిమిత్తం గన్నవరం వెళ్లి మోపెడ్‌పై తిరిగి వస్తుండగా కోనాయ చెరువు వద్ద ఎదురుగా దూసుకువచ్చిన టిప్పరు లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలై శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య, ఇరువురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

పాయకాపురం(విజయవాడరూరల్): అప్పుల బాధతో దంపతులు ఆత్మహత్యాయత్నం చేయగా భార్య మృతి చెందింది. భర్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మంగళవారం నున్న పోలీసు స్టేషన్ పరిధి శాంతినగర్లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పాయకాపురం శాంతినగర్‌కు చెందిన అంబటి ప్రతాప్‌కుమార్ ఫ్లవర్ డెకరేషన్ వ్యాపారం చేస్తుంటాడు. అతని భార్య అంబటి సాయికన్య(32) చీటీల వ్యాపారం చేస్తుంటుంది. వీరికి ఇద్దరు సంతానం. వ్యాపారంలో నష్టం వచ్చి అప్పులు పెరిగిపోవడంతో, అవి తీర్చే మార్గం లేక మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి బెడ్‌రూమ్‌లో పడిపోయారు. వారి పిల్లలు చూసి పక్కింటి వారికి చెప్పగా వారు వచ్చి దంపతులిద్దరినీ చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు వారిని పరిశీలించి సాయికన్య చనిపోయిందని నిర్ధారించారు. మృత్యువుతో పోరాడుతున్న ప్రతాప్‌కుమార్‌కు చికిత్స అందిస్తున్నారు. ప్రతాప్‌కుమార్ అన్న ప్రదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవిందా...హరి గోవిందా..భజగోవిందా!

- శ్రీమహావిష్ణువు సేవలో తరిస్తున్న దంపతులు
- 20 అడుగుల తులసి గజమాలలు తయారీ
- శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం సేవలు
- ఆధ్యాత్మిక మార్గం వైపు యువతను మళ్లింపు



ద్వారకా తిరుమలలో తులసి మాలికలతో సునీత-మదుసూధన్ దంపతులు



తులసి గజమాలలను కడుతున్న గోవిందనామ ప్రచార సేవా సంఘం సభ్యులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): తులసి మాలికా కైంకర్యం 'గోవింద' దాసుల కర్తవ్యం అంటారు భవానీపురానికి చెందిన శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకులు సునీతా-మధుసూదన్‌లు. చాత్తాద శ్రీవైష్ణవ సంప్రదాయంలో భాగంగా శ్రీమహావిష్ణువుకు సేవ చేసే మార్గాన్ని ఎన్నుకున్నారు ఆ దంపతులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కు చెందిన స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (సీత) పూర్వ డైరెక్టర్ డాక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు మార్గదర్శకత్వంలో 2008లో శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘాన్ని స్థాపించిన ఆ దంపతులు భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని తమ నివాసంలో చిన్న పిల్లలను, యువతను చేరదీసి భగవద్గీత, శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రం వంటి స్తోత్ర పాఠాలను నేర్పిస్తూ వారిని ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్లిస్తున్నారు. వారికి భగవద్గీత శ్లోకాల పఠనంలో పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు.

'శ్రీహరిప్రియ'వనంలో తులసి మొక్కల పెంపకం

ఎన్టీఆర్ జిల్లా వెలగలేరు గ్రామంలో భూములను లీజుకు తీసుకుని 'శ్రీహరిప్రియ వనం' పేరుతో తులసి మొక్కలను పెంచుతున్నారు. కొంత భాగం ఆ వనంలో నుంచి మరికొంత భాగం చెన్నై నుంచి తెప్పించి వాటన్నింటితో తమ నివాసంలో తులసి గజమాలలు కట్టిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక నిపుణులను నియమించుకున్నారు. షేక్ అహ్మద్, చిరంజీవి, శాయి శివకుమార్ నేతృత్వంలో గోవిందదాసులు మాలికలను కడుతున్నారు. ధనుర్మాసంలో ప్రస్తుతం నాలుగు ప్రముఖ వైష్ణవ దేవాలయాలకు తులసి దళాల గజమాలలను అందజేస్తున్నారు. ఒక్కొక్క గజమాల 20 అడుగులతో 15 నుంచి 20 కిలోల బరువు ఉంటుంది. లోక కల్యాణం కోసమే ఈ సేవ చేస్తున్నామని సునీత - మధుసూధన్ దంపతులు చెబుతున్నారు. నిరంతరం గోవిందనామ స్మరణ ప్రచారం, శ్రీరామపట్టాభిషేకం నిర్వహణ వారి ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం.

గోవింద సేవా బృందాల సేవలు

శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకులు సునీత - మధుసూదన్, గోవింద సేవా బృంద సభ్యులు మోహన్, రమేష్, జగన్నాధం, లక్ష్మి, ఫణిబాబు, సుజాత, కొండమ్మ, శ్రీలక్ష్మి ముందు రోజు అర్ధరాత్రికే ఆయా దేవాలయాల సన్నిధులకు చేరుకుని తులసి గజమాలలను అందజేస్తారు. ఈ ధనుర్మాసం నెల పొడవునా ద్వారకా తిరుమలతో పాటు మంగళగిరి పానకాల స్వామి, తిరుపతి గోవిందరాజస్వామి, అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలకు తులసి గజమాలలను అందజేస్తున్నారు.

గోవిందనామ స్మరణం సర్వపాప హరణం



హిందూ ధర్మంలో తులసికి మించిన మంగళ మాలిక మరొకటి లేదు. 'గోవిందనామ స్మరణం సర్వపాప హరణం' అని విశ్వసించి 'గోవింద'నామ ప్రచారమే తమ జీవిత ధ్యేయంగా శ్రీమహావిష్ణువుకు సేవ చేస్తున్న సునీత-మధుసూదన్ దంపతులు ధన్యులు. తులసి మొక్కలను ఉచితంగా అందజేస్తున్న వీరు అభినందనీయులు.

– డాక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, పూర్వ సంచాలకులు, ఎస్ఐటీఏ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న స్రవంతి

నున్న(విజయవాడరూరల్): విద్యార్థి దశ నుంచి పర్యావరణాన్ని పరిరక్షించడంపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్ర ప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి అన్నారు. నున్న గ్రామంలో కెన డీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తే మనం అందరం ఆరోగ్యంగా జీవిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ విద్యను అమలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని సూచించారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న విపరీతమైన మార్పుల గురించి అవగాహన కల్పించి విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేయటం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, అందులో భాగంగా తాను హైస్కూల్‌ను సందర్శించానన్నారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కోఆర్డినేటర్ షేక్ సాయిరున్నీసా బేగమ్, ప్రాజెక్ట్ అధికారి సత్యనారాయణ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలో నగదు స్వాధీనం

గూడూరు: జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు బందరు డీఎస్పీ యు.నాగరాజు పర్యవేక్షణలో గూడూరు సెంటరులో మంగళవారం పెడన సీఐ హబీబ్ బాషా, గూడూరు ఎస్ఐ శేషుకుమార్ తమ బృందంతో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భీమవరం నుంచి ఒంగోలు వెళ్తున్న నువ్వుల వ్యాపారి వద్ద రూ.7.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ హబీబ్ బాషా వెల్లడించారు. ఈ నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లుతెలిపారు. రాబోయే ఎన్నికలను పురస్కరించుకుని వాహనాల తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

అభయాంజనేయుడి సేవలో కేంద్ర సహాయ మంత్రి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని కేంద్ర షిప్పింగ్, ఓడరేవులు, జలమార్గాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ మంగళవారం సందర్శించారు. స్థానిక ప్రధాన కూడలి వద్ద బీజేపీ జిల్లా కార్యదర్శి సింగవరపు సత్యభాస్కర గణేష్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వేద మంత్రోచ్ఛరణల నడుమ కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్‌కు స్వాగతం పలికారు. ఆలయంలో అంజనీపుత్రునికి తమలపాకులతో ప్రత్యేక అర్చన నిర్వహించారు. పూజల అనంతరం స్వామి వారి శేషవస్త్రాలతో ఆలయ చైర్మన్ భూషణం సత్కరించారు. బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిరువోలు బుచ్చిరాజు, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు పాల్గొన్నారు.

కె.వి. విద్యార్థులకు కళాకార్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆసిఫ్ హుస్సేన్


మచిలీపట్నంటౌన్: నగరంలోని కేంద్రీయ వి ద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. గత ఏడాది డిసెంబరు 24వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన కూచిపూడి కళావైభవం మహానృత్య బృందంలో ఒకేసారి 7,209 మంది కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ బృంద నృత్యంలో కేంద్రీయ విద్యాలయంలో ఏడవ తరగతి చదువుతున్న పెండ్యాల రాఘవ్, యశ్విత సాయి పాల్గొన్నారు. కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో వీరికి స్థానం లభించింది. రికార్డ్స్ నిర్వాహకులు వీరికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరినీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మంగళవారం అభినందించారు.

ఆర్చరీలో రాజేశ్వరి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌పూర్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ ఆర్చరీ టోర్నమెంట్‌లో విజయవాడకు చెందిన టి.భువన రాజేశ్వరి సత్తా చాటింది. ఆ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభతో వేర్వేరు విభాగాల్లో రజత, కాంస్య పతకాలు గెలుచుకుంది. ఈ సందర్భంగా మంగళవారం ఆమె చదువుతున్న శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఇతర అధ్యాపకులు, సహచర విద్యార్థినులు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ తమ విద్యార్థిని క్రీడల్లో సత్తా చూపి, చెన్నైలో జరిగే ఖేలో ఇండియాకి ఎంపిక అవడం ఆనందంగా ఉందని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పి.లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ ఎస్.లలిత ప్రసాద్ అభినందనలు తెలిపారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత



గుడివాడ టౌన్: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన ధర్మపురి దుర్గ పేగుపూతతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీరు ఎల్.మనీషాదేవి గుంటూరు వెళ్లి ఆసుపత్రిలోని దుర్గకు పింఛన్ అందజేశారు. దీనిపై దుర్గ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారని మనీషాదేవి అన్నారు.

రాకపోకలు.. రయ్ రయ్

- మిలమిలా మెరుస్తున్న రహదారులు
- నాలుగున్నరేళ్లలో ఎన్నడూ లేని అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న తూర్పు ప్రజలు



సుందరంగా రూపుదిద్దుకున్న పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు



కామినేని నగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా రోడ్లు మిలమిల మెరుస్తున్నాయి. నాలున్నరేళ్లలో ఎన్నడూ లేనంతగా కాలనీల్లో రోడ్లు ఏర్పడ్డాయి. ఒకప్పుడు గంతలతో ఇబ్బంది పడిన స్థానికులు ఇప్పుడు కొత్త రోడ్లపై రయ్ రయ్ మంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్లు అభివృద్ధి చెందడంతో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కృషి ఎంతో ఉందని, ఆయన పర్యటనకు వచ్చినప్పుడు ఏ సమస్య చెప్పినా వెంటనే అధికారులతో సంప్రదించి పరిష్కరిస్తున్నారని తూర్పు ప్రజలు అంటున్నారు. గతంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని, ఆయనకు ఓట్లు వేసినా పని చేయలేదని పలు కాలనీలకు చెందిన ప్రజలు పేర్కొంటున్నా

రూ.200 కోట్లతో పనులు

ఒకప్పుడు కాలనీల్లో రోడ్లు గుంతల మయంగా, పార్కులు నిర్వీర్యంగా ఉండేవి. నాలుగున్నరేళ్లలో పెద్ద ఎత్తున నిధులు ప్రభుత్వం విడుదల చేయడంతో రోడ్లు మిలమిలలాడుతున్నాయి. ముఖ్యంగా ఎన్టీఆర్ కాలనీ, కరెన్సీ నగర్, కనకదుర్గ నగర్, వెటర్నరీ కాలనీ, అయ్యప్ప నగర్, రెవెన్యూ కాలనీ, శ్రీరామచంద్ర నగర్, కామినేని నగర్, గాయత్రీ నగర్, సిద్ధార్థ నగర్, లబ్బీపేట వంటి ప్రాంతాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయలు వెచ్చించారు. వాటితో పాటు, కృష్ణలంక, రాణీగారితోట, రామలింగేశ్వరనగర్‌లలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎత్తు ఎత్తున నిధులు కేటాయించారు. నియోజకవర్గంలో రోడ్లు నిర్మాణంతోపాటు, ఇతర మౌలిక సదుపాయాల కోసం దాదాపు రూ.200 కోట్లు కేటాయించారు. ఇంత పెద్ద ఎత్తున నిధులు ఎన్నడా కేటాయించలేదని ప్రజలు అంటున్నారు.

కొండ ప్రాంతాలకు పెద్దపీట

నియోజకవర్గంలో కొండప్రాంతాలు ఉన్న 2, 5, 6, 7 డివిజన్లలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. కొండ చివరిన నివశించే వారి సమస్యలు సైతం పరిష్కరించారు. అందులో భాగంగా మెట్లు మార్గాలు ఏర్పాటు చేయడం, కొండ దిగువున ఉన్న మాచవరం, క్రీస్తురాజుపురం, లూర్దునగర్, బెత్లెహేంనగర్, మొగల్రాజపురం వంటి ప్రాంతాల్లో సైతం అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టారు. రూ.5.50 కోట్లతో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఆ ప్రాంతాల్లో మంచినీటి సమస్య లేకుండా చేశారు.



బృందావన కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

ఎన్నడూ లేని అభివృద్ధి



మా ప్రాంతంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరిగింది. గతంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని సమస్యలు సైతం ఇప్పుడు పరిష్కారమయ్యాయి. ముఖ్యంగా మా డివిజన్‌లో ముస్లింలకు షాదీఖానా నిర్మిస్తున్నారు. అంతేకాకుండా మా కాలనీ నుంచి పటమటలంక వెళ్లేందుకు స్క్యూ బ్రిడ్జి కింద అండర్ పాస్ ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి పనులు ఎన్నో చేశారు. – చింతగుంట విజయ్, పకీరుగూడెం

19 రోడ్లు వేశారు



మాది 12వ డివిజన్ అయ్యప్పనగర్. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కాలనీలో 19 బీటీ, సీసీ రోడ్లు వేశారు. మా డివిజన్‌లోనే ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నివసిస్తారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే, ఎంపీ, కార్పొరేటర్, మేయర్ అందరూ వాళ్లే. అయినా ఐదేళ్లలో అభివృద్ధి చేయలేదు. కానీ ఈ నాలుగున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగింది. ఇది ప్రజల ప్రభుత్వం అనేందుకు ఇదే నిదర్శనం. – అబ్దుల్ రహీమ్, అయ్యప్పనగర్

రోడ్లు బాగుపడ్డాయి



మా ప్రాంతంలో గతంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండేవి. ఆ రోడ్లపై వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉండేది. పాలకులకు తెలిసినా పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సమస్యను చెప్పగా, వెంటనే రోడ్లు వేశారు. పటమట చినరామాలయం రోడ్డుతో పాటు. మా పక్క రోడ్డు కూడా వేశారు. రోడ్డును వెడల్పు చేసి వేయడంతో ప్రజలకు సౌకర్యంగా ఉంది. ఇది పనిచేసే ప్రభుత్వమని నిరూపించింది. – ఎ.సుబ్రహ్మణ్యం, పటమటలంక

హోటళ్లలో విజిలెన్స్ తనిఖీలు



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరీముల్లా షరీఫ్, విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి పటమట, విజయవాడ పరిసర ప్రాంతంలోని కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా హోటళ్లలో అనుసరిస్తున్న ఆహార భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. వండిన ఆహారం రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచటం, ఆహార తయారీ ప్రదేశంలో పరిశుభ్రత లేకపోవడం, పాత్రలపై మూతలు లేకపోవడం, నిబంధనలకు అనుగుణంగా లేని సలాడ్ ఆయిల్, జీరా సూప్, స్వీట్ సూప్, బోల్డ్ నూడుల్స్ వంటివి ఉపయోగించటం, ఒకసారి ఉపయోగించిన పోలార్ కాంపోనెంట్ నిర్దేశిత విలువ 25 శాతం కంటే ఎక్కువ కలిగిన వంట నూనెను తిరిగి వాడటం వంటి ఉల్లంఘనలను గుర్తించారు. నిల్వ ఉంచిన, మిస్‌బ్రాండెడ్ వస్తువుల నుంచి నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబ్కు విశ్లేషణ నిమిత్తం పంపారు. హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు జారి చేశారు. వారిపై చర్యలు తీసుకునేందుకు పరిపాలన అధికారి, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

11న వేంకటేశ్వరస్వామికి చందన అలంకరణ సేవ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈ నెల 11వ తేదీ గురువారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన వేంకటేశ్వర స్వామివారికి చందన అలంకరణ సేవ నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులుకావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు



పటమట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు వై.సిద్ధార్థ తెలిపారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా ఈ ప్రభుత్వంలో లబ్ధిదారుడికే నేరుగా పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రిదని పేర్కొన్నారు. పటమట 14వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో గడప గడపకు 'మీ అవినాష్ అన్న హామీ' కార్యక్రమం మంగళవారం జరిగింది. సిద్ధార్థ గడప గడపకూ వెళ్లి ఈ నాలుగున్నర ఏళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 'ప్రజా సంకల్ప యాత్ర' ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి నాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. 14వ డివిజన్ కార్పొరేటర్ చింతల సాంబశివరావు, డివిజన్ ప్రెసిడెంట్ శెటికం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

14న త్రిశక్తి పీఠంలో విశేష పుష్పార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో ఈ నెల 14న భోగి పండుగను పురస్కరించుకుని మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు విశేష పుష్పార్చన నిర్వహిస్తామని ఆలయ కమిటీ సెక్రటరీ కె. జగదీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తమ శక్తికొద్దీ 13వ తేదీ రాత్రి ఎనిమిది గంటల్లోపు వివిధ రకాల పుష్పాలను (బంతిపూలు మినహా) దేవస్థానంలో సమర్పించాలని కోరారు.

పేద కుటుంబానికి ఇస్త్రీ బండి అందజేత



గుణదల (విజయవాడ తూర్పు): పేదలకు ఉపాధి కల్పించే దిశగా దేవినేని చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ 4వ డివిజన్ ఇన్‌చార్జి గల్లా రవికుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆదినారాయణకు జీవనోపాధి నిమిత్తం ఇస్త్రీ బండి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించే దిశగా దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గం పరిధిలోని అనేక ప్రాంతాల్లో బడ్డీ కొట్లు, తోపుడు బండ్లు, ఇస్త్రీ పెట్టెలు పంపిణీచేశారని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వై.సిద్ధార్థ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రకాష్‌కు పడాల రామారావు అవార్డు



పటమట(విజయవాడతూర్పు): తనకు స్వాతంత్ర్య సమరయోధుడు, సాహితీవేత్త పడాల రామారావు స్మారక అవార్డు ప్రదానం చేశారని నగరానికి చెందిన అవనిగడ్డ సూర్యప్రకాష్ మంగళవారం తెలిపారు. కేంద్ర సాహితీ అకాడమీ, అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈ నెల ఆరో తేదీన జరిగిన పడాల రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో తనను అవార్డుతో సన్మానించారని పేర్కొన్నారు.

డివైడర్లపై పూల మొక్కలు



పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు కొత్తగా నిర్మించిన సింగ్‌నగర్ డివైడర్‌లో పైపుల్ రోడ్డు నుంచి కండ్రిక వరకు మంగళవారం ఉదయం అసిస్టెంట్ డైరెక్టర్ హార్టీకల్చర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరం పచ్చదనం, కాలుష్య రహితంగా ఉండాలని ఉద్దేశంతో రూ.14 లక్షలతో, 540 చదనపు మీటర్లలో బోగన్విలియా తిమా రకంలో 1600 మొక్కలు, ఎల్లో పూల రకం 1600 మొక్కలు, తెల్ల పూలరకం 1100 మొక్కలు, ఫాక్స్ టైల్ పామ్స్ 123 మొక్కలు నాటామన్నారు. ఈ మొక్కలతో నగరం మరింత అందంగా కనిపిస్తుందన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వైఎస్ జగన్

డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను తెలుసుకొని, వారికి ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రజా సంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా బెల్లం దుర్గ మాట్లాడుతూ.. సీఎం జగన్ తన తండ్రి బాటలో ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారన్నారు. డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, డాక్టర్ రాజు, నారాయణరెడ్డి, సూర్యనారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

7వ డివిజన్‌లో..

లబ్బీపేట: ప్రజా సంకల్పయాత్ర చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఏడో డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి కేక్ కట్ చేశారు. డివిజన్ అధ్యక్షుడు సంపత్, నాయకుడు మెరకనపల్లి కుటుంబరావు, ఉదయ్, రెంటపల్లి కొండా, పరసా క్లైవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐదేళ్ల వేడుకలు

కృష్ణలంక: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం కృష్ణలంకలోని పలు డివిజన్లలో వేడుకలు నిర్వహించారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లో ఆర్‌సీఎం స్కూల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. 22వ డివిజన్‌లో కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి ఆధ్వర్యంలో మలేరియా హాస్పిటల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

గుణదలలో..

గుణదల: ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా యువజన నాయకుడు కొరివి చైతన్య మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందన్నారు. వైఎస్సార్ సీపీ నాయలకు చిత్రం లోకేష్, సొంగా రాజ్ కమల్, ఒగ్గు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రులు గర్వించేలా అంబేడ్కర్ స్మృతివనం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రులు గర్వించే విధంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతి వనం నిర్మాణం జరుగుతోందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఈ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన స్మృతి వనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి జాతికి అంకితమిస్తారని ప్రకటించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు 141వ వార్డు సచివాలయంలో మంగళవారం జరిగిన జన భాగిదరీ కార్యక్రమంలో మేయర్ పాల్గొని ప్రసంగించారు. తొలుత డాక్టర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సూచించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, అందుకు ప్రతినిత్యం తాను సిద్ధం అని తెలిపేలా నగర తొలి పౌరురాలిగా సంతకాన్ని జతపరిచారు. అనంతరం 46వ డివిజన్, తమ్మిన కృష్ణ వీధిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీలో మేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. 125 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహం అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఘన నివాళి అని పేర్కొన్నారు. ప్రతి సచివాలయంలో నిర్వహించే జన్ భగీదరి కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మునిసిపల్ అదనపు కమిషనర్ జనరల్ కె.శకుంతల, మేనేజర్ బి.శ్రీనివాస్, డీసీపీ భాస్కర్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని పలు కళాశాలల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. మహాత్మా గాంధీ రోడ్డులోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో రెడ్ ఎఫ్ఎం ఆశీర్వాద్ రంగుల సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగ వల్లుల పోటీల్లో విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బొమ్మల కొలువు, భోగిమంటలు, పిండివంటలు, బసవన్న ఆటలు వంటి ఎన్నో పోటీలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి బహుమతులు అందచేశారు. రెడ్ఎఫ్ఎం ఆర్జే సుధాకర్, స్వీటీ, అన్యతో పాటు స్టేషన్ హెడ్ క్రాంతి కుమార్, ప్రోగ్రామింగ్ హెడ్ ఆదిల్‌బాషా పాల్గొన్నారు.

నలంద డిగ్రీ కళాశాలలో....

ఆనందోత్సాహాల నడుమ విద్యార్థులు సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. సంక్రాంతి లక్ష్మి, గాలిపటం తయారీ, బొమ్మల కొలువు, పల్లెల్లో సంక్రాంతి, భోగి కుండల అలంకరణ, రంగోలి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ.. కళాశాలలో చదువుతో పాటు, వివిధ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహిస్తుంటామన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెడ్ వై.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



శ్రీ దుర్గామల్లేశ్వర కళాశాలలో ముగ్గుల పోటీలు



ఎస్ఆర్ఐలో విద్యార్థులకు భోగిపళ్లు పోస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు



నలంద డిగ్రీ కళాశాలలో..

ఎస్ఆర్ఐలో సంక్రాంతి సంబరాలు

పటమట(విజయవాడతూర్పు): పటమట ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో మంగళవారం క్లబ్ కార్నివాల్, సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. క్లబ్ కార్నివాల్ వేడుకలో కుకరీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, గార్డెనింగ్ , మీడియా క్లబ్స్‌లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో రుచికరమైన వివిధ వంటకాలను తయారు చేసి వచ్చిన వారందరికీ రుచి చూపించారు. సాయంత్రం సంక్రాంతి సంబరాలు జరిగాయి. భోగిమంటలు, బొమ్మల కొలువులు, రంగవల్లులు, గొబ్బెమ్మలతోపాటు హరిదాసు కీర్తనలతో ఈ వేడుకలు కట్టుకున్నాయి. కార్నివాల్ క్లబ్, సంక్రాంతి ముగ్గుల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు క్లబ్ యాక్టివిటీస్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య బహుమతులను అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపల్ కె.సునీత, తుషార్ పాల్గొన్నారు.

వేదం భారతీయ సంస్కృతికి మూలం

విజయవాడ కల్చరల్: వేదం భారతీయ సంస్కృతికి మూలమని వేదపండితుడు విష్ణుభొట్ల ఆంజనేయ చయనులు అన్నారు. శ్రీ రామాయణ నవాహ్నిక జ్ఞానయజ్ఞ ట్రస్ట్, శ్రీమద్భాగవత సప్తాహ యజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీశారద చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో కంచి పరమాచార్యుడు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు వేద సభ నిర్వహించారు. ఆంజనేయ చయనులు మాట్లాడుతూ.. వేద సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణ యజుర్వేద, సామవేదం, ఆధర్వణ వేదం, ఋగ్వేద పండితులు, ఘనాపాటీలు, క్రమాపాటీలు నాలుగు వేదాలను పఠించారు. అనంతరం నిర్వాహకులు వేద పండితులను ఘనంగా సత్కరించారు. ఉదయం దేవాలయంలో గురువందనం, గోపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. కార్యక్రమంలో జ్ఞానయజ్ఞం ట్రస్ట్ అధ్యక్షుడు కరెడ్ల సుందరశర్మ, గౌరవ అధ్యక్షుడు దివాకర్ బాబు, వైదిక సలహాదారుడు మద్దులపల్లి దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు.



వేద సభ నిర్వహిస్తున్న పండితులు

ఉత్సాహంగా డాన్ బాస్కో స్కూల్ వార్షికోత్సవం

పటమట(విజయవాడతూర్పు): స్థానిక గురునానాక్ నగర్‌లోని డాన్‌బాస్కో స్కూల్ 41వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చార్టెర్డ్ అకౌంటెంట్ కృష్ణారావు, సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కల్యాణచక్రవర్తి, కెనరా బ్యాంక్ అధికారి భాస్కరన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడిటర్ కృష్ణారావు మాట్లాడుతూ.. 41 ఏళ్ల నుంచి డాన్‌బాస్కో స్కూల్ అనేక మంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. నిబద్ధత గల పౌరులను తయారుచేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. నేషనల్ ఇన్నోవేషన్ హబ్‌గా నీతిఅయోగ్ ఈ పాఠశాలను గుర్తించటం అభినందనీయమని, ఇందులో రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్‌తో కూడిన అధునాతన ల్యాబ్ కలిగి ఉండటం హర్షణీయమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హెచ్‌డీ హుందాయ్ నూతన ప్రాంగణం ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హెచ్‌డీ హుందాయ్ సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్ సేవలకు సంబంధించి నూతన ప్రాంగణం అందుబాటులోకి వచ్చింది. నగరంలోని మహానాడు రోడ్డులో హెచ్‌డీ హుందాయ్, అజయ్ కంపెనీల సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్‌కు సంబంధించిన సేవలకు నూతన ప్రాంగణాన్ని ప్రారంభించింది. ఈ ప్రాంగణాన్ని హుందాయ్ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ఎక్విప్‌మెంట్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ చతుర్వేది ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ హెడ్ జయదీప్ భక్షి, జీఎం పి.జె.కిమ్, జై కృష్ణ, పుల్లారెడ్డి, సురేంద్రబాబు, ఎస్ఈపీఎల్ డైరెక్టర్ మన్‌మోహన్, ఆనంద్, అజయ్, యునైటెడ్ పవర్ సర్వీస్ మేనేజింగ్ పార్టనర్ కొడాలి నితిన్ చంద్ర పాల్గొన్నారు.



నూతన ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న రాజీవ్ చతుర్వేది

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

గుణదల (విజయవాడ తూర్పు): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని ప్రముఖ సైకాలజిస్ట్ ఫాదర్ బాల బొల్లినేని అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలో విద్యార్థులకు మంగళవారం కెరియర్ గైడెన్స్ కార్యక్రమం జరిగింది. కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనా ఫాదర్ బాల మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలన్నారు. విద్యార్థి దశలోనే సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు. ముఖ్యంగా తమలో ఉన్న ప్రతిభాపాతవాలను గుర్తించాలన్నారు. ఆ ప్రతిభకు నైపుణ్యాన్ని జోడిస్తే సాధించలేనిదేదీ ఉండదని అభిప్రాయపడ్డారు. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితిగతులకు అతీతంగా అభివృద్ధి చెందాలని ప్రోత్సహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికల పై దిశా నిర్దేశం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్‌కుమార్, గణితశాస్త్ర విభాగాధిపతి పరుచూరి వేణుగోపాలరావు, అధ్యాపకులు డి.తబిత, కె.అనురాధ పాల్గొన్నారు.

రంగనాథస్వామికి ముత్యాల హారతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన రంగనాథ స్వామికి ముత్యాల హారతులు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పారాయణ మండలి కన్వీనర్ సత్యశ్రీహరి ధనుర్మాసంలో ముత్యాల హారతుల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను పారాయణ మండలి సభ్యులు పర్యవేక్షించారు.

● **విజయవాడ కల్చరల్:** స్వరఝురి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యాన మంగళవారం దుర్గాపురం శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో గరికపాటి జగన్నాథరామ్ నిర్వహించిన గాత్ర సంగీత కచేరీ కర్నాటక సంగీత వైభవాన్ని చాటింది. మహాగణపతిం, శంకరి నీవు, విశ్వనాథమ్, హరిదాసులు వెడలిరి తదితర కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వయోలిన్‌పై వేదుల కిరణ్, మృదంగంపై మంగళగిరి శ్రీధర్ సహకరించారు.


తిరుపతిలో లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి తదితరులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గొల్లవిల్లి గ్రామంలో వితంతు పింఛన్ అందిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్


శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం అడ్డంగి గిరిజన గ్రామంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


విజయవాడలో జాలకంటి సత్యవతికి వితంతు పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ సిహెచ్ పావని


పల్నాడు జిల్లా కారంపూడిలో పెంచిన పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రా..రమ్మన్నా.. రాని జనం

ఆళ్లగడ్డ సభకు లక్ష మందిని తరలించాలని జిల్లా నేతలకు టీడీపీ టార్గెట్

- పదివేల మంది కూడా రాకపోవడంతో తీవ్ర అసంతృప్తి
- వచ్చిన వారు కూడా సభ మధ్యలోనే వెనుదిరగడంతో బాబు అసహనం
- ఎన్నికల్లో గెలిపిస్తే ఏం చేస్తారో చెప్పకుండానే సీఎం జగన్ కుటుంబం టార్గెట్‌గా సాగిన ప్రసంగం
- ఆళ్లగడ్డ టికెట్ ప్రకటన చేయకపోవడంతో అఖిలప్రియ కార్యకర్తల ఆగ్రహం


బాబు ప్రసంగం మధ్యలోనే వెళ్లిపోతున్న మహిళలు

సాక్షి, నంద్యాల: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రా కదలిరా సభ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. సుమారు లక్ష మందితో సభ నిర్వహిస్తామని టీడీపీ నాయకులు గొప్పగా చెబుతూ వచ్చారు. కానీ, పదివేల మంది కూడా సభకు రాలేదు. నంద్యాల జిల్లా నుంచే కాకుండా కర్నూలు, కడప, అనంతపురం నుంచి కూడా జనాలను తరలించినప్పటికీ అనుకున్న లక్ష్యం దరిదాపుల్లోకి చేరలేదు. నియోజకవర్గాల నుంచి భారీగా జనాలను తరలించాలని ముందుగానే చెప్పినప్పటికీ జనాలను తరలించలేక నాయకులు చేతులెత్తేశారు.

రూ.2 కోట్లు వృథా..

సభ కోసం సుమారు రూ.రెండు కోట్లు ఖర్చుచేసినట్లు సమాచారం. అయినా తెలుగుదేశం పార్టీ సభకు జనం రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఆ పార్టీ నాయకులుండిపోయారు. సభపై జనాలకు ఆసక్తిలేకపోతే తాము మాత్రం ఏం చేయగలమని తెలుగుదేశం పార్టీ నాయకులే మాట్లాడుకున్నారు.

వైఎస్ జగన్ కుటుంబం టార్గెట్‌గా విమర్శలు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబాన్ని టార్గెట్‌గా చేసుకుని చంద్రబాబు మాట్లాడడం విమర్శలకు తావిచ్చింది. తాను అధికారంలో ఉండి ఉంటే రాయలసీమను సస్యశ్యామలం చేసేవాడినని చెప్పడంతో స్థానికులు విస్మయానికి గురయ్యారు. బిర్యానీ, మందు ఇచ్చి జనాలను తరలించినా చంద్రబాబు ఉపన్యాసం బోరు కొట్టడంతో చాలామంది సభ నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయారు. కాబోయే సీఎం జూనియర్ ఎన్టీఆర్ అంటూ సభలో ఆయన అభిమానులు ఫ్లెక్సీలు పట్టుకున్నారు. ఇక ఆళ్లగడ్డ టికెట్ విషయంలోనూ భూమా అఖిలప్రియకు ఎలాంటి హామీ లభించకపోవడంతో కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. మరోవైపు.. టీడీపీ–జనసేన కూటమి ఏర్పడిన తర్వాత నంద్యాల జిల్లాలో ఏర్పాటుచేసిన మొదటి సభకు జనసేన నుంచి ఏ ఒక్క నేతా హాజరుకాలేదు.

అసహనానికి గురైన చంద్రబాబు

సభకు జనాలు లేకపోవడంతో చంద్రబాబు తీవ్ర అసహనానికి గురయ్యారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభలకు కూడా జనాలను తరలించలేకపోతే ఇక మీరెందుకంటూ నాయకులపై మండిపడినట్లు తెలిసింది. సభ ఆద్యంతం ఆయన ముఖంలో అసహనం కనిపించింది. మరోవైపు.. చంద్రబాబు ప్రసంగిస్తుండగానే వచ్చిన అరకొర జనం కూడా వెనుదిరగడంతో ఏం చేయాలో తెలియక టీడీపీ నాయకులు తలలు పట్టుకున్నారు. సభకు వచ్చేందుకు స్థానిక కార్యకర్తలు ఆసక్తి కనబరచలేదు. ఆళ్లగడ్డ నుంచి కేవలం రెండు, మూడు వేల మందే వచ్చినట్లు ఆ పార్టీ నాయకులే మాట్లాడుకోవడం గమనార్హం.

మూడునెలలు టీడీపీ–జనసేన

జెండాలు పట్టుకోండి

- కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం
- వైఎస్సార్‌సీపీ మంత్రులది సామాజిక యాత్ర కాదు.. మోసాల యాత్ర
- ఆళ్లగడ్డ బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు


సభలో మాట్లాడుతున్న చంద్రబాబు


బాబు ప్రసంగిస్తుండగానే ఎంచక్కా మద్యం సేవిస్తున్న ఓ తమ్ముడు

సాక్షి, నంద్యాల: రాష్ట్రంలో వచ్చే మూడునెలలు టీడీపీ–జనసేన జెండాలు పట్టుకుని తిరగాలని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. గోదావరి నుంచి 350 టీఎంసీలు రాయలసీమకు తరలించి సీమను సస్యశ్యామలం చేస్తామన్నారు. రా కదలిరా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తామని, నంద్యాల జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రచార పిచ్చి పట్టుకుందని, పాసు పుస్తకాలపైనా తన బొమ్మలు వేసుకుంటున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు దోపిడీ దొంగలుగా మారారని, ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలు నాశనమయ్యాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ మంత్రులది సామాజిక యాత్ర కాదని అది మోసాలయాత్ర అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తామన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు పెద్దఎత్తున పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నందికొట్కూరులో విత్తన సరఫరా యూనిట్‌ను, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కును జగన్ ధ్వంసం చేశారని ఆరోపించారు. జగన్ వదిలిన బాణం ఎక్కడ తిరుగుతోందని వైఎస్ షర్మిలనుద్దేశించి ఆయన ప్రశ్నించారు.

క్లుప్తంగా...

మెడికల్ బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయండి

కమిషనర్ సురేశ్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వారి డీడీఓ ద్వారా ఆన్‌లైన్‌లో వైఎస్సార్ ట్రస్ట్, ఈహెచ్‌ఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ స్కూల్స్‌లో పనిచేసే బోధనా సిబ్బంది ఆన్‌లైన్‌లో మాత్రమే బిల్లులు సమర్పించాలని, మాన్యువల్‌గా సమర్పించిన బిల్లులు అనుమతించేది లేదన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ సర్వీస్ అంశాలను పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌కు బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

భూ పంపిణీతోనే పేదల అభివృద్ధి: సీపీఎం


మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): పేదలకు భూములు పంచడం ద్వారానే వారి జీవితాలు అభివృద్ధి చెందుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పేదలకు పంచేందుకు 16 రకాల ప్రభుత్వ భూములు మూడు లక్షల ఎకరాలు ఉన్నాయన్నారు. ఆరు లక్షల మంది వ్యవసాయ కార్మికులకు భూములు పంపిణీ చేస్తేనే నిజమైన అభివృద్ధి జరిగినట్లని చెప్పారు. మెట్ట ప్రాంత భూములకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం ప్రసంగించారు.

బీజేపీతో టీడీపీ కలవడమంటే దివాళాకోరుతనమే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్రానికి అపకారం చేసిన బీజేపీతో తెలుగుదేశం పార్టీ కలవడమంటే అంతకంటే దివాళాకోరుతనం ఉండదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్న విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికుల ఆందోళనలతో రాష్ట్రం ఆందోళన ఆంధ్రప్రదేశ్‌గా మారిందని ఆరోపించారు. సమ్మె చేస్తున్నవారిపై ఎస్మా ప్రయోగం సరికాదన్నారు. సీపీఐ నాయకులు అక్కినేని వనజ, తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని యోగ్యులు ప్రారంభించాలి

తిరుపతి కల్చరల్: బిల్కిస్ బానోపై లైంగిక దాడికి దిగిన 11 మంది నిందితులకు క్షమాభిక్ష కింద శిక్షాకాలం తగ్గిస్తూ విడుదల చేసిన బీజేపీ నేతలు అయోధ్యలోని రామ మందిరాన్ని ప్రారంభించడం సిగ్గుచేటని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. యోగ్యులు, మంచి వ్యక్తులచే ప్రారంభింపజేయాలని, మహిళల మానాలతో వికృతంగా ఆడుకున్నవారిని ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారిచే ప్రారంభించడం రామాలయ పవిత్రతకు అవమానకరమని మండిపడ్డారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష

సాక్షి, అమరావతి: లోక్‌సభకు, రాష్ట్ర అసెంబ్లీకి ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సన్నద్ధతపై కేంద్ర ఎన్నికల సంఘం విజయవాడలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉదయం కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌తో పాటు కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ సమావేశమై వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించింది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో మాట్లాడి.. ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై వారికి కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం చేసింది. ఈ సమీక్షలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా పాల్గొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది. బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీతో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమీక్ష నిర్వహించనుంది.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే కొనసాగించాలి

- జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కు మంత్రి మేరుగు నాగార్జున వినతి
- 19న అంబేడ్కర్ స్మృతివనాన్ని జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్



సాక్షి, అమరావతి: మతం మారినా ఏ మాత్రం మారని దుర్భర పరిస్థితుల మధ్య బతుకుతున్న దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే కొనసాగించాలని జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న అంశంపై జాతీయ స్థాయిలో ఏర్పాటైన జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వంలో మరో ఇద్దరు సభ్యులతో కూడిన కమిషన్ మంగళవారం రాష్ట్రానికి వచ్చింది. సచివాలయంలో విచారణ చేపట్టిన కమిషన్‌ను మంత్రి కలిసి దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 59 కులాలు షెడ్యూల్ కులాల(ఎస్సీ) జాబితాలో ఉన్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో సిక్కు, బౌద్ధ మతంలోకి మారిన ఎస్సీలను ఎస్సీలుగానే కొనసాగిస్తున్నారని, అదే విధంగా క్రిస్టియన్ మతంలోకి మారిన దళితులను కూడా ఎస్సీలుగా కొనసాగించాలని బాలకృష్ణన్ కమిషన్‌ను కోరినట్లు తెలిపారు. ఎస్సీల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ చొరవతో రాష్ట్రంలో దళిత క్రైస్తవులను ఎస్సీలుగానే పరిగణించాలని కేంద్రాన్ని కోరుతూ 2023, మార్చి 24న అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించినట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన విధంగానే దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా ఇవ్వాలని కమిషన్‌ను అభ్యర్థించామన్నారు. రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ఒక నివేదికను కమిషన్‌కు అందజేశామని తెలిపారు. నవరత్నాలు, ఇతర పథకాల ద్వారా గత ఐదేళ్లకాలంలో 1,23,11,910 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.57,828 కోట్లను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అందించినట్లు చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఎస్సీ సబ్‌ప్లాన్ (కాంపొనెంట్) ద్వారా రూ.62,270 కోట్లు ఎస్సీల సంక్షేమం కోసం ఖర్చు చేశామన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా ఎస్సీ కుటుంబాలకు సాయం అందించడంలో, ఎస్సీ విద్యార్థులకు అత్యధికంగా పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పులు మంజూరు చేయడంలో, భారీ సంఖ్యలో ఎస్సీ మహిళా గ్రూపులకు ఆర్థిక సహాయం అందించడంలోనూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ నివేదికను సమగ్రంగా పరిశీలించిన జస్టిస్ బాలకృష్ణన్‌తోపాటుగా కమిషన్ సభ్యులు డాక్టర్ రవీంద్రకుమార్ జైన్, ప్రొఫెసర్ సుష్మా యాదవ్ కూడా రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ప్రశంసనీయమని అన్నారని మంత్రి తెలిపారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీలో ఎస్సీల అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాలను ఆదర్శంగా తీసుకోవాలని వారు అభిప్రాయపడ్డారన్నారు. విజయవాడలో రూ.404 కోట్లతో నిర్మించిన అంబేడ్కర్ స్మృతి వనాన్ని ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్ జాతికి అంకితం చేస్తారని మంత్రి నాగార్జున చెప్పారు.

దొంగ ఓట్లకు ఆద్యుడు బాబే

- పార్టీ ఫిరాయింపు దొంగతో కలిసి వెళ్లి దొంగ ఓట్లపై ఫిర్యాదా!?
- కుప్పంలో ప్రతిసారీ ఆయన దొంగ ఓట్లతోనే గెలిచాడు
- హైదరాబాద్‌లో ఓటేసి ఇక్కడా ఓటేస్తామంటే కుదరదు..
- చంద్రబాబుపై మంత్రి అంబటి ఫైర్



సత్తెనపల్లి :దొంగ ఓట్లకు ఆద్యుడు చంద్రబాబేనని మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. అసెంబ్లీకి రాని ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేంద్ర ఎన్నికల సంఘం వద్దకు వెళ్లి వైఎస్సార్‌సీపీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని.. దొంగ ఓట్లను ప్రోత్సహిస్తోందని ఫిర్యాదు చేయడం విచిత్రంగా ఉందన్నారు. అలాగే, వైఎస్సార్‌సీపీని మోసంచేసి, డబ్బు తీసుకుని పార్టీ ఫిరాయించి టీడీపీకి ఓటు వేసిన మరో దొంగ ఓటరు తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవిని ఆయన వెంట తీసుకెళ్లడం మరీ విడ్డూరంగా ఉందన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..అసలు మాకెందుకు దొంగ ఓట్లు? ఐదేళ్లు చిత్తశుద్ధిగా పరిపాలన చేసిన ప్రభుత్వం మాది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌ను అన్ని వర్గాల వారు గుండెల్లో పెట్టుకుంటున్నారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉన్నట్లు చంద్రబాబు నటిస్తున్నాడు. ఆనం రాంనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర రెడ్డిలను కూడా వెంటబెట్టుకుని వెళ్తే ఆయన బండారం ఇంకా బయటపడేది. నిజానికి.. ఈ దేశంలో ప్రజాస్వామ్యంపై నమ్మకంలేని వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే అది చంద్రబాబే. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోట్లు పెట్టి ఓ ఎమ్మెల్సీ ఓటుని కొనడానికి ప్రయత్నించి అభాసుపాలైన ఇలాంటి దుర్మార్గుడు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. నిజానికి.. కుప్పంలో గెలిచిన ప్రతిసారీ చంద్రబాబు దొంగ ఓట్లతోనే గెలిచాడు. నేడు ఆ దొంగ ఓట్లను తొలగించే ప్రక్రియ జరుగుతోంది. ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిగితే చంద్రబాబు ఈసారి అక్కడ ఓడిపోవడం ఖాయం. ఇక 2019 ఎన్నికలప్పుడు ఈవీఎంలలో సైకిల్‌కు ఓటువేస్తే ఫ్యాన్‌కి పడింది అని చెప్పాడు. ఇవాళ కేంద్ర ఎన్నికల సంఘానికి ఈవీఎంల గురించి ఎందుకు ఫిర్యాదు చేయలేదు?

పవన్.. సైకిల్ గుర్తుపై పోటీచెయ్యి..

ఎలక్షన్ కమిషన్ వద్దకు చంద్రబాబు పవన్‌ను కూడా వెంటబెట్టుకుని వెళ్లాడు. బహుశా గుర్తింపులేని పార్టీకి అనుమతి లభించదని, చంద్రబాబు చెంచాగా పవన్ వెళ్లాడేమో? ఎందుకయ్యా పవన్.. నీకు గ్లాసు గుర్తు? సైకిల్ గుర్తుపైనే పోటీచేయవచ్చు కదా? నీ పార్టీని విలీనం చేసేయ్.. కావాలంటే కొంచెం ప్యాకేజీ పెంచండి అని అడుగు బాగుంటుంది.

వైఎస్సార్‌సీపీ టీం రెడీ..

నిజానికి.. టీడీపీ–జనసేన సీట్లు పంచుకునే కార్యక్రమమే ప్రారంభం కాలేదు. కానీ, 175+25 జగన్‌మోహన్‌రెడ్డి టీం రెడీగా ఉంది. త్వరలో ప్రకటించబోతున్నారు. చంద్రబాబు పనైపోయింది. ఈ ఎన్నిక తర్వాత ఆయన చాప సర్దుకుని హైదరాబాద్ వెళ్లాల్సిందే.

కృష్ణా జలవిద్యుత్ కేంద్రాలపై ఏపీ పిటిషన్ వాయిదా


ఫిబ్రవరి 13కు వాయిదా వేసిన సుప్రీం కోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణానదిపై ఉన్న జలవిద్యుత్ కేంద్రాలను కూడా కేఆర్ఎంబీ పరిధిలోకి తేవాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదా వేసింది. మధ్యంతర ఉపశమనం కోరుతూ ఏపీ ప్రభుత్వం 2021లో దాఖలు చేసిన ఈ పిటిషన్ మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. విచారణ మూడువారాలకు వాయిదా వేయాలని తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ధర్మాసనాన్ని కోరారు. దీనికి అభ్యంతరం లేదని ఏపీ న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 13కు విచారణ వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

సచివాలయ ఉద్యోగులతో ఎన్నికలు వద్దు

చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు చంద్రబాబు, పవన్ కలిసి ఉమ్మడి వినతిపత్రం


సీఈసీని కలిసేందుకు వెళుతున్న పవన్, చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)ని టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కోరారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలపై విచారణ జరపాలని కోరారు. మంగళవారం విజయవాడ వచ్చిన సీఈసీని వారిద్దరూ సంయుక్తంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున దొంగ ఓట్లు చేరుస్తోందని విమర్శించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఎన్నికల విధులకు ఉపయోగించకుండా నివారించాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉండే తిరుగుబాటు చూశాక హోల్‌సేల్‌గా ఓటర్ల జాబితాను మారుస్తున్నారని ఆరోపించారు. ఒక్క చంద్రగిరిలోనే 1.15 లక్షల ఓట్లు చేర్చారని, అందులో 33 వేల ఓట్లు ఆమోదించారన్నారు. ఎన్నికల కమిషనర్‌గా ఉన్న ఒక చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి కేంద్రాన్ని రక్షణ కోరే పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందన్నారు. నామినేట్ చేసిన వలంటీర్లను పెట్టుకుని తప్పుడు పనులు చేయాలని చూస్తున్నారన్నారు. గతంలో బీఎల్‌వోలుగా ప్రభుత్వ అధికారులు ఉండేవారని, ఇప్పుడు 2,600 మంది మహిళా పోలీసులను బీఎల్‌వోలుగా పెట్టారన్నారు. టీడీపీ, జనసేన శ్రేణులపై 7 వేల కేసులు పెట్టారని, ఒక్క పుంగనూరులోనే 250 మందిపై కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. ఎన్నికల సమయంలో అవసరమైతే కేంద్ర పోలీసు పరిశీలకులను పంపాలని, స్పెషల్ సెల్ ఏర్పాటు చేయాలని, అవకతవకలు జరగకుండా చేయాలని కోరినట్లు చంద్రబాబు చెప్పారు. తప్పు చేసిన ప్రతి అధికారిపైనా ఆధారాలతో ఫిర్యాదు చేశామని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కలెక్టర్, ఎస్పీలపైనా బెదిరింపులకు దిగుతున్నారని, లొంగకపోతే కేసులు పెడుతున్నారన్నారు.

శాంతిభద్రతలు దిగజారాయి: పవన్

ఏపీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని కేంద్రం నిర్ణయం తీసుకోవడంవల్లే కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి వచ్చిందని పవన్ కళ్యాణ్ అన్నారు. చంద్రబాబు మూడు సార్లు సీఎంగా చేశారని, ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కూడా ఇన్ని అవకతవకలు జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక శాంతి భద్రతలు దిగజారాయని అన్నారు. వ్యక్తులపై అక్రమంగా బైండోవర్ కేసులు పెడుతున్నారని, పోలీసు అధికారులను హుటాహుటిన విధులు మారుస్తున్నారని అన్నారు. వలంటీర్ల నియామకమే ప్రజాస్వామ్య విరుద్ధమని, వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని చెప్పారు.

మేమంటే అంత చులకనా బాబూ?

చంద్రబాబు వ్యాఖ్యలపై మహిళా పోలీసు సంఘం ఆగ్రహం

- ప్రభుత్వం నిర్వహించిన రాతపరీక్ష, ప్రతిభ ఆధారంగా ఎంపికయ్యాం
- ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే నియమితులయ్యాం
- తప్పుడు ఆరోపణలు చేస్తే రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరిక

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులను ఉద్దేశించి ప్రతిపక్ష నేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవుతున్నాయి. 40 ఏళ్ల సీనియర్ రాజకీయ నాయకుడినని చెప్పుకునే ఆయన తమను ఉద్దేశించి అంత చులకనగా మాట్లాడటం, నిరాధార ఆరోపణలు చేయడం పట్ల మహిళా పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎంపిక పరీక్ష ద్వారా ఉద్యోగాలు పొందిన తమను నామినేటెడ్ ఉద్యోగులని చంద్రబాబు హేళన చేయడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. విజయవాడలో మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలిశాక చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు.. అందులోనూ మహిళా పోలీసులను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలన్నారు. అంతేకాకుండా వీరిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వో)లుగా వీరు పనిచేస్తున్నారని.. వీరిని తొలగించాలన్నారు. నామినేటెడ్ ఉద్యోగాలు పొందిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఎన్నికల విధుల్లో ఎలా నియమిస్తారని చంద్రబాబు ప్రశ్నించారు. వారికి ఏం అవగాహన ఉంది.. ఎన్నికల విధులు, ఓటర్ల నమోదు గురించి ఏం తెలుసన్నారు. అంతటితో చంద్రబాబు సరిపెట్టలేదు. మహిళా పోలీసుల వ్యక్తిత్వం గురించి కూడా అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రాత పరీక్ష ద్వారా మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగాలు పొందిన తమను ఆయన అవమానించారని సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. తాము విధుల్లో చేరాక రెండేళ్ల పాటు ప్రొబేషన్‌లో ఉన్నామని.. ఈ కాలంలో ప్రతిభ చూపినందుకు ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేసిందని గుర్తుచేస్తున్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల్లాగానే, ప్రభుత్వ నిబంధనల మేరకే తాము కూడా నియమితులయ్యామనే విషయాన్ని చంద్రబాబు తెలుసుకోవాలని వారంటున్నారు. అటువంటి తమను నామినేటెడ్ ఉద్యోగులని హేళన చేయడం ఎంతవరకు సబబని నిలదీస్తున్నారు.

ఎన్నికల విధులకు మేమెందుకు అర్హులం కాదు?

ఇతర ప్రభుత్వ ఉద్యోగులు అంతా ఎన్నికల విధులు నిర్వహించేందుకు అర్హులు అయినప్పుడు తామెందుకు కామని మహిళా పోలీసులు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ తమను ద్వితీయశ్రేణి ఉద్యోగులుగా వివక్షాపూరితంగా చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను రద్దు చేస్తామని గతంలోనే చంద్రబాబు, ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పలుమార్లు చెప్పిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి టీడీపీ వ్యవహార శైలి అదే తీరులో ఉండటం గమనార్హం. తాజాగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై చంద్రబాబు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన ఉద్దేశాన్ని పునరుద్ఘాటించాయి. టీడీపీ అధికారంలోకి వస్తే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తొలగించడంతోపాటు తమను తీవ్ర అవస్థల పాలు చేస్తారని ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను కించపరిచిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. తమ వ్యక్తిత్వాన్ని కించపరిచేలా చంద్రబాబు నిరాధారణ ఆరోపణలు చేయడంపై మహిళా పోలీసులు మండిపడుతున్నారు. మహిళలు అంటే చంద్రబాబుకు ఎంతటి చిన్నచూపో.. ఎంతటి చులకన భావముందో మరోసారి ఈ వ్యాఖ్యల ద్వారా నిరూపించారని రాష్ట్ర మహిళా పోలీసుల సంఘం మండిపడింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పట్ల ప్రధానంగా మహిళా పోలీసుల పట్ల చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వాసుల వందేళ్ల స్వప్నం నెల్లూరు బ్యారేజీ సాకారం కావడంతో దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లు అందుతున్నాయి. పెన్నా డెల్టాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్ చేపట్టిన నెల్లూరు బ్యారేజీ పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ రికార్డు సమయంలో పూర్తి చేశారు. 2022 సెప్టెంబరు 6న బ్యారేజీని జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి వరుసగా మూడేళ్లుగా సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువల కింద సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలోని ముత్తుకూరు, టీపీ గూడూరు, వెంకటాచలం, ఇందుకూరుపేట, నెల్లూరు మండలాల్లోని 77 గ్రామాల్లో 99,525 ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా నీళ్లు అందడంతో విస్తారంగా పంటలు సాగు అవుతున్నాయి. నెల్లూరు బ్యారేజీలో ఏడాది పొడవునా 0.4 టీఎంసీలను నిల్వ చేయడం ద్వారా నెల్లూరుతోపాటు 77 గ్రామాల్లో తాగునీటి సమస్యను సీఎం జగన్ శాశ్వతంగా పరిష్కరించారు. నెల్లూరుతోపాటు బ్యారేజీ దిగువ గ్రామాలను ముంపు నుంచి కాపాడారు. నెల్లూరు బ్యారేజీ కమ్ రెండు వరసల రోడ్డు బ్రిడ్జిని పూర్తి చేయడం ద్వారా నెల్లూరు-కోవూరు మధ్య రవాణా సమస్యను సీఎం జగన్ శాశ్వతంగా పరిష్కరించారని నెల్లూరు జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి, అమరావతి



లక్ష ఎకరాలు సస్యశ్యామలం

రికార్డు సమయంలో నెల్లూరు బ్యారేజీ పనులు పూర్తి

కరోనా కాలంతోపాటు.. పెన్నాకు పోటెత్తిన వరదల్లోనూ కొనసాగిన పనులు

నెల్లూరు బ్యారేజీ స్వరూపం ఇదీ..

- ఎక్కడ?: నెల్లూరు నగరానికి సమీపంలో పెన్నా నదిపై (మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీకి 20 కి.మీ. దిగువన)
- పరీవాహక ప్రాంతం: 51,800 చదరపు కిలోమీటర్లు
- బ్యారేజీ పొడవు: 640 మీటర్లు (బ్యారేజీకి అనుబంధంగా రెండు వరుసల రోడ్ బ్రిడ్జి)
- గేట్లు: 51 (పది మీటర్లు ఎత్తు, 3 మీటర్ల వెడల్పుతో 43 గేట్లు.. 10 మీటర్లు ఎత్తు, 4.3 మీటర్ల ఎత్తుతో 8 స్కవర్ స్లూయిజ్ గేట్లు)
- గేట్ల మరమ్మతుకు సిద్ధం చేసిన స్టాఫ్‌లాగ్ గేట్లు: 6
- గేట్ల నిర్వహణ: వర్టికల్ లిఫ్ట్
- గరిష్ట నీటి మట్టం: 14.3 మీటర్లు
- గరిష్ట వరద విడుదల సామర్థ్యం: 10,90,000 క్యూసెక్కులు
- ఆయకట్టు: 99,525 ఎకరాలు
- గరిష్ట నీటి నిల్వ: 0.4 టీఎంసీలు
- అంచనా వ్యయం: రూ.274.83 కోట్లు
- వైఎస్సార్ హయాంలో చేసిన వ్యయం: రూ.85.82 కోట్లు
- కనీస నీటి మట్టం: 11.3 మీటర్లు
- టీడీపీ హయాంలో వ్యయం: రూ.60.19 కోట్లు (కాంట్రాక్టర్ నుంచి అధికంగా కమీషన్లు వసూలు చేసుకోవడానికి సులభమైన పనులను మాత్రమే చేపట్టారు)
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన వ్యయం: రూ.88 కోట్లు

ఆయకట్టులో విస్తారంగా పంటల సాగు.. రైతుల్లో ఆనందోత్సాహాలు



- నెల్లూరు, 77 గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం.. తప్పిన వరద ముప్పు
- నెల్లూరు - కోవూరు మధ్య మరింత మెరుగుపడిన రవాణా సౌకర్యం
- జలయజ్ఞంలో భాగంగా పనులకు శ్రీకారం చుట్టిన వైఎస్సార్
- కాలయాపన, కమీషన్లతో సరిపుచ్చిన టీడీపీ సర్కారు
- ప్రాధాన్యతగా చేపట్టి వాయువేగంగా పూర్తి చేసిన సీఎం జగన్


శిథిలమైన ఆనకట్ట స్థానంలో బ్యారేజీ..



నెల్లూరు నగరానికి సమీపంలో పెన్నా నదికి అడ్డంగా 1854–55లో 481.89 మీటర్ల వెడల్పుతో ఆనకట్టను నిర్మించిన బ్రిటిష్ సర్కార్ అరకొరగా ఆయకట్టుకు నీళ్లందిస్తూ వచ్చింది. పెన్నా నదికి 1862లో వచ్చిన భారీ వరదలకు ఆనకట్ట దెబ్బతినడంతో 621.79 మీటర్ల వెడల్పుతో 0.7 మీటర్ల ఎత్తుతో కొత్త ఆనకట్టను నిర్మించారు. పూడిక పేరుకుపోవడం, శిథిలమవడంతో ఆయకట్టుకు నీళ్లందించడం 1904 నాటికే సవాల్‌గా మారింది. నెల్లూరు తాగునీటి కోసం తల్లడిల్లింది. ఈ ఆనకట్టకు దిగువన ఉన్న రోడ్డు ద్వారా నెల్లూరు–కోవూరు మధ్య రాకపోకలు సాగించేవారు. పెన్నా నదికి కాస్త వరద వచ్చినా నెల్లూరు–కోవూరుల మధ్య రాకపోకలు స్తంభించిపోయేవి. ఆనకట్ట వల్ల వరద వెనక్కి ఎగదన్ని నెల్లూరు నగరాన్ని ముంచెత్తేది. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఆనకట్ట స్థానంలో బ్యారేజ్ కమ్ రోడ్ బ్రిడ్జిని నిర్మించాలని 1904 నుంచి నెల్లూరు జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 2004 వరకూ దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. జలయజ్ఞంలో భాగంగా నెల్లూరు బ్యారేజ్ కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.147.20 కోట్లతో దివంగత వైఎస్సార్ 2008 ఏప్రిల్ 24న చేపట్టారు. బ్యారేజీ పనుల కోసం రూ.85.82 కోట్లు ఖర్చు చేశారు. ఆయన హఠాన్మరణం నెల్లూరు బ్యారేజీకు శాపంగా మారింది.

కరోనా.. భారీ వరదల్లోనూ..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక నెల్లూరు బ్యారేజీని ప్రాధాన్యతగా చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జలవనరుల శాఖను ఆదేశించారు. కరోనా ప్రతికూల పరిస్థితులు, పెన్నా చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా వరుసగా మూడేళ్లు భారీ వరదలు ఆటంకాలు సృష్టించినా బ్యారేజీలో రెండు మీటర్ల మందంతో 57 పియర్లను ప్రభుత్వం పూర్తి చేసింది. 51 గేట్లను, ఎలక్ట్రిక్ విధానంలో హాయిస్ట్‌ను ఏర్పాటు చేసింది. రెండు వరుసల రోడ్ బ్రిడ్జిని నిర్మించారు. సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువలకు నీటిని సరఫరా చేసే రెగ్యులేటర్‌ను పూర్తి చేశారు. 0.4 టీఎంసీలను నిల్వ చేయడానికి వీలుగా బ్యారేజ్‌కు కుడి, ఎడమ వైపు కరకట్టలను పటిష్టం చేశారు. ఈ పనులకు రూ.88 కోట్లు ఖర్చు చేశారు.



నెల్లూరు బ్యారేజీ మీదుగా వాహనాల రాకపోకలు

కాలయాపన.. కమీషన్లు

రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ నెల్లూరు బ్యారేజ్ పనులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. పాత ఆనకట్టను పూర్తిగా తొలగించి బ్యారేజీ నిర్మిస్తున్న ప్రాంతానికి 20 మీటర్ల ఎగువన కాఫర్ డ్యామ్ నిర్మించి ఆయకట్టుకు నీళ్లందిస్తూ బ్యారేజ్ నిర్మించాలని 2014లో ప్రభుత్వానికి నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. 2016 వరకూ టీడీపీ సర్కార్ దీన్ని కనీసం పరిశీలించలేదు. ఆ తరువాత అంచనా వ్యయాన్ని రూ.274.83 కోట్లకు సవరించి కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు అధికంగా రాబట్టుకోవడానికి సులభంగా చేసే పనులకే ప్రాధాన్యం ఇచ్చింది. 2019 మే 29 వరకూ రూ.60.19 కోట్లను ఖర్చు చేసి బ్యారేజీలో 57 పియర్లను (కాంక్రీట్ దిమ్మెలు) పునాది కంటే ఒక మీటర్ ఎత్తు వరకు మాత్రమే చేయగలిగింది.

ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు



కరోనా, పెన్నా వరదలు లాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రాధాన్యతగా చేపట్టి నెల్లూరు బ్యారేజీని పూర్తి చేశాం. ఆయకట్టుకు సమృద్ధిగా నీటిని అందిస్తున్నాం. బ్యారేజీలో నిత్యం 0.4 టీఎంసీలను నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరుగుతుంది. సాగు, తాగునీటి సమస్యను సీఎం జగన్ శాశ్వతంగా పరిష్కరించారు.

– సి.నారాయణరెడ్డి, ఈఎన్‌సీ, జలవనరుల శాఖ

ఆయకట్టు సస్యశ్యామలం..



పాదయాత్ర హామీని నిలబెట్టుకుంటూ నెల్లూరు బ్యారేజ్‌ను సీఎం జగన్ రికార్డు సమయంలో పూర్తి చేశారు. బ్యారేజీ పూర్తయ్యాక ఆయకట్టంతంటికీ సమృద్ధిగా నీళ్లందుతున్నాయి. 2022 నుంచి ఏటా రెండు పంటలు పండిస్తూ ఏడు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాం. మంచి దిగుబడులు వస్తున్నాయి. ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడంతో ప్రయోజనం పొందుతున్నాం. బ్యారేజీ మీదుగా నెల్లూరుకు సులభంగా వెళ్లి వస్తున్నాం.


– తన్నీరు అనిల్, రైతు, ఇందుకూరుపేట, నెల్లూరు జిల్లా

నాడు కల.. నేడు నిజం



నెల్లూరు బ్యారేజీ ఒక కల. ఈ పనులను మహానేత వైఎస్ ప్రారంభిస్తే సీఎం జగన్ పూర్తి చేశారు. బ్యారేజ్ పూర్తికాక ముందు ఆయకట్టుకు నీళ్లందకపోవడంతో 3.5 ఎకరాల్లోనే పంటలు సాగు చేశా. ఇప్పుడు సొంత పొలంతోపాటు 20 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేస్తున్నా. మంచి దిగుబడులు వస్తున్నాయి. గిట్టుబాటు ధర దక్కుతోంది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుతానని పాదయాత్రలో ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలబెట్టుకున్నారు.

– వాకాటి మహేష్, ఇందుకూరుపేట, నెల్లూరు జిల్లా



బంగారు పంటలు పండేలా పొలాలకు నెల్లూరు బ్యారేజీ నుంచి వెళ్తున్న పెన్నా జలాలు



నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం పరిధిలో పెన్నా బ్యారేజీ కింద సాగవుతున్న పంటలు

తెలుగు తరతరాలకూ వెలుగు

- అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



నటుడు కౌశిక్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ వాసంతి. చిత్రంలో కొమ్మినేని, విజయబాబు

అనంతపురం/అనంతపురం కల్చరల్: తెలుగు భాషా సంస్కృతిని పరిపుష్టం చేయడానికి విశేష కృషి చేసిన శ్రీకృష్ణదేవరాయల గడ్డ అనంతపురం జిల్లా అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు విజయబాబు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాషాసంస్కృతులకు పట్టాభిషేకం జరుగుతోందని పేర్కొన్నారు. అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అనంత తెలుగు భాషా వైభవ సదస్సును అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విజయబాబు, సి.రాఘవాచారి ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సేవ జీవిత సాఫల్య పురస్కారాలను 10 మందికి, తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారాలను 38 మందికి అందజేశారు. సదస్సులో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ప్రత్యేక వక్తల ప్రసంగాలు, సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్, జేఎన్‌టీయూ(ఏ) రిజిస్ట్రార్ సి.శశిధర్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి పాల్గొన్నారు.

కాకి లెక్కలతో రోత

కోత పెట్టాలనుకుంటే వెతికి మరీ పరిహారం ఎందుకిస్తారు రామోజీ?

- ప్రాథమిక – తుది నష్టం అంచనాలకు తేడా ఉండదా?
- కరువు, మిచాంగ్ తుపాను సాయం పంపిణీకి చురుగ్గా ఏర్పాట్లు
- రైతులకు రూ.5,942 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు

వాటిలో ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలే రూ.2,558 కోట్లు

సాక్షి, అమరావతి: సాధారణంగా ప్రాథమిక పంట నష్టం అంచనాలకు, తుది నష్టం లెక్కలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ఎందుకంటే ప్రాథమిక అంచనాలను ముంపు విస్తీర్ణం ఆధారంగా అప్పటికప్పుడు రూపొందిస్తారు. ముంపునీరు సకాలంలో దిగిపోతే పంటలకు నష్టం వాటిల్లదు. శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే ఆశించిన స్థాయిలో దిగుబడులొస్తాయి. ఇది రైతన్నలందరికీ తెలిసినా రోత రాతల రామోజీ మాత్రం పంట నష్టం లెక్కలను ప్రభుత్వం తగ్గించి చూపిస్తోందంటూ బురద చల్లుతున్నారు. నిజంగానే అలా తగ్గించే ఉద్దేశమే ఈ ప్రభుత్వానికి ఉంటే గతంతో పోలిస్తే పెట్టుబడి రాయితీని పెద్ద ఎత్తున ఎందుకు పెంచుతుంది? లబ్ధిదారులను వెతికి మరీ ఎందుకిస్తుంది? గత సర్కారు ఎగ్గొట్టిన బకాయిలను ఎందుకు చెల్లిస్తుంది? ఇక రామోజీ చెబుతున్నట్లు అన్నదాతకు వాతలు నిజమే కానీ, అది ఇప్పుడైతే కాదు. చంద్రబాబు సర్కారు హయాంలో అన్నది పచ్చి నిజం. అప్పుడు రామోజీ కలం మొద్దుబారిపోవడంతో కదల్లేదు కాబోలు!!

ఎలా లెక్కిస్తారో తెలియదా?

ఆరు ప్రామాణికాలు (వర్షపాతం, సాగు విస్తీర్ణం, ఉపగ్రహ ఆధారిత పంటల పరిస్థితి, వాగు ప్రవాహం, భూగర్భ జలాల స్థాయి, జలాశయాల మట్టం) పరిగణలోకి తీసుకొని కరువు మండలాలను ప్రకటిస్తారు. తుపాన్లు, వరదలు, అకాల వర్షాల సమయంలో తొలుత ప్రాథమిక నష్టాన్ని అంచనా వేస్తారు. క్షేత్ర స్థాయి పరిశీలన తర్వాత నిబంధనల మేరకు 33 శాతానికి పైగా మునిగిపోయి దెబ్బతిన్న పంటలను పరిగణలోకి తీసుకొని పంట నష్టం తుది అంచనాలను రూపొందిస్తారు. ఆ మేరకు పంటల వారీగా లెక్కించిన నష్ట పరిహారాన్ని (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తారు. ఆర్బీకే సిబ్బంది, ప్రభుత్వ యంత్రాంగం అన్నదాతలకు తోడుగా నిలవడంతో ముంపు నీరు త్వరగా దిగిపోయేలా చేసి పంట నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగారు.

పెరిగిన పెట్టుబడి రాయితీ

వైపరీత్యాల వేళ కేంద్రం నిర్ణయించిన దాని కంటే ఎక్కువగా ఇవ్వాలనే ఉద్దేశంతో పెట్టుబడి రాయితీని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ భూముల్లో మట్టి, ఇసుక మేట తొలగించేందుకు గతంలో హెక్టారుకి రూ.12 వేలు ఇవ్వగా సీఎం జగన్ ప్రభుత్వం రూ.18 వేలకు పెంచింది. దెబ్బతిన్న వర్షాధార పంటలకు గతంలో హెక్టారుకి రూ.6,800 మాత్రమే ఉన్న పరిహారాన్ని రూ.8,500కి పెంచింది. నీటిపారుదల భూములైతే ఇన్‌పుట్ సబ్సిడీ గతంలో రూ.13,500 ఇవ్వగా ఇప్పుడు రూ.17 వేలు అందిస్తున్నారు. ప్రధానంగా వరి, వేరుశనగ, పత్తి, చెరుకు తదితర పంటలకు గతంలో హెక్టార్‌కు రూ.15 వేలు ఇవ్వగా ప్రస్తుతం రూ.17 వేలకు పెంచారు. ఉద్యాన పంటలకు రూ.7,500 నుంచి రూ.17 వేలకు పెంచారు. మామిడి, నిమ్మ జాతి తోటలకు రూ.20 వేల నుంచి రూ.22,500కి పరిహారం పెరిగింది. మల్బరీకి రూ.4,800 నుంచి రూ.6 వేలకు పెంచి ఇస్తున్నారు.



నిబంధనలు సడలించి కొనుగోలు

వర్షాభావంతో 2023 ఖరీఫ్‌లో 63.46 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 103 కరువు మండలాలను గుర్తించగా 14.07 లక్షల ఎకరాల్లో 6.96 లక్షల మంది రైతులు పంట నష్టపోయినట్లు తేలింది. వారికి రూ.847.27 కోట్ల పెట్టుబడి రాయితీని ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు డిసెంబర్‌లో మిచాంగ్ తుపాన్ వల్ల పంట నష్టపోయిన 4.61లక్షల మంది రైతులకు రూ.442.11 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీని కూడా త్వరలో జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. తుపాన్ ప్రభావంతో రంగు మారిన, తడిసిన 12.70 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని నిబంధనలు సడలించి మరీ రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది.

ఎగ్గొట్టిన చరిత్ర చంద్రబాబుదే


చంద్రబాబు పాలనలో ఏటా సగటున 324 మండలాల్లో కరువే తాండవించినా రైతులను కనికరించలేదు. హుద్‌హుద్ నుంచి పెథాయి తుపాన్ వరకు ఏటా విరుచుకుపడినా ఏనాడైనా ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి సంబంధించి నష్ట పరిహారాన్ని ఆ సీజన్ కాదు కదా కనీసం ఆ ఏడాది ముగిసేలోగానైనా ఇచ్చిన దాఖలాలు లేవు. ఐదేళ్ల పాలనలో 24.80 లక్షల మందికి రూ.2,558.07 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఎగ్గొట్టిన ఘన చరిత్ర చంద్రబాబుదే. సబ్సిడీ విత్తనాలకు సంబంధించి రూ.282.71 కోట్లు, సున్నా వడ్డీ రాయితీ రూ.1,180.66 కోట్లు, పంటల బీమా పరిహారం రూ.715.84 కోట్లు, ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.23.70 కోట్లు, యాంత్రీకరణ కోసం రూ.221.07 కోట్లు, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.960 కోట్లు కలిపి ఏకంగా రూ.5,942.05 కోట్లు ఒక్క అన్నదాతలకే చంద్రబాబు ఎగ్గొట్టారు. ఇక రైతులకే మరో రూ.8,845 కోట్ల మేర విద్యుత్ బకాయిలు పెట్టారు. వీటిని ఇప్పుడు ఈ ప్రభుత్వమే చెల్లిస్తూ రైతన్నలకు తోడుగా నిలిచింది. విపత్తు ఏదైనా ఆగమేఘాల మీద స్పందిస్తూ నష్టపోయిన ప్రతి ఎకరాకు, దెబ్బతిన్న ప్రతీ రైతుకు సీజన్ చివరిలో పంట నష్ట పరిహారాన్ని (ఇన్‌పుట్ సబ్సిడీ) అణాపైసలతో సహా లెక్కగట్టి మరీ నేరుగా ఖాతాల్లో జమ చేస్తోంది. ఇలా 22.85 లక్షల మంది రైతులకు రూ.1,976.45 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించింది. పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802.05 కోట్ల బీమా పరిహారాన్ని అందించింది.

బ్రో.. ఇది దొంగ ఓటు!

జనసేన కార్యాలయం చిరునామాతో పవన్ కళ్యాణ్ ఓటు నమోదు

ఓటు నమోదులో పార్టీ కార్యాలయం అడ్రస్ చెల్లుబాటుపై అనేక రకాల అనుమానాలు

సాక్షి, అమరావతి : ఓటు దొంగలే.. దొంగా దొంగా అని అరుస్తున్నారు. మంగళవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు 'రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో దొంగ ఓట్లు నమోదవుతున్నాయి' అని స్వయంగా ఫిర్యాదు చేసిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్.. రాష్ట్రంలో నమోదు చేసుకున్న ఓటుపై 'అదీ దొంగ ఓటే' అన్న చర్చ ఉంది. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయాన్నే తన నివాసంగా పేర్కొంటూ ఆయన ఓటు పొందారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆయన ఓటు ఏజీజడ్ 3083045 గుర్తింపు కార్డు నంబరుతో గుంటూరు జిల్లా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 197వ నంబరు పోలింగ్ బూత్ పరిధిలో ఉంది. ఓటర్ లిస్టులో ఆ ఓటు ఇంటి నంబరు 11–1903గా పేర్కొన్నారు. అయితే మంగళగిరి పట్టణ పరిధిలో ఆ ఇంటి అడ్రసు గురించి ఆరా తీస్తే అది జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం అడ్రసేనని స్పష్టమైంది. కొత్తగా ఒక ఇంటి చిరునామాతో ఓటు నమోదు చేసుకోవడానికి కొన్ని నియమ నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని, ఈ లెక్కన ఒక పార్టీ కార్యాలయం అడ్రసుతో ఓటు నమోదు దొంగ ఓటు కిందకే వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల అవగాహన కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా రూపొందించి, జారీ చేసిన వివిధ రకాల నిబంధనావళిలో ఒకటైన.. 'మ్యానువల్ ఆన్ ఎలక్టోరల్ రోల్స్' ప్రకారం కొత్తగా వేరొక అడ్రసుతో ఓటరు నమోదుకు ఇంటి అడ్రసును 'ఆర్డనరీ రెసిడెన్స్' పేరుతో ప్రత్యేకంగా విశదీకరించారు. ఈ అంశంపై గౌహతి హైకోర్టు వెలువరించిన ఒక తీర్పు ప్రకారం ఇంట్రి అడ్రసు అంటే.. శాశ్వతంగా నివాసం ఉండేది అని కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల పుస్తకంలో స్పష్టంగా పేర్కొంది. టెంపరరీ లేదా క్యాజువల్ నివాసంగా అది ఉండకూడదని ఆ నిబంధనలో స్పష్టంగా ఉంది. 'రెగ్యులర్‌గా రాత్రి వేళ నిద్రించే ప్రాంతాన్నే' ఆ వ్యక్తి ఆర్డనరీ రెసిడెన్స్‌గా గుర్తించాలని స్పష్టం చేసింది. కానీ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రైవేట్ హోటల్‌లో బస చేస్తుంటారు. పార్టీ విధుల్లో భాగంగా హైదరాబాద్ నుంచి మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. అలాంటప్పుడు పార్టీ కార్యాలయం ఆయన శాశ్వత నివాసం ఎలా అవుతుందన్న విమర్శలున్నాయి. ఈ లెక్కన మంగళగిరి పార్టీ కార్యాలయం అడ్రసుతో ఆయన ఆరు నెలల ముందు నమోదు చేసుకున్న ఓటు.. దొంగ ఓటు కిందకే వస్తుందని అధికారుల స్థాయిలో చర్చ సాగుతోంది.



ఆ చిరునామాలో పవన్ ఓటు మాత్రమే..

2019 ఎన్నికల్లో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన పవన్ కళ్యాణ్.. తన ఎన్నికల అఫిడవిట్‌లో తన కుటుంబ సభ్యుల వివరాలలో భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయం అడ్రసు 11–1903తో ఇప్పుడు పవన్ తన ఒక్కరి ఓటు మాత్రమే నమోదు చేసుకోవడం విశేషం. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2019 ఎన్నికల సమయంలో విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 91వ పోలింగ్ బూత్‌లో పవన్ తన ఓటు నమోదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయ అడ్రసుకు ఓటును మార్చుకున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

తమ్ముడి బాటలోనే అన్న నాగబాబు

రాష్ట్రంలో పవన్‌కళ్యాణ్ నమోదు చేసుకున్న ఓటు దొంగ ఓటు.. అని చర్చ సాగుతున్న తరుణంలో.. అతని సోదరుడు నాగబాబు కూడా దొడ్డి దారిన రాష్ట్రంలో దొంగ ఓట్ల నమోదుకు పూనుకున్నారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే నాగబాబు మొన్నటి తెలంగాణ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు అంటే 2023 డిసెంబరు 4 తేదీన మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో వడ్డేశ్వరం – రాధా రంగ నగర్‌లోని 5–263 ఇంటి అడ్రసు పేరుతో ఆన్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేశారు. నాగబాబు, ఆయన భార్య, కూతురు నిహారిక, కుమారుడు వరుణ్‌తేజ్ (సినీ నటుడు), కోడలు లావణ్య త్రిపాఠి (సినీ నటి) కలిపి మొత్తం ఆరుగురు ఆ ఇంటి అడ్రసులో నివాసం ఉంటున్నట్లు పేర్కొంటూ ఓట్లు నమోదు ఫారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయితే ప్రాథమిక స్థాయిలో బూత్ లెవల్ అధికారి (బీఎల్‌వో) పరిశీలనలో నాగబాబు గానీ, వారి కుటుంబం గానీ ఆ అడ్రసులో నివాసం ఉండడం లేదని తేలింది. ఈ ఇల్లు జనసేన పార్టీ అభిమానిదని స్థానికులు పేర్కొన్నారు. ఆ తర్వాత కూడ మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓటు నమోదు ప్రక్రియలో భాగంగా నాగబాబు, ఆయన కుటుంబ సభ్యులు తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలంటూ ఆ ఇంటి తలుపులకు నోటీసులు అంటించి వెళ్లారు. అయితే నాగబాబు, ఆయన కుటుంబ సభ్యులందరి తరుపున సంబంధిత అడ్రసులో పేర్కొన్న ఇంటి యజమానే అధికారుల ముందు హాజరైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఇక్కడ నివాసం.. అక్కడ వ్యాపారమట!

అధికారుల విచారణ సమయంలో నాగబాబు తాను తాడేపల్లిలో నివాసం ఉంటున్నానని, అయితే ప్రస్తుతం వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నందున స్వయంగా విచారణకు రాలేకపోయినట్టు తాను సంతకం చేసిన ఒక పేపరు ఆ ఇంటి యజమాని ద్వారా పంపారు. మరో ఇద్దరు ఇలాగే పేపర్‌పై రాసి.. దానిని ఫొటో తీసి ఆ ఇంటి యజమాని ద్వారా పంపారు. మిగిలిన మరో ముగ్గురి నుంచి ఎలాంటి అఫిడవిట్ లేదని తెలిసింది. మొత్తంగా ఆ అడ్రసులో పేర్కొన్న ఇంటి యజమానే నాగబాబు కుటుంబ సభ్యులు ఆరుగురి తరుపున విచారణకు హాజరయ్యారు. ఆ ఇంటి అడ్రసులో నాగబాబు కుటుంబం నివాసం ఉంటడం లేదని అధికారులు నిర్ధారించుకుని, ఆ ఆరుగురి ఓట్లను తిరస్కరించారు. సినీ నటుడిగా, పార్టీ అధ్యక్షుడి హోదా లేదా కీలక బాధ్యతల్లో ఉన్న పవన్‌కళ్యాణ్, నాగబాబు లాంటి వారే తమ సొంత ఓట్ల నమోదు ప్రక్రియలో ఇలా అడ్డదారులు తొక్కడం అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

బల్క్ ఫిర్యాదులు చంద్రబాబు కుట్రే

అర్హుల ఓట్లు తొలగించేందుకు టీడీపీ పన్నాగం

సాక్షి, అమరావతి: విపక్ష నేత చంద్రబాబునాయుడి జీవితమంతా మోసం, కుట్ర, కుతంత్రాలతో నిండిపోయిందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి దుయ్యబట్టారు. లక్షల ఓట్లను తొలగించాలంటూ కోనేరు సురేష్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు బల్క్ ఫిర్యాదు చేయించారని ఆరోపించారు. కోనేరు సురేష్ ఇచ్చిన అబద్ధపు బల్క్ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని తాము డిమాండ్ చేశామన్నారు. టీడీపీ ఉద్దేశపూర్వకంగానే వైఎస్సార్‌సీపీ ఓట్లను టార్గెట్ చేసిందన్నారు. మరోవైపు దొంగ ఓట్ల చేర్పునకూ టీడీపీ పాల్పడుతోందన్నారు. 'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్‌కామ్' పేరుతో చంద్రబాబు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమంగా అర్హుల ఓట్లు తొలగించేందుకు, దొంగ ఓట్ల చేర్పుకు చంద్రబాబు భారీ కుట్ర చేశారని చెప్పారు. ఓటరు కులం, రాజకీయ ప్రాధాన్యత అడిగే హక్కు బాబుకెవరిచ్చారు? అని నిలదీశారు. 'వన్ సిటిజన్.. వన్ ఓట్' అనేది తమ పార్టీ సిద్ధాంతం అని తెలిపారు. ఓటర్ ప్రొఫైల్ సర్వే పేరిట అభ్యంతరకర ప్రశ్నలపై సీఈసీకి ఫిర్యాదు చేశాం అని చెప్పారు. మొత్తం ఆరు అంశాలపై సీఈసీని కలిశామన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సభ్యులను కలిసిన అనంతరం మంగళవారం విజయవాడలోని నోవోటెల్ హోటల్ వద్ద ఆయన ఎంపీ మార్గాని భరత్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే...

గుర్తింపులేని జనసేనకు అవకాశమా?

గుర్తింపులేని పార్టీ జనసేన. సాధారణంగా గుర్తింపు ఉన్న పార్టీలకే ఎన్నికల సంఘాన్ని కలిసి వారి అభ్యంతరాల్ని చర్చించే అవకాశం ఉంటుంది. టీడీపీతో


మీడియాతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి
చిత్రంలో ఎంపీ భరత్

పాటు జనసేన పార్టీకి కూడా సీఈసీని కలిసే అవకాశమిచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తింపులేని జనసేనకు సీఈసీని కలిసే అవకాశం ఎలా ఇవ్వగలిగారని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాము. తెలుగుదేశం పార్టీ ఎన్నికల సంఘాన్ని కోరిన అపాయింట్‌మెంట్ రిక్వెస్టులో జనసేన పార్టీ తమ అలయెన్స్‌గా చెప్పి ఆపార్టీని కూడా అనుమతించాలని కోరింది. ఇప్పటి వరకు జనసేన పార్టీ బీజేపీ అలయెన్స్ పార్టీ అని అందరికీ తెలిసిన విషయమే. జనసేన బీజేపీకి పార్టనరా? టీడీపీకి పార్టనరా? అనేది స్పష్టం చేయాల్సిన అవసరముందని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరాం. రెండు వేర్వేరు పార్టీలతో అలయెన్స్ పెట్టుకున్న గుర్తింపులేని పార్టీ జనసేనను ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు ఎలా అనుమతించారనేదే మా వాదన. జనసేన పార్టీ రాష్ట్రంలోని 175 స్థానాల్లో కేవలం కొన్ని స్థానాల్లో మాత్రమే పోటీకి దిగుతోంది. అలాంటి, గుర్తింపు లేని పార్టీకి కామన్ సింబల్‌గా ఉన్న గాజుగ్లాసు గుర్తును కేటాయించడం కూడా చట్టవిరుద్ధం. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు రెండో అంశంగా నివేదించాం.

బోగస్ ఫిర్యాదుదారుడు కోనేరు సురేష్‌పై చర్యలేవి?

టీడీపీకి చెందిన కోనేరు సురేష్ ఆపార్టీ ఎలక్టోరల్ విభాగంలో పనిచేస్తున్నాడు. అతను డూప్లికేటింగ్, డబుల్ ఎంట్రీస్, నాన్ లోకల్, బోగస్ ఓట్లంటూ ఓ బల్క్ కంప్లయింట్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపాడు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 10 లక్షల పైచిలుకు ఓట్లు బోగస్‌గా ఉన్నాయని, వాటిపై విచారణ చేయాలని సీఈసీకి కూడా ఫిర్యాదు చేశాడు. ఒకే వ్యక్తి రాష్ట్రంలోని 175 స్థానాల్లో 10 లక్షల ఓట్లకు సంబంధించి బల్క్ కంప్లయింట్ ఎలా ఇవ్వగలుగుతారు? దాన్ని ఎన్నికల కమిషన్ ఏ విధంగా స్వీకరిస్తుందని మేము ప్రశ్నిస్తున్నాం. టీడీపీ వ్యక్తి ఇచ్చిన బల్క్ కంప్లయింట్ ఆధారంగా ఎన్నికల అధికార యంత్రాంగం మొత్తం పనిచేస్తుందా? అని మేము అడుగుతున్నాం. ఆ ఫిర్యాదుపై విచారణ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలొచ్చాయి. అయితే, ఆ ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్‌లు చాలా సమయాన్ని వెచ్చించి పరిశీలిస్తే ఏమాత్రం నిజం లేదని తేలింది. దీన్నిబట్టి కోనేరు సురేష్ ఎన్నికల కమిషన్ సమయాన్ని ఎంతగా వృథా చేశాడో అర్థం చేసుకోవాలి. ఈ రకంగా టీడీపీ అబద్ధపు ఫిర్యాదులిచ్చి, విలువైన ఎన్నికల సంఘం సమయాన్ని వృథా చేయడం చట్టవ్యతిరేక చర్యగా పరిగణించాలని సీఈసీ దృష్టికి తీసుకెళ్లాం. కోనేరు సురేష్ ఫిర్యాదు బోగస్ అని తేలింది కాబట్టి అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఈసీని కోరాం.

ఓటర్ ప్రొఫైలింగ్ మాల్‌ప్రాక్టీస్ తీరిది

ఎన్నికల కమిషన్ డ్యాష్‌బోర్డులో ఉన్న డేటాను ఆధారంగా చేసుకుని టీడీపీకి చెందిన 'మై పార్టీ డ్యాష్‌బోర్డ్ డాట్‌కామ్'లో ఓటర్ పేరు, ఊరు, ఇతర చిరునామా, జెండర్, వయసు, కులంతో పాటు అతను సపోర్టు చేసే పొలిటికల్ పార్టీ, మొబైల్ నంబర్ వంటి వివరాలున్నాయి. రాజకీయ పార్టీల వారీగా ఓటర్లను వేరుచేయడమనేది చట్టవిరుద్ధ చర్యగా ఎన్నికల కమిషన్ దృష్టికి తెచ్చాం. టీడీపీ సేకరించిన ఓటర్ డేటా అమెరికాలోని న్యూయార్క్‌లో ఒక సర్వర్ వద్ద స్టోర్ చేస్తున్నారు. అచ్చంగా ఇలాంటి మాల్‌ప్రాక్టీస్ గతంలోనూ టీడీపీ సేవామిత్ర యాప్ ద్వారా సేకరించడం, అప్పట్లో ఆ యాప్‌పై ఎన్నికల సంఘం ఎఫ్ఐఆర్ నమోదు చేయించడం తెలిసిందే. అప్పట్లో టీడీపీకి వ్యతిరేకంగా నమోదైన ఎఫ్ఐఆర్ నంబర్ 174–2019పై కూడా ఎలాంటి పురోగతి లేదన్న విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తెచ్చాం. ఇప్పుడు 'మైపార్టీ డ్యాష్‌బోర్డు డాట్‌కామ్' ద్వారా ఆ పార్టీ చేస్తున్న కార్యక్రమంపై 120(బి), 379, 420, 188 (ఐపీసీ), 72, 66 (ఐటీఏ 2000 యాక్ట్) కింద యాక్షన్ తీసుకోవాలని ప్రధాన ఎన్నికల సంఘాన్ని కోరాం.

'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ'పై ఫిర్యాదు

రాబోయే ఐదేళ్లలో టీడీపీ పథకాల ద్వారా ఓటరు ఎంత మేలు పొందుతాడనే లెక్కలేసి 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ ' అనే ప్రమాణపత్రంతో కూడిన కార్డుల్ని పంపిణీ చేస్తున్నారు. ఇలా దాదాపు 2 లక్షల 40 వేల మందికి ఈ కార్డులందజేతను ఆధారాలతో సహా పట్టుకుని సీఈసీకి ఫిర్యాదు చేశాం.

అసభ్య పదజాలం వాడుతున్న తండ్రీకొడుకులపై చర్యలు తీసుకోవాలి

చంద్రబాబు చేపడుతున్న టీడీపీ కార్యక్రమాల్లోనూ, లోకేశ్ యువగళం పాదయాత్రలోనూ వైఎస్సార్‌సీపీ పైన, మా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పైన అసభ్యకర పదజాలం వాడుతూ దూషించడాన్ని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకొచ్చాం. ఆ తండ్రీకొడుకులపై ఇండియన్ పీనల్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద క్రిమినల్ యాక్షన్ తీసుకోవాలని కూడా కోరాం. లోకేశ్ ఓ ఎర్రబుక్కు చూపిస్తూ, 'టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసే అధికారుల పేర్లు ఈ ఎర్రబుక్కు (రెడ్‌బుక్)లో ఎక్కించి.. అధికారంలోకి రాగానే వారిని జైళ్లకు పంపుతాను' అంటూ బెదిరిస్తున్నారు.

▲ నిజానికి ప్రభుత్వ అధికారులు ఏ పొలిటికల్ పార్టీకి పనిచేయరు. అధికారులెప్పుడూ బ్యాలెన్సింగ్‌గానే పనిచేస్తారు. అలాంటి అధికారులను జైళ్లకు పంపుతానంటూ భయభ్రాంతులకు గురిచేయడం చాలా సీరియస్‌గా తీసుకోవాల్సిన విషయం. ఇదే విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం.

పార్లమెంట్ ఎన్నికలు ఉభయరాష్ట్రాల్లో ఒకేరోజు జరపాలి

ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికలు ఒకే రోజున నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరాం. ఓటర్ల జాబితాల సవరణల్లో టీడీపీ చాలా దొంగపనులు చేస్తోంది. చంద్రబాబు అధికారంలోకొచ్చిన ప్రతీసారి మోసపూరిత, కుట్రపూరితమైన విధానాలతోనే ఎన్నికల ప్రక్రియను నడిపించారు. ఇప్పుడు అలాంటి దొంగపనులకు శ్రీకారం చుట్టాడు కాబట్టి మేం కేంద్ర ఎన్నికల సంఘాన్ని అప్రమత్తం చేస్తున్నాం.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లే టార్గెట్

ఓటర్ల జాబితాలపై టీడీపీ రోజుకో అబద్ధంతో అటు ఓటర్లనూ, ఇటు ఎన్నికల సంఘాన్ని తప్పుదోవబట్టిస్తోంది. కోనేరు సురేష్ ఫిర్యాదుపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించి మూడు జిల్లాల సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా తీసుకున్నాం.

- కర్నూలు జిల్లాలో సురేష్ ఫిర్యాదు ప్రకారం 67,370 బోగస్ ఓట్లు ఉన్నాయి. అయితే, వీఆర్వోలు వెరిఫై చేశాక వాటిల్లో 59,054 ఓట్లు సక్రమంగా ఉన్నట్లు తేలింది. అంటే, 87 శాతం నిజమైనవి. మిగతా ఓట్లు ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గం పరిధిలోకి మారిన వారివిగా గుర్తించారు.
- అన్నమయ్య జిల్లాలో 40,358 బోగస్ ఓట్లు ఉన్నట్టు ఫిర్యాదు చేస్తే, వాటిలో 25,097 మంది ఓటర్లు స్థానికంగానే నివాసం ఉంటున్నట్లు తేలింది. అంటే, 62 శాతం ఓట్లుకు సంబంధించి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు అబద్ధం.
- విశాఖపట్నం జిల్లాలో 38,872 ఓట్లు బోగస్‌వి అని టీడీపీ ఫిర్యాదు చేస్తే.. వాటిలో 26,123 ఓట్లు జెన్యూన్‌గా ఉన్నట్లు తేలింది. అంటే 67 శాతం ఓట్లు వాస్తవమైనవే.
- ఒకే వ్యక్తి ఇచ్చే బల్క్‌కంప్లయింట్‌లు స్వీకరించరాదని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరాం.

టీడీపీ ఇల్లీగల్ ఓటర్ ప్రొఫైలింగ్

వైఎస్సార్‌సీపీ తరఫున మేం 14 డిసెంబర్ 2023న కేంద్ర ఎన్నికల సంఘానికి ఒక ఫిర్యాదు ఇచ్చాం. టీడీపీ ఇల్లీగల్ ఓటర్ ప్రొఫైలింగ్ చేస్తోందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాం. ఓటరు కులమేంటి? మతం ఏంటి? గతంలో ఏ రాజకీయ పార్టీకి ఓటేశావు? రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటేస్తావు? అని అడిగే హక్కు రాజ్యాంగం ప్రకారం ఎవరికీ లేదు. టీడీపీ మాత్రం ఈ విధమైన ఓటర్ ప్రొఫైలింగ్‌కు పాల్పడుతుందనే విషయాన్ని గతంలోనే ఎన్నికల సంఘం దృష్టికి తీసుకొచ్చాం.

4.36 లక్షల డూప్లికేట్ ఓట్లను గుర్తించాం

ఓటర్ల పేర్లలో చిన్న అక్షరాలు మార్చి స్థానికంగా కాకుండా ఇతర ప్రాంతాల్లో నివాసమున్నట్లుగా జాబితాలో ఓట్లను చేర్చే కార్యక్రమం టీడీపీ చేస్తోంది.తండ్రిపేరు లేదా భర్త పేరు మార్చి డూప్లికేట్ ఓట్లను ఆ పార్టీ తయారు చేయడానికి తెగించింది. తెలంగాణలో ఉన్న ఓట్లను కూడా ఏపీ ఓటర్ల జాబితాలోకి తీసుకొచ్చే మాల్‌ప్రాక్టీస్ జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 4,36,268 ఓట్లు తెలంగాణ ఓటర్ల జాబితాలోనూ ఆంధ్రాలోనూ డూప్లికేటింగ్ ఓట్లుగా కనిపిస్తున్నాయి. వీటి వివరాల్ని ఆధారాలతో సహా సీఈసీకి అందజేసి, వీటన్నింటినీ జాబితా నుంచి తొలగించాల్సిందిగా కోరాం.

తెలంగాణ ఓట్ల నమోదుకు టీడీపీ ప్రత్యేక శిబిరాలు

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయినందున, అక్కడున్న ఏపీ సెటిలర్స్‌తో ఆంధ్రా ఎన్నికల్లో ఓటు వేయించేందుకు టీడీపీ వ్యూహం పన్నింది. అందులో భాగంగా ప్రత్యేకంగా తెలంగాణలో ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో ఓట్ల చేర్పులు జరుగుతున్నాయి. టీడీపీ అనుకూల సామాజికవర్గ ఓటర్లను తెలంగాణ జాబితాలో తొలగించకుండానే ఏపీలో ఓటు హక్కు కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ విషయాన్ని కూడా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకొచ్చాం.

లోకేశ్ 'రెడ్‌బుక్' బెదిరింపులపై విచారణ జరపాలి

సాక్షి, అమరావతి: రెడ్ బుక్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, యంత్రాంగాన్ని బెదిరిస్తూ భయోత్పాతానికి గురి చేస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని వైఎస్సార్‌సీపీ కోరింది. చంద్రబాబు, లోకేశ్, టీడీపీ నేతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి అభ్యంతరకర, అసభ్యకర వ్యాఖ్యలు చేయకుండా నిరోధించాలని కోరింది. చంద్రబాబు, లోకేశ్ ప్రభుత్వ అధికారులకు.. ప్రధానంగా పోలీసు అధికారులకు రాజకీయ దురుద్దేశాలు అంటగడుతూ వారిని బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాష్ట్రంలో సామరస్యపూరిత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారని కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లింది. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, లోక్‌సభలో పార్టీ విప్ మార్గాని భరత్‌తో కూడిన వైఎస్సార్‌సీపీ బృందం కేంద్ర ఎన్నికల కమిషన్‌తో విజయవాడలో మంగళవారం సమావేశమైంది. ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేశ్ అప్రజాస్వామిక విధానాలపై కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. వారు ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని బెదిరిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని తెలిపింది. రెడ్‌బుక్ పేరుతో లోకేశ్ బెదిరింపులకు పాల్పడుతూ చేసిన ప్రసంగాలు, బహిరంగ సభల్లో చంద్రబాబు, లోకేశ్ ప్రసంగాలు, మీడియా, సోషల్ మీడియాలో టీడీపీ దుష్ప్రచారానికి సంబంధించిన ఆధారాలను కూడా ఫిర్యాదుతోపాటు సమర్పించింది. ఆ ఫిర్యాదులో పేర్కొన్న ప్రధాన అంశాలు ఇవీ..

అధికారులను బెదిరించి లొంగదీసుకునేందుకు కుట్ర

- సీఎం జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు, లోకేశ్ అభ్యంతరకర వ్యాఖ్యలు
- రాష్ట్రంలో సామరస్య పరిస్థితులను దెబ్బతీసేందుకు పన్నాగం
- దురుద్దేశపూర్వకంగా ఉన్నతాధికారులపై నిరాధారణ ఆరోపణలు
- చంద్రబాబు, లోకేశ్, టీడీపీ నేతలను కట్టడి చేయండి
- కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ
- ఆధారాలతో సహా ఫిర్యాదు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, ఎంపీ మార్గాని భరత్

➡ 2019 ఎన్నికల్లో అఖండమైన ప్రజా మద్దతుతో ప్రజాస్వామ్యబద్ధంగా అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా టీడీపీ కుట్రలు పన్నుతోంది. టీడీపీ అధికారం కోల్పోయిందన్న దుగ్ధతో చంద్రబాబు, లోకేశ్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి అసభ్యకర, అవమానకర వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్రంలో సామరస్య పూరిత వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేసేందుకు అవకాశం లేకపోవడంతో వారిద్దరూ అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్నారు. చంద్రబాబు, లోకేశ్, ఇతర టీడీపీ నేతలు బహిరంగ సభలు, మీడియా సమావేశాల్లో సీఎం వైఎస్ జగన్ వ్యక్తిత్వానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజల మనసులను కలుషితం చేయాలన్న కుట్రతో సీఎం వైఎస్ జగన్‌ను వ్యక్తిగతంగా దూషిస్తున్నారు.

➡ చంద్రబాబు జిల్లాల పర్యటనలో, లోకేశ్ పాదయాత్రలోనూ దురుద్దేశపూర్వకంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, అధికార యంత్రాంగంపై నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్న అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అధికారుల పేర్లను ఓ రెడ్‌బుక్‌లో రాస్తున్నానని, అధికారంలోకి వస్తే వారి సంగతి తేలుస్తానని లోకేశ్ బహిరంగ సభల్లో హెచ్చరించారు. మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలలోనూ రెడ్‌బుక్ పేరుతో అధికారులపై బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రధానంగా పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని హెచ్చరికలు జారీ చేస్తుండటం అధికార యంత్రాంగాన్ని కలవరపరుస్తోంది. బదిలీ అయి వెళ్లిపోతామని అధికారులు భావిస్తే పొరపాటేనని, వారు ఎక్కడ ఉన్నా వదిలి పెట్టేదేలేదంటూ రెడ్‌బుక్‌ను చేతిలో పట్టుకుని చూపిస్తూ మరీ లోకేశ్ తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు.

➡ సమర్థవంతమైన పరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రభుత్వ అధికారులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారులు పూర్తి స్వేచ్ఛతో, సంతోషంగా, సమర్థవంతంగా విధులను నిర్వర్తిస్తున్నారు. పోలీసు అధికార యంత్రాంగం పూర్తిగా చట్టబద్ధంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలు, సామరస్య పూరిత వాతావరణాన్ని పరిరక్షిస్తోంది. అటువంటి ఉన్నతాధికారులు, ప్రత్యేకించి పోలీసు అధికారులపై చంద్రబాబు, లోకేశ్ నిరాధార ఆరోపణలు చేస్తూ వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. అందుకోసం ప్రత్యేక బృందాలను నియమించి మరీ కుట్రపూరిత విధానాలతో పోలీసు అధికారులు విధులను సక్రమంగా నిర్వర్తించకుండా ఆటంకాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారు. పోలీసు అధికారులపై ప్రైవేటు ఫిర్యాదులు ఇప్పిస్తూ, అనుకూల మీడియాలో వారిపై దుష్ప్రచారం చేయిస్తున్నారు. టీడీపీకి కొమ్ము కాసే పత్రికలు, ఛానళ్లలో అధికారులపై తీవ్రస్థాయిలో విష ప్రచారం చేస్తూ వారిని బెదిరిస్తున్నారు.

➡ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శిగా చంద్రబాబు, లోకేశ్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కానీ రాజకీయ దురుద్దేశంతో కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న వారిద్దరినీ కట్టడి చేయాలని కోరుతున్నాం. దేశంలో ప్రజాస్వామ్య విలువలు, సంప్రదాయాలను పాటించాల్సిన బాధ్యత టీడీపీపై ఉంది. కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సమాజంలో సామరస్యపూరిత పరిస్థితులను టీడీపీ దెబ్బతీస్తోంది. ప్రజాస్వామ్య ప్రమాణాలను ధ్వంసం చేసేలా లోకేశ్ వ్యవహరిస్తున్నారు.

కోర్టు ద్వారా లోకేశ్‌కు నోటీసులు ఇవ్వండి

ఆదేశించిన ఏసీబీ న్యాయస్థానం



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలపై నమోదైన కేసుల దర్యాప్తును ప్రభావితం చేసేలా, కీలక సాక్షులను బెదిరించేలా వ్యాఖ్యలు చేసిన కేసులో నారా లోకేశ్‌కు నోటీసులు అందించాలని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం మంగళవారం కోర్టు అధికారులను ఆదేశించింది. నోటీసులు తీసుకునేందుకు నిరాకరించిన లోకేశ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రెడ్ డైరీ పేరుతో కీలక సాక్షులను బెదిరిస్తున్న లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్ విచారణ సందర్భంగా కీలక ఆదేశాలు జారీ చేసింది. గతంలో 41ఏ నోటీస్ కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌బుక్‌లో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో బెదిరించడం కలకలం రేపింది.

'ఉద్దేశపూర్వకంగానే నోటీసులు తీసుకోవడం లేదు'

కాగా.. ఈ కేసులకు సంబంధించి గతంలో విధించిన ఆంక్షలను ఉల్లంఘించడంతోపాటు కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్న లోకేశ్‌ను అరెస్ట్‌కు అనుమతి కోరుతూ సీఐడీ విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారించిన న్యాయస్థానం ఈ అంశంలో లోకేశ్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఆయన్ని అరెస్ట్ చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఆ నోటీసుల్లో పేర్కొనాలని తెలిపింది. కాగా.. ఆ నోటీసులు అందించేందుకు వెళ్లిన సీఐడీ అధికారులకు లోకేశ్ అందుబాటులోకి రాలేదు. రెండుసార్లు ఆయన నివాసానికి వెళ్లినా అధికారులను కలిసేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేయలేదు. దాంతో నోటీసులను పోస్టులో లోకేశ్ నివాసానికి పంపారు. ఆ నోటీసులను తీసుకునేందుకు లోకేశ్ నిరాకరించారు. నోటీసులను లోకేశ్ మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించినా కూడా ఆయన స్పందించలేదు. దాంతో ఈ విషయాన్ని సీఐడీ తరఫు న్యాయవాదులు ఏసీబీ న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. లోకేశ్ ఉద్దేశపూర్వకంగానే నోటీసులను తీసుకోవడం లేదని వివరించారు. ఈ అంశంపై తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం లోకేశ్‌కు స్వయంగా నోటీసులు అందించాలని కోర్టు అధికారులను ఆదేశించింది.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 10-1-2024





అల్లదిగో సంక్రాంతి

బస్సెక్కి వెళ్లాలా?
కారెక్కి వెళ్లాలా?
ఏ రోజు వెళ్లాలి..
ఎప్పుడు రావాలి...
సెలవు అడగాలా వద్దా?
డబ్బులు సమకూరాయా లేదా?
సంక్రాంతి వచ్చేసింది.
కొందరు మాత్రం చివరి వరకూ
ఏ విషయం తేల్చకుండా
హడావిడిగా ప్రయాణం పెట్టుకుని
ట్రబుల్స్‌లో పడతారు.
వద్దు. సంక్రాంతికి ఊరెళ్లేందుకు
హాయిగా ప్లాన్ చేసుకోండి.
సంతోషంగా పండక్కు పదండి.

టికెట్లు తీశారా? లగేజ్ సర్దారా?

పండగని తెలుసు. వెళ్లాలనీ తెలుసు. కాని ఏదీ తెమల్దు. నెలా రెండు నెలల ముందు భార్యాభర్తలు కూచుని మాట్లాడుకుని కచ్చితంగా ఫలానా డేట్‌కు బయలుదేరి వెళ్దాం అనుకుని ఉంటే ట్రైన్ టికెట్లు ఉంటాయి. తత్కాల్‌లో చూసుకోవచ్చులే అనుకుంటారు. బస్సులు దొరుకుతాయిలే అనుకుంటారు. అంతగాకుంటే కారుంది కదా పోదాం అనుకుంటారు. అనుకోవడం ఎందుకు? ఖరారు చేసుకోకపోవడం ఎందుకు? చివరి నిమిషంలో హైరానా పడటం ఎందుకు?

■ ఎప్పుడు? ఎక్కడకు?

సంక్రాంతి తెలుగువారి ముఖ్యమైన పండుగ. అయినవారితో కలిసి చేసుకుంటే సంతోషాన్ని పెంచే పండగ. అయితే ఈ అయిన వారు ఎవరు అనేది ఒక్కోసారి స్పష్టత రాదు. భార్యకు పుట్టింటికి వెళ్లాలని ఉండొచ్చు. భర్తకు తన సొంతూరికి వెళ్లాలని ఉండొచ్చు. ఈ పండక్కు ఈ ఊరు... మరో పండక్కి ఆ ఊరు అని టక్కున నిశ్చయించుకుంటే సగం చింత ఉండదు. కాని తేల్చరు. మరికొన్ని కారణాలు ఉంటాయి.

■ భర్త గమనించాల్సినవి

- భార్య పుట్టింటికి వెళితే ఎవరికో ఏవో కానుకలు ఇచ్చుకోవాలనుకోవచ్చు. తల్లిదండ్రులకు బట్టలు తీసుకెళ్లాలనుకోవచ్చు. మేనకోడలికి పట్టీలు తీసుకెళ్లాలనుకోవచ్చు. వీటికి బడ్జెట్ కేటాయించబడిందా? అవి లేక ఆమె ఏ విషయం తేల్చకుండా ఉందా?
- భార్య అత్తింటికి వెళితే అక్కడ పనులన్నీ నెత్తిన పడే ప్రమాదం ఉందా? మరో కోడలి ఎదుట ఆర్థిక స్థితిగతుల విషయంలో ఏమైనా చిన్నబుచ్చుకునే ప్రమాదం ఉందా? ఈ సంవత్సరం నేను ఈ నగ చేయించుకున్నాను అనంటే నేను ఏమీ చేయించుకోలేదు వంటి జవాబు చెప్పాలనుకోవడం లేదా? అందుకే అత్తారింటికి వెళ్లడం గురించి ఆమె ఏ విషయం మాట్లాడటం లేదా?

■ భార్య గమనించాల్సినవి

పుట్టింటి నుంచి అల్లుడికి సరైన పిలుపు అందిందా? అక్కడకు వచ్చాక మంచి మర్యాదే దొరుకుతుందనే నమ్మకం ఉందా? తోడల్లుడు, బావమరిది... వీళ్లు ఆదరంగా చూసే వీలుందా? పండక్కు వస్తే భర్త ఏదైనా కానుక ఆశిస్తాడా? మంచి బట్టలైనా పెట్టాలని కోరుకుంటాడా? అలా కోరుకుంటున్నట్టయితే ఆ కోరిక నెరవేర్చే స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారా? తీరా వచ్చాక అలకలు ఏర్పడతాయా? అందుకే అతను అత్తగారిల్లు అనే మాట ఎత్తడం లేదా?

■ టికెట్లు.. పాట్లు

- తాత్కాల్‌ను ఇలాంటి టైమ్‌లో నమ్ముకోలేము.
- ఆర్టీసీ బస్సులు ఎన్ని స్పెషల్స్ వేసినా సీటు దొరుకుతుందన్న గ్యారంటీ లేదు.
- ప్రయివేటు ట్రావెల్స్ డబుల్ రేట్ చెప్తాయి. ఇంకా ఎక్కువే చెప్పొచ్చు.
- సొంత కారు ఉన్నా పండగ ముందు రోజు బయలుదేరితే టోల్‌గేట్ల దగ్గరే సమయం సరిపోతుంది.
- ముందే టికెట్లు బుక్ చేసుకోకపోవడం వల్ల తత్కాల్ చార్జీలు, ప్రయివేట్ బస్సుల చార్జీలు భరించలేక భార్యాభర్తలు టికెట్లు తీసుకుని పిల్లలకు తీసుకోకుండా ఫైన్లు కట్టి లేదా ఒళ్లు కూచోబెట్టుకుని ప్రయాణం చేస్తూ ఒకరినొకరు తిట్టుకుంటూ ఉండటం అవసరమా?
- మరో విషయం ఎలాగోలా చేరుకుంటే ఎలాగోలా వెనక్కు రావచ్చు అనుకుంటారు. కాని తిరుగు ప్రయాణానికి అసలు టికెట్లు దొరకవు. దాంతో సెలవు పొడిగించుకుని, సద్ది బంధువుగా మారి ఇబ్బంది పడటం అవసరమా?

■ ఇప్పుడైనా ప్లాన్ చేయండి

ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ. శనివారం ప్రయాణం అనుకోకండి. గురువారం ఉదయం నుంచి రైళ్లు, బస్సులు, కారు ప్రయాణం ప్లాన్ చేసుకుంటే చాలా సమస్యలు తీరుతాయి. పోనీ శుక్రవారం తెల్లవారు జాము నుంచి బయల్దేరండి. డబ్బు ఈ ఒక్కసారికే దుబారా అనుకుంటే కారు, ప్రయివేటు బస్సులో ప్రయాణం ఎంజాయ్ చేసేలా వెళ్లండి. పండగ మూడ్‌తో వెళ్లండి.

వెళ్లే ముందు భార్య తరఫు ఇంటికి వెళ్లినా, భర్త తరఫు ఇంటికి వెళ్లినా మన ఆర్థిక స్థితి మనది... మన ఆనంద స్థితి మనది... వేరొకరితో పోటీ వద్దు... తల్లిదండ్రులను అత్తామామలను ఇబ్బంది పెట్టకుండా సంతోషంగా గడిపి వద్దాం అనుకుని బయలుదేరండి.

భావోద్వేగాల కుదుపులో తనను తాను కోల్పోయింది.
అయితేనేం... తన సమస్య ఏంటో తాను గుర్తించడమే కాదు...
దాని నుంచి బయటపడి తనకు తానుగా నిలబడి
సర్టిఫైడ్ ఎమోషనల్ క్లారిటీ కోచ్‌గా, పబ్లిక్ స్పీకర్ గా మారి
కెరీర్, రిలేషన్ షిప్ సమస్యల నుంచి యువతకు పరిష్కారాలు సూచిస్తోంది.
కార్పొరేట్ కంపెనీలతో కలిసి ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఇస్తోంది.
చదువుకు మానవసంబంధాలలో సమతుల్యతకు ఏవిధమైన సంబంధం లేదని,
తన జీవితం నేర్పిన పాఠం ద్వారా ఎంతోమంది జీవితాల్లో
వెలుగులు నింపుతోంది.
భావోద్వేగాల బ్యాలెన్స్ నేటి సమాజంలో ఎంత అవసరమో
యువతకు తెలియజేయడానికి ఢిల్లీ నుంచి గల్లీ వరకు
అవేర్‌నెస్ క్లాస్‌లు నిర్వహించడానికి దేశమంతా తిరుగుతోంది.
తన జీవితమే ఒక పాఠంలా నాలుగు పదుల వయసు దాటిన
నిధి సైని ఇలా మనముందుంచుతోంది.

అవేర్‌నెస్ టీచర్



నిధి సైని

“నా జీవితంలోని 21 ఏళ్ల విభిన్నరంగాలకు చెందిన వ్యక్తులతో కలిసి పనిచేశాను. నాలో ఆత్మబలాన్ని పెంచుకోవడానికే కాదు నాతో కలిసి నడిచే వారి కోసం దేశమంతటా ప్రయాణిస్తున్నాను. అత్యంత క్లిష్ట సమయాల్లో కూడా నా జీవన సారాన్ని కోల్పోని స్త్రీగా నన్ను నేను మలుచుకున్నాను. మీరూ మీలో ఉన్న ఆ ప్రత్యేక సారాన్ని కనుగొనే ప్రయాణం చేయండి. నేను మీకు తోడుగా ఉన్నాను. నేను అందించే వివిధ ప్రోగ్రామ్‌ల ద్వారా నాతో కలిసి ప్రయాణించే వ్యక్తుల జీవితాల్లో దీర్ఘకాలికమైన మార్పును సృష్టించాలనుకుంటున్నాను.

పెద్ద తప్పు..

నేను పుట్టి పెరిగింది ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో. డిగ్రీ చదువుకు ఢిల్లీకి వెళ్లాను. చదువు పూర్తయ్యాక ఇంట్లో నా పెళ్లి గురించి చర్చలు మొదలయ్యాయి. కానీ, పెళ్లి వద్దని పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో చేరాను. అక్కడ ఓ అబ్బాయిని ప్రేమించడం నా జీవితంలో అతి పెద్ద తప్పుగా మారింది. మా అమ్మనాన్నలు మా ప్రేమను అంగీకరించలేదు. అయినా, వారిని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి పెళ్లికి ఒప్పించాను. కానీ, పెళ్లికి రెండు రోజుల ముందు ఆ బంధం నుంచి తప్పుకోవాలనుకున్నాను. నేను ఇష్టపడినప్పటికీ పెళ్లి చేసుకోకపోవడమే మంచిదనపించింది. కానీ, ఇంట్లో అందరిలోనూ అలజడి. సమాజం ఏమనుకుంటుందో అనే ఆందోళన. దీంతో ఏమీ తేల్చుకోలేకపోయాను. పెళ్లయిపోయింది.

ఎగిరిపోయిన ప్రేమ

పెళ్లయిన ఏడాదిలోపే ఈ బంధం ఎక్కువ కాలం ఉండదని అర్థమైంది. ఒకనాడు ఎవరూ ఒప్పుకోకపోయినా పారిపోయి పెళ్లి చేసుకోవాలనుకున్న నేనే, ఇలా మారిపోవడం ఆశ్చర్యమేసింది. నచ్చిన అబ్బాయిని పెళ్లి చేసుకున్నందుకు నా బంధంలో ఉన్న ఇబ్బందుల గురించి మా తల్లిదండ్రులకు కూడా చెప్పలేకపోయాను. అప్పటికే తమ్ముడి జీవితంలో జరుగుతున్న అల్లకల్లోలం వల్ల అమ్మనాన్నలు బాధపడుతున్నారు. అందుకే, కొంత కాలం మౌనంగా ఉండిపోయాను.



వర్క్‌షాప్‌లో

అందమైన బహుమతి..

పిల్లలు కావాలని నా భర్త కోరుకోవడంతో మా వివాహ బంధం బలంగా మారడానికే అనుకున్నాను. ఇక అతన్ని ఇబ్బంది పెట్టకూడదనుకున్నాను. రోజులు గడుస్తున్నా పరిస్థితి మెరుగుపడలేదు. కానీ, ఈ సమయంలో జీవితం నాకు కొడుకు రూపంలో అందమైన బహుమతిని ఇచ్చింది. అప్పటి వరకు సాదాసీదాగా ఉన్న నా ప్రపంచం నా కొడుకు చుట్టూ అల్లుకుపోయింది. అయితే, మా భార్యభర్తల మధ్య భావోద్వేగ బంధం లేకుండా పోయింది.

చావే మేలు అనుకున్నాను

ఒకరోజు నా భర్త, కొడుకుతో కలిసి బయటకు వెళ్లాం. నేను డ్రైవింగ్ చేస్తున్నాను. నా భర్త నాతో గొడవపడుతూనే ఉన్నాడు. కొడుకు వెనకసీట్లో కూర్చొని ఇదంతా చూస్తున్నాడు. రెడ్‌లైట్ దగ్గర కారు ఆగగానే వెనక్కి తిరిగి ఆ పిల్లవాడి వైపు చూశాను. వాడి మొహం చూసి నా గుండెల్లో గుబులు పుట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో నా కొడుక్కి మంచి జీవితాన్ని ఇవ్వలేనని నిర్ణయించుకున్నాను. విడిపోవడమే మంచి నిర్ణయం అనుకున్నాను. సమాజం వెక్కిరింపులు, ప్రశ్నల మధ్య నా సమాధానం ఒక్కటే. ఈ బిడ్డ కోసమే ఈ పెళ్లిలో ఉండకూడదనుకున్నాను అని చెప్పేదాన్ని. కానీ, మా తల్లిదండ్రులు 'మా కూతురు విడాకులు తీసుకుందని' సమాజంలో చెప్పుకోవడానికి సిగ్గుపడేవారు. ఈ విషయం నన్ను ఎంతగానో బాధించింది. నా ఆత్మవిశ్వాసం ప్రతిరోజూ దెబ్బతింటూనే ఉంది. ఓ రోజు ఆవేదనతో రాత్రంతా నిద్రపోలేదు. ఫ్యాన్ వైపు చూస్తూ ఉండిపోయాను. ఉరివేసుకోవాలనుకున్నాను. అప్పుడు నా చూపు నిద్రపోతున్న నా కొడుకు ముఖం మీదకు వెళ్లింది. అమాయకమైన వాడి ముఖం చూసి, తిరిగి జీవించాలనుకున్నాను. ప్రపంచంలో ఉన్నదంతా నా బిడ్డకు ఇస్తాను అని బలంగా అనుకున్నాను.

సున్నా నుంచి ..

మొదట ఏం చేయాలో తెలియలేదు. నేనున్న ఇంటి సెల్లార్‌లో ఇంటీరియర్ డెకరేషన్ బిజినెస్ ప్రారంభించాను. ఆ వ్యాపారం విజయవంతం కావడానికి చాలా కష్టపడ్డాను. అదృష్టవశాత్తూ వ్యాపారం ఊపందుకుంది. కానీ, సంతోషంగా లేను. దీంతో ఆ వ్యాపారాన్ని మూసేయాలనుకున్నాను. నా నిర్ణయం విని అంతా ఆశ్చర్యపోయారు.

మళ్లీ ప్రేమలో..

ఏం చేయాలో తెలియకపోతే టీచర్ జాబ్ చేయమని మా నాన్న సలహా ఇచ్చారు. అలా విద్యా రంగంలోకి ప్రవేశించాను. నాకు తెలియకుండానే చాలా సంతోషంగా మారిపోయాను. వీటన్నింటి మధ్య మళ్లీ ప్రేమలో పడ్డాను. మా బంధం పదేళ్లపాటు సంతృప్తికరంగా.. సంతోషంగా కొనసాగింది. కానీ, ఆ తర్వాత అతను నన్ను వదిలేసి కెరీర్‌ను ఎంచుకున్నాడు. నా జీవితంలో మళ్లీ చీకటి కాలం. ఈ సంబంధం నన్ను చాలా అయోమయ స్థితికి చేర్చింది. ఆ ప్రభావం నుంచి బయటపడటం కష్టంగా మారింది. ఏమీ అర్థం కాలేదు. సైకియాట్రిస్ట్‌ను కలిసి, మందులు తీసుకుంటూ రోజులు గడిపాను.

ఎందుకు నవ్వడం లేదు...

ఒకరోజు నా కొడుకు 'అమ్మా, ఎందుకు నువ్వు నవ్వడం లేదు?' అడిగాడు. ఆ మాట నాపైన చాలా ప్రభావాన్ని చూపింది. నేను చాలా నిస్సహాయ తల్లిగా మారిపోయానా అనిపించింది. నేను బలహీనంగా మారితే నా బిడ్డ కూడా బలహీనం అవుతాడు. అందుకే, నన్ను నేను మార్చుకోవాలనుకున్నాను. మళ్లీ నన్ను నేను సంసిద్ధం చేసుకోవడం మొదలుపెట్టాను. ఈ ప్రయాణంలో నాకు నేను ఏవిధమైన ప్రాముఖ్యతనూ ఇచ్చుకోవడం లేదని అర్థమైంది. నా జీవితంలో చాలా సాధించాను. కానీ, నా సొంత విజయాలను నేను తక్కువ అంచనా వేస్తున్నాను. ఇలాంటి ఆలోచనలు నాపై పనిచేస్తున్నప్పుడు పోయిన వెలుగు నా జీవితంలోకి తిరిగి వచ్చింది. ఇప్పుడు నేను నిధిని. ఒక యువకుడికి గర్వకారణమైన తల్లిని. నాదైన జీవితంలో మైండ్‌సెట్ ట్రాన్స్‌ఫార్మేషన్ కోచ్‌గా నా నిజమైన జీవిత లక్ష్యాన్ని కనుగొన్నాను' అని చెబుతుంది నిధి సైని.

యూత్ పల్స్

టెక్నాలజీ ప్రేమికులైన
యువతరం తాజా ఆసక్తి... వెబ్3
విశాలమైన వెబ్ 3 స్పేస్‌లో స్టార్టప్‌ల నుంచి ఉద్యోగాల వరకు
ఎన్నో అవకాశాలు ఉన్నాయి.
బ్లాక్ చెయిన్ సాంకేతికత ఆధారిత వెబ్3 యువత కోసం
ఎన్నో ద్వారాలను తెరవనుంది. స్వయంప్రతిపత్తిని అందించనుంది...



వెల్‌కమ్ టు వెబ్3 వరల్డ్

ఒకప్పుడు...

'మాకు వెబ్‌సైట్‌తో పనిలేదు. ప్రింట్ మీడియా టీవీ చాలు'

'ఇ-కామర్స్‌తో పనిలేదు. ఇన్-స్టోర్ చాలు' 'మొబైల్ వెబ్‌సైట్, యాప్‌లతో పనిలేదు'

'వెబ్3 స్ట్రాటజీ మాకు అవసరం లేదు' అన్నట్లుగా ఉండేది.

90ల నుంచి 2020 వరకు సాంకేతికతకు సంబంధించిన అభిరుచులు, అభిప్రాయాలలో ఎంతో మార్పు వచ్చింది. 'మాకు అవసరం లేదు' అన్నచోటే 'మాకు తప్పనిసరిగా అవసరం' అనే మాట వినిపిస్తోంది. వెబ్3 సాంకేతిక విషయంలోనూ ఇదే మార్పు చోటు చేసుకుంది. 'ఇలా వచ్చి అలా వెళ్లి పోయే ట్రెండ్ ఇది' అనుకున్న కంపెనీలు కూడా వెబ్3 సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. యూత్‌తో కనెక్ట్ కావడానికి 'వెబ్3' అనేది బలమైన సాధనం అని నమ్ముతున్నాయి. వెబ్3 మార్కెటింగ్‌పై రకరకాల కోణాలలో ఆలోచిస్తున్నాయి. వెబ్3 బ్రాండ్స్ జెన్ జెడ్ మార్కెట్‌ను చేజిక్కించుకోవడానికి సంప్రదాయ విధానాలకు భిన్నంగా కొత్తదారిలో పయనిస్తున్నాయి.

బ్లాక్‌చెయిన్-బేస్డ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్, వర్చువల్ వరల్డ్స్ అభివృద్ధి వల్ల డిజిటల్ స్పేస్‌లో ఎక్కువ సమయం గడుపుతోంది యువతరం. వెబ్-3 బేస్డ్ గేమ్స్, వర్చువల్ వరల్డ్స్ యువ ప్లేయర్స్‌కు అటానమస్, ఓనర్‌షిప్, మానిటైజేషన్ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లాంటి సెంట్రలైజ్‌డ్ ప్లాట్‌ఫామ్స్ మీద ఆధారపడకుండా కంటెంట్ క్రియేట్ చేయడానికి, షేర్ చేయడానికి, కంటెంట్‌ను మానిటైజ్ చేయడానికి వెబ్3 టెక్నాలజీ ఉపయోగపడుతుంది.

'వెబ్3 విశ్వరూపాన్ని మనం ఇంకా చూడనప్పటికీ కొత్తరకం అవకాశాలతో క్రియేటర్‌లను ఆకట్టుకుంటోంది. మధ్యవర్తుల అవసరం లేకుండానే డైరెక్ట్-కన్స్యూమర్ ఇంటరాక్షన్స్‌కు వీలు కల్పిస్తుంది. సంప్రదాయ పద్ధతుల కంటే భిన్నంగా ఆదాయ మార్గాలను విస్తరించుకోవచ్చు. స్థూలంగా చెప్పాలంటే వెబ్3 అనేది సంప్రదాయ మోడల్స్‌ను సవాలు చేసేలా ఉంటుంది. క్రియేటర్‌లు ఒక అడుగు ముందుకు వేసేలా చేస్తుంది' అంటున్నాడు ఏఐ పవర్డ్ క్రియేటర్ టెక్ కంపెనీ 'యానిమెటా' సీఇవో దేవ దత్తా.

'వెబ్3 జెన్-జెడ్, మిలీనియల్స్‌ను ఆకట్టుకుంటుంది. వెబ్3 నుంచి మరిన్ని ప్రయోజనాలను ఆశిస్తున్నారు. వెబ్3 యాప్ ఫౌండర్‌లు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తగిన కసరత్తు చేస్తే, ఆసక్తికరమైన ఐడియాలతో ముందుకు వస్తే గేమ్‌లో ముందు ఉంటారు' అంటున్నాడు సాఫ్ట్‌వేర్ కంపెనీ 'యాప్‌టోపియా' ఫౌండర్, సీఇవో జోనాథన్ కె.

వెబ్ 3 రంగంలో భారత్ వేదికగా ఎన్నో కంపెనీలు పని చేస్తున్నాయి. వీటిద్వారా యువతకు ఎన్నో ఉద్యోగావకాశాలు దొరుకుతాయి. సాలిడిటీ డెవలపర్, మార్కెటింగ్ ఆఫీసర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, బ్లాక్ చెయిన్ ఆఫీసర్, కమ్యూనిటీ మేనేజర్, యూనిటీ డిజైనర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, ఈవెంట్స్ మేనేజర్, ఎనలిస్ట్, బీటా టెస్టర్, టెక్నికల్ రైటర్, డెవలపర్, డిజైనర్, ఇన్‌ఫ్లుయెన్సర్ మేనేజర్... ఇలా ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

మైరాతో అంతర్జాతీయ స్థాయికి...



వెబ్ 3 వరల్డ్ ఇనోవేషన్‌కు సంబంధించి ఘనంగా చెప్పుకునే వారిలో శిల్పా కర్మోరా ఒకరు. నాగ్‌పూర్‌కు చెందిన శిల్ప ఏఐ అండ్ బ్లాక్‌చెయిన్ సొల్యూషన్స్, ప్రాడక్ట్ కంపెనీ 'మైరా టెక్నాలజీకి' ఫౌండర్, సీఇవో. ప్రస్తుతం ఈ కంపెనీ ఆరు దేశాల్లో పని చేస్తోంది. 'మైరా బ్లాక్స్' అనే బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్‌తో పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, కమ్యూనిటీలతో కలిసి పనిచేస్తోంది. ఎన్నో కొత్త కంపెనీలకు టెక్నాలజీ అడ్వైజర్‌గా పని చేసింది. 'మీకు సాంకేతిక విషయాలపై ఆసక్తి ఉంటే మీలాగే ఆసక్తి ఉన్నవారితో స్నేహం చేయండి. నిపుణులతో మాట్లాడండి' అంటుంది శిల్ప


నయా ఇంటర్‌నెట్

వరల్డ్ వైడ్ వెబ్(డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ)కు సంబంధించి వెబ్ 1 నుంచి వెబ్ 2 వరకు జరిగిన ప్రస్థానాన్ని గమనిస్తే ఎంతో మార్పు కనిపిస్తుంది. వెబ్ 1 దశలోని వెబ్‌సైట్‌ల నుంచి వెబ్2 దశలోని సోషల్ మీడియా విస్తృతి వరకు ఆ మార్పును ప్రతిబింబిస్తాయి. అయితే 'అభివృద్ధి'గా చూపుతున్న మార్పు బడా కంపెనీలకే మేలు చేసిందనే విమర్శ ఉంది. ఈ నేపథ్యంలోనే పెద్ద కంపెనీల ఆధిపత్యానికి, నియంత్రణకు వీలు లేని వెబ్3 టెక్నాలజీపై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది. వెబ్3 స్టార్టప్‌లు భారతీయ మార్కెట్‌లో ఊపందుకోవడం ఈ మార్పును సూచిస్తోంది. వెబ్ 3లో డీసెంట్రలైజ్‌డ్ విధానంలో డేటా ఒకదానితో ఒకటి అనుసంధానం అవుతుంది. వెబ్ 3 అనేది ఒక తరం మార్పునకు ప్రతిబింబం. 'వెబ్ 3కి కొలమానం ఏమిటి?' అనే విషయానికి వస్తే ఒక యాప్‌లో డాటా, ఐడెంటిటీ, ప్రైవసీ, ప్లే-టు-ఎర్న్‌లాంటి ఎలిమెంట్స్ తప్పకుండా ఉండాలి. స్వెట్‌కాయిన్ (ఫిట్‌నెస్), ట్విగ్(ఫైనాన్స్)లాంటి వెబ్3 రైజింగ్ స్టార్స్ ఆచరణ స్థాయిలో వెబ్3 ఎలిమెంట్స్‌ను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి

ముగ్గు ముచ్చట



గిద్దిగాని సరళ
ఎలగందల్,
కరీంనగర్ జిల్లా



9 చుక్కలు
5 వచ్చేవరకు
మధ్య చుక్క





లక్ష్మీ కుమారి
నందలూరు, అన్నమయ్య జిల్లా

15 చుక్కలు
7 వచ్చేవరకు, నందు చుక్క





బి. యమునా రాణి
న్యూ మిర్జాలగూడ
మల్కాజిగిరి, హైదరాబాద్

17 చుక్కలు,
8 వచ్చే వరకు
మధ్య చుక్క



22 చుక్కలు,
22 వరుసలు



దామరాజు లక్ష్మి,
ఆర్.ఆర్.పేట, ఏలూరు



అంకిత రైనా శుభారంభం

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత స్టార్ అంకిత రైనా శుభారంభం చేసింది. మెల్‌బోర్న్‌లో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 221వ ర్యాంకర్ అంకిత 6-4, 5-7, 7-6 (10/7)తో ప్రపంచ 158వ ర్యాంకర్ జెస్సికా బుజస్ మనెరో (స్పెయిన్)పై గెలిచింది. 2 గంటల 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను ఎనిమిదిసార్లు కోల్పోయారు. నిర్ణాయక మూడో సెట్ టైబ్రేక్‌లో అంకిత పైచేయి సాధించి విజేతగా నిలిచింది. రెండో రౌండ్‌లో ప్రపంచ 132వ ర్యాంకర్ సారా బెజ్‌లెక్ (చెక్ రిపబ్లిక్)తో అంకిత తలపడుతుంది.

కేప్‌టౌన్ పిచ్‌పై 'అసంతృప్తి'



భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్టు జరిగిన కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ పిచ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఐదు సెషన్లలోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో వాడిన పిచ్ సంతృప్తికరంగా లేదని అభిప్రాయ పడింది. ఈ టెస్టుకు రిఫరీగా వ్యవహరించిన క్రిస్ బ్రాడ్ తన నివేదికను ఐసీసీకి అందించారు. దీని ప్రకారం న్యూలాండ్స్ పిచ్‌కు ఒక డీ మెరిట్ రేటింగ్ ఇచ్చారు.

శ్రీకాంత్ సంచలనం

ఐదో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీపై గెలుపు



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ సంచలన విజయంతో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 12-21, 21-18, 21-16తో ప్రపంచ ఐదో ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తదుపరి రౌండ్‌లో ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)తో శ్రీకాంత్ తలపడతాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా (భారత్) జోడీ 21-13, 21-16తో ఫ్రాన్సెస్కా కోర్బి-అలీసన్ లీ (అమెరికా) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది.

'ఆసియా' టోర్నీతో సింధు పునరాగమనం



న్యూఢిల్లీ: మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న భారత మహిళా స్టార్ షట్లర్ పీవీ సింధు వచ్చే నెలలో జరిగే ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌తో పునరాగమనం చేయనుంది. ఫిబ్రవరి 13 నుంచి 19 వరకు మలేసియాలోని షా ఆలమ్‌లో జరిగే ఈ టోర్నీలో పాల్గొనే భారత మహిళల, పురుషుల జట్లను మంగళవారం ప్రకటించారు. గత ఏడాది అక్టోబర్‌లో ఫ్రెంచ్ ఓపెన్‌లో పాల్గొన్నాక సింధు మోకాలి గాయంతో ఆటకు దూరమైంది. ప్రస్తుతం బెంగళూరులోని ప్రకాశ్ పదుకొనే అకాడమీలో ఇండోనేసియా కోచ్ అగుస్ ద్వి సాంతోసో పర్యవేక్షణలో సింధు శిక్షణ తీసుకుంటోంది.

భారత మహిళల జట్టు: సింధు, అన్‌మోల్, తన్వీ శర్మ, అష్మిత, ట్రెసా జాలీ, గాయత్రి గోపీచంద్, అశ్విని పొన్నప్ప, తనీషా క్రాస్టో, ప్రియా దేవి, శ్రుతి మిశ్రా. **భారత పురుషుల జట్టు:** ప్రణయ్, లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్, చిరాగ్ సేన్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల, అర్జున్, సూరజ్ గోలా, పృథ్వీ రాయ్.

టి20 సిరీస్ కూడా చేజారె...

- మూడో మ్యాచ్‌లోనూ ఓడిన భారత మహిళల జట్టు
- 7 వికెట్లతో ఆస్ట్రేలియా విజయం
- సిరీస్ 2-1తో కైవసం

ముంబై: స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఆస్ట్రేలియా మహిళలపై ఏకైక టెస్టు మ్యాచ్‌లో నెగ్గి సత్తా చాటిన భారత్ పరిమిత ఓవర్ల సమరాల్లో మాత్రం పేలవమైన ఆటతీరును చూపించింది. వన్డే సిరీస్‌లో 0-3తో చిత్తుగా ఓడిన మన మహిళలు ఇప్పుడు టి20 సిరీస్‌ను కూడా చేజార్చుకున్నారు. మంగళవారం జరిగిన చివరిదైన మూడో టి20లో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. ఫలితంగా 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. రిచా ఘోష్ (28 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా...స్మృతి మంధాన (28 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్), షఫాలీ వర్మ (17 బంతుల్లో 26; 6 ఫోర్లు) రాణించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (3) మళ్లీ విఫలమైంది. ఆసీస్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అనాబెల్ సదర్లాండ్, జార్జ్ వేర్‌హమ్ చెరో 2 వికెట్లు పడగొట్టగా... మేగన్ షుట్, యాష్లే గార్డ్‌నర్ చెరో వికెట్ తీశారు. అనంతరం ఆస్ట్రేలియా 18.4 ఓవర్లలో 3 వికెట్లకు 149 పరుగులు చేసింది. అలీసా హీలీ (38 బంతుల్లో 55; 9 ఫోర్లు, 1 సిక్స్), బెత్ మూనీ (45 బంతుల్లో 52 నాటౌట్; 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 60 బంతుల్లోనే 85 పరుగులు జత చేశారు. పూజ వస్త్రకర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీకి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది. వచ్చే సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌లో మహిళల టి20 వరల్డ్ కప్ జరగనుండగా... ఆలోపు మన టీమ్ ఒక్క టి20 మ్యాచ్ కూడా ఆడబోవడం లేదు. తొలి వికెట్‌కు 28 బంతుల్లో 39 పరుగులు జోడించి భారత్‌కు షఫాలీ, స్మృతి సరైన ఆరంభం అందించారు. షఫాలీని అవుట్ చేసిన షుట్ మహిళల టి20ల్లో అత్యధిక వికెట్లు (131)తీసిన బౌలర్‌గా అవతరించింది. షఫాలీ అవుటయ్యాక టీమిండియా 6 పరుగుల వ్యవధిలో జట్టు 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. జెమీమా (2), హర్మన్‌ప్రీత్ ఇలా వచ్చి అలా వెళ్లారు. ఈ దశలో రిచా కొన్ని చక్కటి షాట్లతో జట్టును ఆదుకుంది. దీప్తి (14),



హర్మన్‌ప్రీత్

అమన్‌జోత్ (17 నాటౌట్)లతో కలిసి తర్వాతి రెండు వికెట్లకు 69 పరుగులు జోడించడంతో టీమ్ చెప్పుకోదగ్గ స్కోరు సాధించింది. అయితే ఛేదనలో మెరుపు ఆరంభంతో హీలీ, మూనీ కలిసి ఆసీస్ పనిని సులువు చేశారు. టిటాస్ సాధు ఓవర్లో 3 ఫోర్లు, రేణుక వేసిన తర్వాతి ఓవర్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో హీలీ చెలరేగింది. 6 ఓవర్లలోనే స్కోరు 54 పరుగులకు చేరగా... 34 బంతుల్లోనే హీలీ అర్ధసెంచరీ పూర్తయింది. వీరిద్దరి జోరుతో ఆసీస్ లక్ష్యంగా దిశగా వేగంగా సాగింది. హీలీని దీప్తి అవుట్ చేసిన కొద్దిసేపటికే వరుస బంతుల్లో తాలియా మెక్‌గ్రాత్ (20), పెరీ (0)లను వెనక్కి పంపించి పూజ ఆశలు రేపింది. అయితే అప్పటికే ఆలస్యమైపోయింది. మూనీ, లిచ్‌ఫీల్డ్ (17 నాటౌట్) నాలుగో వికెట్‌కు 20 బంతుల్లోనే అభేద్యంగా 32 పరుగులు జత చేసి మరో 8 బంతులు మిగిలి ఉండగానే జట్టును గెలిపించారు.





తులసీ చైతన్య



అజయ్ కుమార్



షమీ



హుసాముద్దీన్

'అర్జున'తో అందలం

- జాతీయ క్రీడా పురస్కారాలు అందుకున్న షమీ, హుసాముద్దీన్, అజయ్ కుమార్ రెడ్డి
- సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ఇషా సింగ్ గైర్హాజరు
- ఆంధ్రప్రదేశ్ స్విమ్మర్ తులసీ చైతన్యకు టెన్‌జింగ్ నార్గే అవార్డు

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక క్రీడా పురస్కారం 'అర్జున' అవార్డు ప్రదాన కార్యక్రమం మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. వేర్వేరు క్రీడాంశాల్లో సత్తా చాటి ఈ పురస్కారానికి ఎంపికైన భారత ఆటగాళ్లు దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దీనిని సగర్వంగా అందుకున్నారు. భారత క్రికెట్ జట్టు స్టార్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీతో పాటు తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ అర్జున అవార్డు అందుకున్న వారిలో ఉన్నారు. జకార్తాలో ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడుతున్న కారణంగా తెలంగాణ షూటర్ ఇషా సింగ్ ఈ అవార్డును అందుకోలేకపోయింది. దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ 'ఖేల్‌రత్న' అవార్డుకు ఎంపికైన టాప్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ (ఆంధ్రప్రదేశ్), చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర) కూడా ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. వీరిద్దరు ప్రస్తుతం కౌలాలంపూర్‌లో జరుగుతున్న మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొంటున్నారు. భారత మహిళా చెస్ గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు అమ్మాయి ఆర్. వైశాలి, రెజ్లర్ అంతిమ్ పంఘాల్, అథ్లెట్ పారుల్ చౌదరి, భారత కబడ్డీ జట్టు కెప్టెన్, తెలుగు టైటాన్స్ జట్టు స్టార్ ప్లేయర్ పవన్ కుమార్ సెహ్రావత్ కూడా అర్జున పురస్కారాన్ని అందుకున్నారు. పారా ఆర్చర్ శీతల్ దేవి అవార్డు అందుకుంటున్నప్పుడు ప్రేక్షకులు పెద్ద ఎత్తున చప్పట్లతో అభినందించగా... వీల్‌చైర్‌లో కూర్చుకున్న పారా కనోయిస్ట్ ప్రాచీ యాదవ్ వద్దకు వెళ్లి స్వయంగా రాష్ట్రపతి అవార్డు అందించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంధ క్రికెటర్ అజయ్ కుమార్ రెడ్డి కూడా అర్జున అవార్డును అందుకోగా... ఆంధ్రప్రదేశ్‌కే చెందిన స్విమ్మర్ మోతుకూరి తులసీ చైతన్య టెన్‌జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారాన్ని స్వీకరించాడు. విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న 34 ఏళ్ల తులసీ చైతన్య కాటలీనా చానెల్, జిబ్రాల్టర్ జల సంధి, పాక్ జలసంధి, ఇంగ్లిష్ చానెల్, నార్త్ చానెల్‌లను విజయవంతంగా ఈది తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాడు. 2023 సంవత్సరానికి ఇద్దరికి 'ఖేల్ రత్న'... 26 మందికి 'అర్జున'... ఐదుగురికి 'ద్రోణాచార్య' రెగ్యులర్ అవార్డు... ముగ్గురికి 'ద్రోణాచార్య' లైఫ్‌టైమ్... ముగ్గురికి 'ధ్యాన్‌చంద్ లైఫ్‌టైమ్' అవార్డులు ప్రకటించారు. ప్రతి ఏటా జాతీయ క్రీడా దినోత్సవం (ఆగస్టు 29న) ఈ అవార్డులను అందజేస్తారు. అయితే ఆ సమయంలో హాంగ్జౌ ఆసియా క్రీడలు జరుగుతుండటంతో అవార్డుల ఎంపికతోపాటు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కూడా వాయిదా వేశారు.

తెలుగు టైటాన్స్ ఖాతాలో పదో పరాజయం

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు 26-46తో బెంగాల్ వారియర్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఈ లీగ్‌లో టైటాన్స్ జట్టుకిది పదో పరాజయం. టైటాన్స్ జట్టులో కెప్టెన్ పవన్ సెహ్రావత్ మినహా మిగతా ఆటగాళ్లు విఫలమయ్యారు. పవన్ 11 పాయింట్లు స్కోరు చేశాడు. వారియర్స్ జట్టులో వైభవ్ 9 పాయింట్లు, నితిన్ 9 పాయింట్లు, విశ్వాస్ 8 పాయింట్లు, శుభమ్ 6 పాయింట్లు సాధించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో తమిళ్ తలైవాస్; యు ముంబాతో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.

పాయింట్ల పట్టిక (PKL)

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	10	9	1	0	46
దబంగ్ ఢిల్లీ	11	7	3	1	40
గుజరాత్ జెయింట్స్	11	7	4	0	39
జైపూర్ పింక్ పాంథర్స్	10	6	2	2	38
యు ముంబా	10	6	4	0	32
హరియాణా స్టీలర్స్	10	6	4	0	31
బెంగళూరు బుల్స్	12	5	7	0	31
పట్నా పైరేట్స్	11	5	6	0	29
బెంగాల్ వారియర్స్	11	4	5	2	28
యూపీ యోధాస్	11	3	7	1	21
తమిళ్ తలైవాస్	10	2	8	0	14
తెలుగు టైటాన్స్	11	1	10	0	9

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

మెహులీ-రుద్రాంక్ష్ జోడీకి స్వర్ణం



జకార్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నీలో మంగళవారం భారత్‌కు ఒక స్వర్ణం, ఒక రజతం లభించాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ విభాగంలో మెహులీ ఘోష్-రుద్రాంక్ష్ పాటిల్ జోడీ బంగారు పతకం... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో రిథమ్ సాంగ్వాన్-అర్జున్ జంట రజత పతకం గెలిచింది. ఫైనల్స్‌లో మెహులీ-రుద్రాంక్ష్ 16-10తో షెన్ యుఫాన్-జు మింగ్‌షుయ్ (చైనా)లపై నెగ్గగా... రిథమ్-అర్జున్ 11-17తో ట్రిన్-క్వాంగ్ (వియత్నాం)ల చేతిలో ఓడింది.

సినిమా

మా ఇద్దరికీ సంక్రాంతి కలిసొచ్చిన పండగ

- మహేశ్‌బాబు



● మీనాక్షీ చౌదరి, శ్రీలీల, రాధాకృష్ణ, మహేశ్‌బాబు, త్రివిక్రమ్, తమన్, 'దిల్' రాజు

''నాన్నగారికి (సూపర్ స్టార్ కృష్ణ), నాకు సంక్రాంతి బాగా కలిసొచ్చిన పండగ. మా సినిమా సంక్రాంతికి రిలీజైతే అది బ్లాక్‌బస్టరే.. ఈసారి కూడా 'గుంటూరు కారం'తో బాగా గట్టిగా కొడతాం. కానీ, ఈసారి కొంచెం కొత్తగా ఉంది. ఎందుకంటే నాన్నగారు మన మధ్య లేరు. ఆయన నా సినిమా చూసి కలెక్షన్స్, సినిమా గురించి చెబుతుంటే చాలా ఆనందంగా ఉండేది. ఆయన ఫోన్ కోసం ఎదురు చూసేవాణ్ణి. ఇప్పుడు అవన్నీ మీరే (ఫ్యాన్స్) చెప్పాలి నాకు. ఇక నుంచి మీరే నాకు అమ్మానాన్న.. మీరే అన్నీ (చెమర్చిన కళ్లతో)'' అన్నారు మహేశ్‌బాబు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేశ్‌బాబు, శ్రీలీల జంటగా మీనాక్షీ చౌదరి కీలక పాత్రలో నటించిన చిత్రం 'గుంటూరు కారం'. మమత సమర్పణలో ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం గుంటూరులో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో **మహేశ్‌బాబు మాట్లాడుతూ** – ''నేను త్రివిక్రమ్ గారి సినిమాలు చేసినప్పుడల్లా నా నటనలో ఒక మ్యాజిక్ జరుగుతుంది. 'అతడు, ఖలేజా' చిత్రాలకు మ్యాజిక్ జరిగింది. ఇప్పుడు 'గుంటూరు కారం'లోనూ ఆ మ్యాజిక్ జరిగింది. ఒక కొత్త మహేశ్‌బాబుని చూడబోతున్నారు. దానికి ఆయనే కారణం. మా నిర్మాత చినబాబుగారికి అత్యంత ఇష్టమైన హీరో నేనే. ఈ సినిమా చేస్తున్నప్పుడు ఆయన ముఖంలో వచ్చిన సంతోషం చూసినప్పుడు నాకు ఆనందంగా అనిపించేది. శ్రీలీలతో డ్యాన్స్ చేయడమంటే వామ్మో.. అదేం డ్యాన్సు.. హీరోలందరికీ తాట ఊడిపోద్ది (నవ్వుతూ). తమన్ ప్రతిసారీ నాకు బెస్ట్ ఇస్తాడు. 'కుర్చీ మడతపెట్టి..' పాట చూస్తే థియేటర్లు బద్దలయిపోతాయి. పాతికేళ్లుగా మీరు (ఫ్యాన్స్) చూపించిన అభిమానం మరచిపోలేను. మాటల్లేవ్.. చేతులెత్తి దండం పెట్టడం తప్ప నాకేమీ తెలియదు.. మీరెప్పుడూ నా గుండెల్లో ఉంటారు'' అన్నారు. **త్రివిక్రమ్ మాట్లాడుతూ** –''కృష్ణగారు తెలుగు సినిమాలో విడదీయలేని ఒక అంతర్భాగం. అలాంటి గొప్ప మహానటుడు, మహా మనిషితో నేను నేరుగా పని చేయలేకపోయాను. కానీ, ఆయన పని చేసిన ఓ సినిమాకి పోసానిగారి వద్ద అసిస్టెంట్‌గా చేశాను. ఆ తర్వాత 'అతడు, ఖలేజా' సినిమాలు తీసినప్పుడు ఆయనతో మాట్లాడాను. అలాంటి గొప్ప వ్యక్తికి కొడుకుగా పుట్టిన మహేశ్‌గారు ఎంత అదృష్టవంతుడో అనిపిస్తుంటుంది. ఒక సినిమాకి 100 శాతం పని చేయాలంటే 200 శాతం పని చేసే హీరో ఎవరైనా ఉన్నారంటే మహేశ్‌గారే.. ఈ మాట చెప్పడానికి తెలుగు ఇండస్ట్రీలో ఎవరు కూడా వెనక్కి తిరిగి చూడరు. 'అతడు, ఖలేజా'లకు పని చేసినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. అది అందం పరంగా, నటన పరంగానూ. ఈ సంక్రాంతిని రమణగాడితో కలిసి థియేటర్లలో ఆనందంగా జరుపుకుందాం'' అన్నారు. నిర్మాత **'దిల్' రాజు మాట్లాడుతూ**– ''చినబాబు, నాగవంశీల సక్సెస్ జర్నీ అద్భుతంగా ఉంది. త్రివిక్రమ్ ప్రతి సినిమాలో ఏదో మాయ చేస్తారు.. ఈ సినిమాలో కూడా చేశారు. 'గుంటూరు కారం'తో మహేశ్‌గారు కలెక్షన్ల తాట తీస్తారు. బ్లాక్ బస్టర్ సినిమా రాబోతోంది'' అన్నారు.



''ఓ ప్రాసెస్‌ను ఫాలో అవుతూ నిజాయితీగా సినిమా తీస్తే, ఆ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్ముతాను. 'సైంధవ్'ను కూడా ఇలాగే తీశాను. ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. అలాగే జయాపజయాల గురించి ఆలోచించే మనస్తత్వం నాకు లేదు. నా ప్రయాణాన్ని ఆస్వాదిస్తాను'' అన్నారు శైలేష్ కొలను. వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో శైలేష్ కొలను చెప్పిన విశేషాలు.

నా జీవితంలోని ప్రేమతో సినిమా చేస్తాను

- దర్శకుడు శైలేష్ కొలను

● 'హిట్ 2' రిలీజ్ తర్వాత నిర్మాత వెంకట్‌గారు చెప్పారని వెంకటేశ్‌గారిని కలిశా. ఆయన్ను కలిసిన తొలిసారి మేం సినిమాలు కాకుండా జీవిత విశేషాలను మాట్లాడుకున్నాం. అలా రెండు మూడుసార్లు కలుసుకున్నాక ఓ సందర్భంలో ఆయనకు 'సైంధవ్' స్టోరీ లైన్ చెప్పాను. ఆ తర్వాత పూర్తి కథ చెప్పా. 'ఈ స్క్రిప్ట్ నా 75వ సినిమాకు సరిపోతుందనిపిస్తోంది. ఈ సినిమా చేద్దాం' అన్నారు. వెంకటేశ్‌గారి అనుభవం, ఆయన సూచనలు, సలహాలు తీసుకుని 'సైంధవ్' స్క్రిప్ట్‌ను మరింత బాగా రెడీ చేశాను. అలాగే వెంకటేశ్‌గారు చెప్పారని, సురేష్‌బాబుగారికి కూడా కథ వినిపించాను. ఆయన కొన్ని ఇన్‌పుట్స్ ఇచ్చారు ● దర్శకుడిగా నేను తొలుత ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్ చేశాను. కానీ 'సైంధవ్' ఎమోషనల్ డెప్త్ ఉన్న ఫిల్మ్. స్పైనల్ మస్కులర్ అట్రోఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న తన చిన్నారి కుమార్తె గాయత్రిని (సారా పాత్ర)ని తండ్రిగా సైంధవ్ (వెంకటేశ్ పాత్ర) ఏ విధంగా కాపాడుకుంటాడు? గాయత్రికి కావాల్సిన రూ. 17 కోట్ల ఖరీదైన ఇంజక్షన్ కోసం ఏ విధంగా పోరాటం చేస్తాడు? అనేది ఈ చిత్రకథ. వెంకటేశ్‌గారి పాత్రకు ఫ్లాష్ బ్యాక్ స్టోరీ ఉంటుంది. కానీ రొటీన్‌గా ఉండదు. ఎంత కొత్తగా డిజైన్ చేశానన్నది థియేటర్స్‌లో చూస్తారు. అలాగే ఈ సినిమా కోసం 'ఇంద్రప్రస్థ' అనే ప్రత్యేకమైన సిటీని క్రియేట్ చేశాం. మేజర్‌గా నైట్ షూట్ చేయాల్సి వచ్చింది. నైట్ షూట్స్ అని వెంకటేశ్‌గారికి ముందే చెప్పాను. బాగా సపోర్ట్ చేశారు. 'సైంధవ్'ను ప్రేక్షకులు సపోర్ట్ చేస్తే పార్ట్ 2 చేసే స్కోప్ కథలో ఉంది ● థ్రిల్లర్స్, యాక్షన్ చిత్రాలే కాదు.. ఓ దర్శకుడిగా అన్ని రకాల సినిమాలు చేయాలని ఉంది. నాది ప్రేమ వివాహం. నా జీవితంలో జరిగిన లవ్ మూమెంట్స్‌ను ఓ కథగా రాశాను. తప్పకుండా ఈ సినిమా చేస్తాను. అలాగే నానీగారితో 'హిట్ 3' ఉంటుంది.

వరాలు అందరికీ కనెక్ట్ అవుతుంది


- ఆషికా రంగనాథ్



నాగార్జున హీరోగా నటించిన తాజా చిత్రం 'నా సామిరంగ'. ఈ చిత్రంలో 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్, ఆషికా రంగనాథ్, మిర్నా మీనన్, రుక్సార్ థిల్లాన్ కీలక పాత్రల్లో నటించారు. విజయ్ బిన్నీ దర్శకత్వంలో పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో రెండు వేరియేషన్స్ ఉన్న వరాలు (వరలక్ష్మి) పాత్ర చేశాను. స్వతంత్ర భావాలు కలిగిన అమ్మాయి వరాలు. కాస్త రెబల్‌గా ఉంటుంది. అందుకే వరాలు పాత్రకు అమ్మాయిలందరూ కనెక్ట్ అవుతారని నా నమ్మకం. నాగార్జున గారు రొమాంటిక్ హీరో. కథకు అనుగుణంగా మా పాత్రల మధ్య రొమాంటిక్ సన్నివేశాలు ఉంటాయి. విజయ్ బిన్నీగారు ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేస్తామన్నప్పుడు జోక్ చేస్తున్నారేమో? అనుకున్నాను. ఎందుకంటే అంత తక్కువ టైమ్‌లో షూటింగ్ పూర్తవుతుందా అని డౌట్. కానీ నాగ్ సార్ హార్డ్ వర్క్, యూనిట్ అందరి సపోర్ట్‌తో ఈ సినిమా సంక్రాంతికి విడుదలవుతోంది. ప్రస్తుతం తమిళంలో సిద్ధార్థ్‌తో ఓ సినిమా, కన్నడంలో రెండు సినిమాలు చేస్తున్నాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''నన్ను కొందరు జూనియర్ అనుష్క అంటుంటే హ్యాపీగా ఉంది. నాకు అనుష్కగారంటే చాలా ఇష్టం. ఓ ఆర్టిస్టుగా చాలా కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నాను. కన్నడలో ఓవర్‌నైట్ స్టార్‌ని కాలేదు. నటిగా విభిన్నమైన పాత్రలు చేయాలని ఉంది. పీరియాడికల్ ఫిల్మ్స్ చేయాలని ఉంది. ఎప్పటికైనా రాజమౌళిగారి సినిమాలో నటించాలని బలంగా కోరుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు.

రీల్స్

డేట్ ఫిక్స్



రజనీ కాంత్

రజనీకాంత్, లెజెండరీ క్రికెటర్ కపిల్‌దేవ్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రల్లో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటించిన చిత్రం 'లాల్ సలామ్'. ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేస్తామని తొలుత చిత్రం యూనిట్ ప్రకటించింది. తాజాగా 'లాల్ సలామ్' సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేస్తామని మంగళవారం కొత్త విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ''హిందూ, ముస్లిం యువకులు వారెంతగానో ప్రేమించే క్రికెట్ ఆట విషయంలో మతం పేరుతో గొడవలు పడుతూ ఉంటే ఆ గొడవలను మొయిద్దీన్ భాయ్ (సినిమాలో రజనీ పాత్ర) ఎలా సర్దుబాటు చేశాడు? అన్నదే చిత్రకథాంశం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ఎ.ఆర్. రెహమాన్.

విజయానికి అడ్డదారులుండవు



● ప్రశాంత్, సందీప్

కొరియోగ్రాఫర్ 'ఆట' సందీప్ హీరోగా నటించిన చిత్రం 'షార్ట్ కట్'. విజయానికి అడ్డదారులుండవు అనేది ట్యాగ్‌లైన్. రామకృష్ణ కంచి దర్శకత్వంలో షర్మిల కంచి సమర్పణలో తోట రంగారావు, పున్నపు రజనీకాంత్ నిర్మించారు. హైదరాబాద్‌లో ఈ చిత్రం పోస్టర్ విడుదల, షో రీల్ వేడుక జరిగింది. రామకృష్ణ కంచి మాట్లాడుతూ– ''25 ఏళ్లుగా చిత్ర పరిశ్రమలో ఉంటూ చాలా శాఖల్లో పని చేశాను. ఆ అనుభవంతో 'షార్ట్ కట్' తీశా. ప్రస్తుతం యువత డ్రగ్స్‌కు అలవాటుపడి తమ జీవితాల్ని ఎలా నాశనం చేసుకుంటున్నారు? ఈ దందా వెనక జరుగుతున్న చీకటి కోణాలు ఏంటి? అనేది ఈ చిత్రంలో చూపించాం'' అన్నారు. ''డార్క్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు 'ఆట' సందీప్. ''ఈ సినిమాను కేవలం డబ్బు కోసమే కాకుండా సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని నిర్మించాం'' అన్నారు తోట రంగారావు. 'బిగ్ బాస్ 7' విజేత పల్లవి ప్రశాంత్ పాల్గొన్నారు.

రంగుల ప్రపంచంలో...



● క్రాంతి, శ్రీలు

క్రాంతి, శ్రీలు హీరో హీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం 'కొత్త రంగుల ప్రపంచం'. నటుడు పృథ్వీరాజ్ ఈ మూవీతో దర్శకునిగా మారారు. పద్మా రేఖ, గుంటక శ్రీనివాస్ రెడ్డి, కుర్రి కృష్ణారెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ– ''కొత్త హీరో, కొత్త హీరోయిన్, కొత్త డైరెక్టర్.. ఇలా అందరం కలిసి 'కొత్త రంగుల ప్రపంచం' అనే మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. ఈ చిత్రం హిట్టవుతుందని ఆశిస్తున్నా'' అన్నారు. ''ఈ మూవీలో నా పాత్ర చాలా బాగుంటుంది'' అన్నారు క్రాంతి. ''మా నాన్న (పృథ్వీరాజ్) నన్ను హీరోయిన్‌గా పెట్టి ఈ సినిమా డైరెక్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ మూవీ కోసం పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు ఈ చిత్రం ప్లస్ అవుతుంది'' అని శ్రీలు అన్నారు.

నా పాట తెలిసినంతగా నేను తెలియను! - కృష్ణకాంత్



''తెలుగు చిత్ర పరిశ్రమలో పదకొండేళ్ల ప్రయాణం నాది (తొలి చిత్రం 'అందాల రాక్షసి'). ఇన్నేళ్ల కెరీర్ పరంగా హ్యాపీగా ఉన్నాను. అయితే నా పాటలు తెలిసినంతగా నేనెక్కువగా జనాలకు తెలియదేమో అనిపిస్తుంటుంది. అయినా నేను కాదు.. నా పాటలు వారికి తెలియ డం సంతృప్తిగా ఉంది'' అని పాటల రచయిత కృష్ణకాంత్ అన్నారు. నేడు ఆయన బర్త్‌డే (జనవరి 10). ఈ సందర్భంగా మంగళవారం కృష్ణకాంత్ మాట్లాడుతూ– ''ఇన్నేళ్లలో ఎన్నో పాటలు రాశాను. 2023లో 'విరూపాక్ష, కోట బొమ్మాళి, హాయ్ నాన్న, సలార్, జైలర్, జవాన్, లియో'.. ఇలా 27 సినిమాల్లో 70 పాటలు రాశాను. సిద్ధార్థ్ 'చిన్నా', 'ది మార్వెల్స్' చిత్రాలకు పాటలు, మాటలు రాశా. మన పాట వైరల్ కావాలనే ఆలోచనతో రాస్తే సినిమా ఆడినన్ని రోజులు గుర్తుంటుంది.. ఆ తర్వాత మరచిపోతారు. నా ప్రతి పాటలో ఓ భావం, అర్థం ఉండాలనే ఆలోచనతో రాస్తాను. నేను పాటలు రాసిన 'హను-మాన్', 'సైంధవ్', 'ఈగల్', 'కల్కి 2898 ఏడీ' చిత్రాలు రిలీజ్ కానున్నాయి. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వం వహిస్తున్న సినిమాకీ పాటలు రాశాను'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
31	32
71,386	21,545

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	14,864	▲ 21
డోజోన్స్	37,528	▼ 155
ఎఫ్‌టీఎస్ఈ 100	7,684	▼ 10
డాక్స్	16,688	▼ 28
షాంఘై	2,893	▲ 6
నికాయ్	33,763	▲ 386

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,415	▼ 125
బంగారం (99.5 స్వచ్ఛత)	62,165	▼ 125
వెండి (కేజీ)	71,840	▲ 290

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.66	83.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.85	107.42
€	యూరో	ఒకటి	90.01	92.37
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.22	58.58
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.01	56.95
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.49
SAR	సౌదీ రియాల్	[illegible]	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.73	23.53
¥	చైనా యువాన్	[illegible]	10.48	12.55

బీ న్యూ స్టోర్లలో 'రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్' స్మార్ట్ ఫోన్లు



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ రిటైల్ చైన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో 'రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్' స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ బీ న్యూ స్టోర్‌లో మంగళవారం రుహాని శర్మ ఈ ఫోన్‌ను విడుదల చేశారు. ఐసీఐసీఐ క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా రెడ్‌మీ నోట్ 13 ప్రోప్లస్ 5జీ కొనుగోలుపై రూ.2 వేలు తక్షణ తగ్గింపు, రెడ్‌మీ నోట్ 13 5జీ కొనుగోలుపై రూ.1000 డిస్కౌంట్ పొందొచ్చు. ప్రత్యేక షావోమి లాయల్టీ బోనస్ రూ.2,500 కూడా ఉంది. అదనంగా ఏదైనా రెడ్‌మీ నోట్ 13 సిరీస్ కొనుగోలుపై రూ.1999లకే రెడ్‌మీ వాచ్ 3 యాక్టివ్‌ను పొందొచ్చు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ సీఈవో సాయి నిఖిలేష్, ఎండీ సాయి నితేష్, సేల్స్ సీనియర్ మేనేజర్ సయ్యద్ అన్వర్, రిటైల్ మార్కెటింగ్ మేనేజర్ ఇఫ్తాకర్, శ్రీవాస్తవ్ పాల్గొన్నారు.

సెలెక్ట్ మొబైల్స్ 'సంక్రాంతి సూపర్ సేల్' ఆఫర్లు



హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ చైన్ సెలెక్ట్ మొబైల్స్ రెడ్‌మీ నోట్ 13 'రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్' స్మార్ట్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ సెలెక్ట్ స్టోర్‌లో మంగళవారం సినీ నటి సిరి హనుమంతు ఈ స్మార్ట్ ఫోన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ సీఎండీ వై గురు 'సూపర్ సంక్రాంతి సేల్' ఆఫర్లు ప్రకటించారు. ఇందులో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుపై 7.5% వరకు తక్షణ తగ్గింపు, అన్ని మోడల్స్‌పై రూ.3000 వరకు తగ్గింపు పొందవచ్చు. బ్రాండెడ్ స్మార్ట్‌వాచ్ రూ.999 నుంచి, ఇయర్ బడ్స్ రూ.799 ప్రారంభ ధరతో అందిస్తుంది. ఎక్స్ఛేంజీ ద్వారా అన్ని ప్రముఖ బ్రాండ్‌లపై రూ.30 వేల వరకు తగ్గింపు ఇస్తుంది. మొబైల్ కొనుగోలుపై స్మార్ట్ టీవీ/సౌండ్ బార్‌ను కేవలం రూ.2999లకే పొందవచ్చు. అత్యాధునిక ఫీచర్లు కలిగిన 'రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్' స్మార్ట్‌ఫోన్లతో పాటు 'సంక్రాంతి సూపర్ సేల్' ఆఫర్లు అన్ని సెలెక్ట్ సోర్టల్లో లభ్యమవుతాయని గురు తెలిపారు.

మూడు రోజులకు ఒక టాటా స్టార్‌బక్స్

- భారీగా కొత్త స్టోర్ల విస్తరణ
- 2028 నాటికి 1000 స్టోర్ల లక్ష్యం



ముంబై: టాటా కన్జ్యూమర్, స్టార్‌బక్స్ జాయింట్ వెంచర్ కంపెనీ టాటా స్టార్‌బక్స్ (కాఫీ ఔట్‌లెట్స్) భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. ప్రతి మూడు రోజులకు ఒక కొత్త స్టోర్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపింది. 2028 నాటికి దేశవ్యాప్తంగా తమ నిర్వహణలోని స్టోర్లను 1,000కి పెంచుకోవాలనే లక్ష్యంతో ఉన్నట్టు ప్రకటించింది. స్థానిక భాగస్వాములకు నైపుణ్య శిక్షణతో ఉపాధి కల్పించడం, కొత్త స్టోర్ల ప్రారంభంతో కస్టమర్లకు మెరుగైన అనుభవాన్ని అందించడం, ప్రపంచవ్యాప్తంగా స్టార్‌బక్స్ కస్టమర్లు భారత కాఫీ రుచులను ఆస్వాదించేలా ప్రోత్సహించడం తమ విధానంలో భాగంగా ఉంటాయని వెల్లడించింది. ఇరు సంస్థలు 2012లో చెరో సగం వాటాతో కూడిన జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 54 పట్టణాల్లో 390 స్టోర్లను నిర్వహిస్తూ, 4,300 మందికి ఉపాధి కల్పిస్తోంది. 2028 నాటికి వెయ్యి స్టోర్ల లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోకి విస్తరిస్తామని, ఎయిర్‌పోర్టుల్లోనూ స్టోర్లను ప్రారంభిస్తామని, ఉద్యోగుల సంఖ్యను 8,600కు పెంచుకుంటామని ప్రకటించింది.

మహిళలకు శిక్షణ

ఫుడ్ అండ్ బేవరేజెస్ (ఎఫ్అండ్‌బీ) పరిశ్రమలో కెరీర్ కోరుకునే మహిళలకు వృత్తిపరమైన శిక్షణ అందిస్తున్నట్టు టాటా స్టార్‌బక్స్ ప్రకటించింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబైలో స్టోర్లలో పనిచేస్తూనే నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపింది. ఉద్యోగులకు వారంలో ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేస్తున్న తొలి ఎఫ్అండ్‌బీ కంపెనీ తమదేనని పేర్కొంది.

తమిళనాడు ప్రభుత్వంతో రామ్‌రాజ్ కాటన్ ఒప్పందం



చెన్నై: రామ్‌రాజ్ కాటన్ తమిళనాడు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా వచ్చే అయిదేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడి, 5,000 మందికి ఉద్యోగావకాశాలు, చేనేత ప్రాసెసింగ్ కార్యక్రమాన్ని రామ్‌రాజ్ కాటన్ ఏర్పాటు చేయనుంది. ఒప్పంద ప్రతాలను సంస్థ వ్యవస్థాపకులు కే.ఆర్.నాగరాజన్, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అందజేశారు. 'తమిళనాడు ప్రభుత్వంతో కలిసి అమలు చేయబోతున్న పారిశ్రామిక పెట్టుబడులతో ఎంతో మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. అలాగే పారిశ్రామిక ప్రగతిలో తమిళనాడును మరింత అభివృద్ధి పథంవైపు తీసుకెళ్తుంది' అని నాగరాజన్ తెలిపారు.

సోనీతో విలీన డీల్‌కు కట్టుబడి ఉన్నాం

జీ ఎంటర్‌టైన్‌మెంట్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియాతో (ప్రస్తుతం కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ - సీఎంఈపీఎల్) విలీన డీల్‌కు కట్టుబడి ఉన్నామని జీ ఎంటర్‌టైన్‌మెంట్ (జీల్) స్పష్టం చేసింది. ఈ ఒప్పందాన్ని విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు కృషి చేస్తున్నామని స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. విలీన సంస్థకు జీల్ సీఈవో పునీత్ గోయెంకా సారథ్యం వహించడం ఇష్టం లేని కారణంగా సోనీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలనే యోచనలో ఉన్నట్లుగా వార్తలు వచ్చిన నేపథ్యంలో జీల్ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. జీల్‌తో తమ భారత విభాగం సీఎంఈపీఎల్‌ను విలీనం చేసేందుకు జపాన్‌కు చెందిన సోనీ గ్రూప్ రెండేళ్ల క్రితం డీల్ కుదుర్చుకుంది. అప్పట్నుంచి వివిధ కారణాలతో అది వాయిదా పడుతూ వస్తోంది. జీల్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర, ఆయన తనయుడైన గోయెంకా .. కంపెనీ నిధులను మళ్లించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. దీనిపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ విచారణ జరిపింది. గోయెంకాను ఏ లిస్టెడ్ కంపెనీ బోర్డులో చేరరాదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై అప్పిలేట్ న్యాయస్థానంలో ఆయనకు ఊరట లభించింది. అయితే, ఈ మొత్తం వ్యవహారాన్ని కార్పొరేట్ గవర్నెన్స్ వైఫల్యంగా భావిస్తున్న సోనీ.. విలీన సంస్థకు గోయెంకాను సీఈవోగా చేసేందుకు ఇష్టపడటం లేదని, ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని భావిస్తోందని వార్తలు వచ్చాయి. ఒప్పందం పూర్తి కావడానికి జనవరి 20 వరకు గడువు ఉండటంతో ఏం జరగనుందని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆరంభ లాభాలు ఆవిరి

- ఇంట్రాడే గరిష్టాల నుంచి ఒక శాతం వెనక్కి
- స్వల్ప లాభాలతో గట్టెక్కిన స్టాక్ సూచీలు
- బ్యాంకులు, మీడియా, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలు



ముంబై: గరిష్ఠ స్థాయిల వద్ద ఆఖరి గంటలో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం ఆరంభంలో ఆర్జించిన భారీ లాభాలను కోల్పోయి స్వల్పలాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 680 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ చివరికి 31 పాయింట్ల స్వల్ప లాభంతో 71,386 వద్ద నిలిచింది. నిఫ్టీ ట్రేడింగ్‌లో 211 పాయింట్లు ఆర్జించింది. ఆఖరికి 32 పాయింట్లు పెరిగి 21,545 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు మధ్యాహ్నం వరకు స్థిరమైన లాభాలతో ముందుకు కదిలాయి. అయితే ఆఖరి గంటన్నరలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఇంట్రాడే గరిష్ఠం నుంచి దాదాపు ఒక శాతం దిగివచ్చాయి. బ్యాంకింగ్, మీడియా, ఎఫ్ఎంసీజీ, సర్వీసెస్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆటో, మెటల్, ఐటీ, ఫార్మా, రియల్టీ, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. చిన్న తరహా షేర్లకు డిమాండ్ లభించడంతో బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 0.37% లాభపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.991 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.104 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో జపాన్ (1%), సింగపూర్ (0.50%), చైనా (0.20%) మినహా మిగిలిన అన్ని దేశాల స్టాక్ సూచీలు అరశాతం మేర నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు అరశాతానికి పైగా పతనమయ్యాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అధిక వాల్యుయేషన్ ఆందోళనలు, ఆసియా మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు మన మార్కెట్లో లాభాల స్వీకరణకు పురిగొల్పాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియాతో 10 బిలియన్ డాలర్ల విలీనంపై సందిగ్ధత నెలకొనడంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేరు 8% పతనమైన రూ.256 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 13% క్షీణించి రూ.242 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు భారీ పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,036 కోట్లు నష్టపోయి రూ.24,613 కోట్లకు దిగివచ్చింది.
- బజాజ్ ఆటో రూ.4,000 కోట్ల బైబ్యాక్ ప్రకటించడంతో కంపెనీ షేరు 2% పెరిగి రూ.7,094 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 6% ఎగసి రూ.7,420 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది.
- జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ ఐపీఓకు తొలి రోజు విశేష స్పందన లభించింది. ఇష్యూ ప్రారంభమైన తొలి కొన్ని గంటల్లోనే షేర్లు పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ మొత్తం 1.75 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా 4.40 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. మొత్తంగా మొదటి రోజే 2.51 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఇందులో రిటైల్ విభాగం 8.25 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగం 3.63 రెట్లు, క్యూఐబీ కోటా 2 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.

టీవీ, ఓటీటీలు.. రెండింటికీ చోటుంది

టాటా ప్లే ఎండీ హరిత్ నాగ్‌పాల్



న్యూఢిల్లీ: ఓవర్-ది-టాప్ (ఓటీటీ)ల రాకతో టీవీలకు కాలం చెల్లుతోందనే అభిప్రాయాలను టాటా ప్లే ఎండీ, సీఈవో హరిత్ నాగ్‌పాల్ తోసిపుచ్చారు. బస్సులు, రైళ్లు, విమానాల తరహాలోనే టీవీలు, ఓటీటీలు కూడా కలిసి ముందుకు సాగేందుకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో టీవీలను ఇష్టపడే కస్టమర్లు ఎప్పుడూ ఉంటారని చెప్పారు. 'చాలా మందికి ప్రైవేట్ విమానాలు ఉన్నాయి. అంతమాత్రాన కమర్షియల్ ఎయిర్‌లైన్స్ మూతబడ్డాయా? లేదుగా. విమానాలు వచ్చాయని రైళ్లు, బస్సులు కనుమరుగయ్యాయా? లేదు. దేశీయంగా 30 కోట్ల కుటుంబాల్లో ఇప్పటికీ మొదటి టీవీని కొనుక్కోని కుటుంబాలు 14 కోట్ల పైచిలుకు ఉన్నాయి. కాబట్టి ఓటీటీ వచ్చింది కదా ఇక టీవీ పోతుందని అనుకోవడానికి లేదు. రెండూ కలిసి మనుగడ సాగించగలవు' అని నాగ్‌పాల్ చెప్పారు. ఎంత కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా.. పాత టెక్నాలజీని మాత్రమే వాడుకోగలిగే స్థోమత గల కస్టమర్ల సెగ్మెంట్ కూడా ఒకటి ఉంటుందని పేర్కొన్నారు. 'ఎడాప్ట్: టు థ్రైవ్, నాట్ జస్ట్ సర్వైవ్' పేరిట రాసిన పుస్తకాన్ని నాగ్‌పాల్ ఆవిష్కరించారు.

లైఫ్ 108 హెల్త్‌కేర్‌లో నిహార్ ఇన్ఫోకి మెజారిటీ వాటాలు

NIHAR INFO GLOBAL

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంకుర సంస్థ లైఫ్ 108 హెల్త్‌కేర్‌లో 51 శాతం పైచిలుకు వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు లిస్టెడ్ సంస్థ నిహార్ ఇన్ఫో గ్లోబల్ వెల్లడించింది. 2021లో ఏర్పాటైన లైఫ్ 108 సంస్థ ఆరోగ్య సంరక్షణ, లైఫ్‌స్టయిల్ ఉత్పత్తులను రిటైల్, హోల్‌సేల్, ఈ-కామర్స్ పోర్టల్స్ ద్వారా విక్రయిస్తోంది. న్యూట్రాస్యూటికల్స్ వంటి హెల్త్ సప్లిమెంట్స్ తయారీలోకి కూడా ప్రవేశించే యోచనలో ఉంది. లైఫ్ 108 కొనుగోలు రాబోయే 12 నెలల్లో తమ టర్నోవర్ వృద్ధికి గణనీయంగా దోహదపడగలదని నిహార్ ఇన్ఫో తెలిపింది.

దుర్గమ్మ సేవలో ఇజ్రాయెల్ రాయబారి, ఓంకారేశ్వర పీఠాధిపతి



ఇజ్రాయెల్ రాయబారికి అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఆలయ ఏఈవో

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఇజ్రాయెల్ రాయబారి నౌర్ గిలోన్, ప్రతినిధి హదాస్ బేకెస్ట్, తెలంగాణలోని ఓంకారేశ్వర పీఠాధిపతి ప్రతాప దక్షిణామూర్తి దీక్షితుల దంపతులు, ఎంక్వయిరీ కమిషన్, న్యూఢిల్లీ చైర్‌పర్సన్ జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ వేర్వేరుగా మంగళవారం దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు వీరికి ఆశీర్వచనం పలికారు.

19 నుంచి కులగణన

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 28 వరకూ ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించనుంది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎం.గిరిజాశంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 10 రోజుల పాటు గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది గృహాలన్నింటినీ సందర్శించి సర్వే నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏదేని కారణాలతో ఎవరైనా వ్యక్తులు/గృహాలు 10 రోజులపాటు నిర్వహించిన సర్వేలో కవర్ కాకపోతే అలాంటి వారు 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ మధ్య ఐదు రోజుల్లో సచివాలయాల్లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు సర్వేను విజయవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రజకుల అభివృద్ధికి ప్రోత్సాహం

సాక్షి, అమరావతి: రజకుల అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రజకులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి వారిని సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగయ్య అధ్యక్షతన రజకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సజ్జల మాట్లాడుతూ.. 18 లక్షల రజక కుటుంబాలకు డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా రూ. 17 వేల కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం వల్ల జరిగిన లబ్ధిని రజకులు సమావేశాల ద్వారా తెలియజేయాలన్నారు.

బహుజనుల అవిశ్రాంత పోరు

మూడు రాజధానులకు మద్దతుగా పెద్ద ఎత్తున బహుజనుల ఉద్యమం

- అమరావతిలో కులవాదుల అరాచకాలను ప్రపంచానికి తెలియజేసిన వైనం
- నేటితో 1,200వ రోజుకు బహుజన పరిరక్షణ సమితి దీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొని నిరసన తెలియజేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు (ఫైల్)

తాడికొండ: రాజధాని పేరిట అమరావతిలో కులవాదుల అరాచకాలు, అవినీతిని ప్రపంచానికి తెలియజేసేందుకు... రాజ్యాంగబద్ధంగా పేదలకు లభించిన హక్కులను కాపాడేందుకు... మూడు రాజధానుల వల్ల కలిగే ప్రయోజనాలను చాటిచెప్పేందుకు బహుజన పరిరక్షణ సమితి అవిశ్రాంత పోరాటం సాగిస్తోంది. రాజధాని ఒక కులానిది కాదని.. అందరిదని చాటిచెబుతోంది. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తోంది. భవిష్యత్‌లో మరో వేర్పాటువాద ఉద్యమానికి నేడు అమరావతిలో కులవాదుల వ్యవహారశైలి, నిర్ణయాలు కారణం కాకూడదని పోరాడుతోంది. ఈ మేరకు మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 1,200వ రోజుకు చేరనున్నాయి.

ఎక్కడ అన్యాయం జరిగిందో.. అక్కడే పోరాటం

రాష్ట్ర ప్రభుత్వం 2019, డిసెంబర్ 17న అసెంబ్లీలో మూడు రాజధానుల బిల్లును ఆమోదించింది. దీనిని వ్యతిరేకిస్తూ అమరావతి ఉద్యమం పేరుతో రైతుల ముసుగులో టీడీపీ నాయకులు దొంగ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం మూడు రాజధానుల దిశగా అడుగులు వేయకుండా కోర్టుకు వెళ్లి స్టేలు తీసుకువచ్చారు. అయితే, మూడు ప్రాంతాల సమానాభివృద్ధితోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని, రాష్ట్ర ఖజానా మొత్తం ఒకే ప్రాంతానికి దోచిపెట్టడం కారణంగా అందరి హక్కులకు భంగం వాటిల్లుతుందంటూ బహుజన పరిరక్షణ సమితి నాయకులు 2020, ఫిబ్రవరి 9న ఉద్యమం చేపట్టారు. ఎక్కడ రాజధాని పేరిట బహుజనులు, పేదల భూములు దోచుకున్నారో.. ఎక్కడ అమాయకులకు అన్యాయం జరిగిందో అక్కడే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత, బహుజన సంఘాలు మద్దతు తెలిపాయి. ప్రత్యక్షంగా 67 సంఘాలు, పరోక్షంగా దాదాపు 240 సంఘాల నేతలు ఈ ఉద్యమానికి సంఘీభావం తెలిపాయి. ఈ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కులవాదులు, పెత్తందారులు, ఆర్థిక ఉగ్రవాదులు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ బహుజన నేతలు వెరవకుండా నిర్విరామంగా తమ పోరాటం కొనసాగిస్తున్నారు.

మూడు రాజధానుల ద్వారానే బహుజనులకు మేలు

1,199వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

మూడు రాజధానుల ద్వారానే బహుజనుల ఆర్థిక, సామాజిక ఎదుగుదల సాధ్యమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 1,199వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు పేదల కోసం చేసిన ఒక్క మంచిపని అయినా ఉంటే చూపించి ఓట్లు అడగాలని సూచించారు. విభజన అనంతరం బాబు చేసిన తప్పుడు పనుల కారణంగానే రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అమరావతి పేరుతో కేవలం గ్రాఫిక్స్‌లను ఎల్లో మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసిన చంద్రబాబు ఈ ప్రాంతంలో ముందస్తు వ్యూహంతో బినామీల ద్వారా పెట్టుబడులు పెట్టి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి రూ.లక్షల కోట్లు లాభాలు పొందారని ఆరోపించారు.

ఇకపై ప్రేక్షకులే అమ్మానాన్నలు

- తండ్రి కృష్ణను గుర్తుచేసుకుని మహేష్‌బాబు భావోద్వేగం
- నంబూరు క్రాస్‌రోడ్స్‌లో 'గుంటూరు కారం' ప్రీ రిలీజ్ ఈవెంట్
- అభిమానుల సందడితో హోరెత్తిన ప్రాంగణం



ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో మహేష్‌బాబు, తదితరులు

పెదకాకాని: ఇకపై ప్రేక్షకులే తనకు అమ్మానాన్నలని, తన ప్రతి సినిమా విడుదల సందర్భంగా తండ్రి కృష్ణ ఫోన్ చేసి అభినందించే వారని, ఈసారి మాత్రం ఆయన లేరంటూ హీరో మహేశ్‌బాబు భావోద్వేగానికి గురయ్యారు. గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలోని నంబూరు అడ్డరోడ్డు వద్ద మంగళవారం రాత్రి 'గుంటూరు కారం' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో మహేష్ బాబు మాట్లాడుతూ ఇకపై ఫ్యాన్సే తనకు అమ్మానాన్నలని, ఎప్పటిలాగే తనకు అండగా ఉండాలని కోరారు. దర్శకుడు త్రివిక్రమ్ తనకు ఆప్తుడని.. త్రివిక్రమ్ 'ఐ లవ్ యూ' అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. సంక్రాంతి బాగా కలిసొచ్చిందని, ఈ సారి కూడా 'గుంటూరు కారం' హిట్ అవుతుందని మహేష్ అన్నారు. చిత్ర దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ.. సినిమా కోసం మహేశ్‌బాబు 200 శాతం కష్టపడతాడని ప్రశంసించారు. హీరోయిన్లు శ్రీలీల ,మీనాక్షి చౌదరి, నిర్మాత రాధాకృష్ణ, రమ్యకృష్ణ, ప్రకాష్‌రాజ్, రావు రమేష్, తదితరులు ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. కాగా, నిర్వాహకుల వైఫల్యం వల్ల ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తొక్కిసలాట జరిగింది. పరిమితికి మించి పాస్‌లు ఇవ్వడం.. నిర్వాహకులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఫ్యాన్స్ ఇబ్బంది పడ్డారు. ఒక దశలో తొక్కిసలాట జరిగింది. పోలీసులు వారి నిలువరించేందుకు లాఠీ చార్జి చేయాల్సి వచ్చింది. పాత గుంటూరు ఎస్సై వెంకట్రావుకు గాయాలయ్యాయి. రేకుల షెడ్డు కూలడంతో 20 మందికి స్వల్పగాయాలయ్యాయి.

జేసీ అనుచరుల బరితెగింపు



జేసీ అనుచరుల దాడిలో గాయపడిన రామకృష్ణ

పెద్దపప్పూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులతో ప్రజలను భయాందోళనకు గురిచేయిస్తున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం చీమలవాగుపల్లిలో మంగళవారం జేసీ ప్రభాకర్‌రెడ్డి తనయుడు జేసీ అస్మిత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో సోమవారం రాత్రే గ్రామాన్ని టీడీపీ జెండాలతో నింపేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామకృష్ణ ఇంటిపై కూడా టీడీపీ జెండా కట్టేందుకు ప్రయత్నించగా, అతను అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన జేసీ అనుచరులు సత్యనారాయణ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, తులసి రాముడు, బుదిగి రమణ తదితరులు రామకృష్ణతో ఘర్షణకు దిగారు. దుర్భాషలాడటంతో పాటు అతని ఇంటిపై కర్రలు, రాళ్లతో దాడికి తెగబడ్డారు. దీంతో రామకృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు అతన్ని పెద్దపప్పూరు ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శరత్ చంద్ర తెలిపారు.

బెజవాడలో సైకిల్ బేజార్!



కేశినేని భవన్‌పై టీడీపీ బ్యానర్లు తీసివేసి విజయవాడ ఎంపీ కార్యాలయంగా బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాజకీయ రాజధాని బెజవాడ గడ్డపై టీడీపీ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. విజయవాడలో పార్టీ దుస్థితికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పుత్రోత్సాహమే ప్రధాన కారణమనే చర్చ రాజకీయ విశ్లేషకుల్లో సాగుతోంది. టీడీపీని వీడుతున్నట్లు ఎంపీ కేశినేని నాని 4 రోజుల క్రితం ప్రకటించగా ఆ మర్నాడే కేశినేని శ్వేత సైతం పార్టీకి గుడ్‌బై చెప్పారు. 2సార్లు ఎంపీగా గెలిచిన కేశినేని నాని పలు కార్యక్రమాలతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లారు. తాజాగా కేశినేని భవన్‌పై టీడీపీ బ్యానర్లు, జెండాలను సైతం తొలగించారు. పలువురు టీడీపీ నేతలు సైతం పార్టీని వీడేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

కోడి పందేలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోండి

- అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ విషయంలో గతంలో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్రీభానుమతి ఉత్తర్వులు జారీ చేశారు. కోడి పందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ జి.వెంకటరత్నం, వై. ఉమాశంకర రాజు, మరికొందరు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ భానుమతి మంగళవారం విచారణ జరిపారు. కోడి పందేలు నిర్వహించకుండా గట్టి చర్యలు తీసుకోవాలని గతంలోనే హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కేవీఎల్ నరసింహారావు తెలిపారు. ఈ వాదనలను ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వేలూరి మహేశ్వర్‌రెడ్డి తోసిపుచ్చారు. కోడి పందేలు, జూదం నిర్వహణకు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. అధికారుల నుంచి అందిన సమాచారాన్ని కోర్టు ముందుంచారు. మహేశ్వర్‌రెడ్డి వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ భానుమతి.. కోడి పందేల విషయంలో ధర్మాసనం తీర్పు అమలుకు గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ పిటిషన్లను పరిష్కరించారు.

'ఏపీ పెన్షన్ విధానం బాగుంది'

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల కోసం తీసుకువచ్చిన పెన్షన్ విధానం బాగుందని.. ఏపీ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయం హర్షించదగిందని తెలంగాణ సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చీటి భూపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వెంటనే ఈ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్

సాక్షి, అమరావతి: ఇంజనీరింగ్ విద్యార్థులు మార్కెట్‌లో పోటీని తట్టుకుని ఉద్యోగాలు సాధించేలా అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రముఖ గ్లోబల్ సర్టిఫికేషన్ ట్రైనింగ్ సంస్థ 'ఎక్సెల్ ఆర్' సంయుక్తంగా 'స్కిల్ ఆఫ్ ఫైనల్ ఇయర్స్' ప్రోగ్రామ్‌ను మంగళవారం ప్రారంభించింది. చివరి ఏడాది విద్యార్థులకు 3 నెలల పాటు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్‌లో భాగంగా క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ స్కిల్స్, మాక్ ఇంటర్వ్యూల ద్వారా నైపుణ్యాలను అందిస్తూ విద్యార్థులను ఉద్యోగాలకు సంసిద్ధులను చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె. హేమచంద్రారెడ్డి నైపుణ్యాభివృద్ధి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్)రవి, ఎక్సెల్ ఆర్‌కు చెందిన కోటగరం సాయికిరణ్ పాల్గొన్నారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.